

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 199

సోమవారం 9-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మంచిమాట



అసలు... కొసరు

ఏక క్రియా ద్వ్యర్థి కరీ అన్నారు పెద్దలు. రాతి మీద నూరటం కత్తికి పదును కోసం, రాయి నునుపు కోసం కాదు. ఏదైనా ఒక పని చేసేటప్పుడు అనుకున్న దానితో పాటు కొన్ని అవాంతర ఫలితాలు కూడా వస్తూ ఉంటాయి. వాటిలో కొన్ని పనికివచ్చేవి, కొన్ని పనికిరానివి ఉంటాయి. కొన్ని సందర్భాలలో అసలు ప్రయోజనం మర్చిపోయి, ఈ కొసరుదే సరి అనుకునే ప్రమాదం కూడా ఉంది.

పిల్లలకి స్నానం చేయించి, శుభ్రమైన యూనిఫారం వేసి, తల దువ్వి, షూస్ బాగా మిలమిలా మెరిసేట్లు పాలిష్ చేసి, పుస్తకాలు సద్ది, బ్యాగులో పెట్టి, ప్రేమతో తినిపించి, డబ్బా కట్టి బడికి పంపటానికి సిద్ధం చేస్తారు. బడికి వెళ్ళటంతో ప్రయోజనం సిద్ధించదు. అసలు ప్రయోజనం అక్కడికి వెళ్ళి చదువుకుంటే కలుగుతుంది. తయారు అవటం క్రమశిక్షణలో భాగం మాత్రమే.

వరి సాగు చేయటం ధాన్యం కోసం. కాని వరిగడ్డి కూడా వస్తుంది. దాని వల్ల లాభం వస్తుంది అని గడ్డి కోసం వరి సాగు చేయరు. అంతే కాదు గడ్డి ఎక్కువగా పెరగటం కోసం ఎరువు వేయరు.వడ్లు బాగా రావాలని తగిన ఎరువులు వేస్తారు.

ఆవులని పాల కోసం పోషిస్తారు. గోమయం, గోమూత్రం కూడా మానవులకి ఎంతగానో ఉపయోగ పడతాయి. ఒకప్పుడు వాటిని పొలాలలో ఎరువుకి వాడేవారు. గోమయంతో పిడకలు చేసి ఇంధనంగా ఉపయోగించేవారు. ఆయుర్వేద ఔషధాల తయారీలో వాడేవారు. ఇప్పుడు వాటిని మరెన్నింటికో ఉపయోగిస్తున్నారు. కాని ఎవరూ ఆవులని పేడకోసమో, మూత్రం కోసమో పెంచరు కదా! అవసరం అనుకుంటే ఆవులున్న వారి దగ్గరకు వెళ్ళి తెచ్చుకుంటారు.

అరవిందాశ్రమంలో శ్రీ మాతగా ప్రసిద్ధి పొందిన మిర్రా సాధన ప్రారంభించిన మొదట్లో అద్భుతమైన అందంతో ప్రకాశించటం మొదలు పెట్టిందిట. శారీరిక, మానసిక ఆరోగ్యాలు ఉండటమే అందం. వెంటనే ఆవిడ ఇది నా ప్రయోజనం కాదు అని ఆ శక్తిని భౌతిక శరీరం నుండి ఉపసంహరించింది. లక్ష్యసాధనలో ఎదురయ్యే ఇటువంటి వాటిని పరమార్థం అనుకోకుండా ముందుకి సాగాలి.

ఖాళీ సీసాలు సేకరించి అమ్ముకునే వాడితో ఒక పెద్దమనిషి "నీకోసమేనయ్యా నేను రాత్రి అంతా కూర్చుని సీసాలు ఖాళీ చేసేది." అన్నాడట! ఆహా! ఏమి సమర్థింపు!! ఈ సందర్భంలో పండిట్ జవహర్లాల్ నెహ్రూగారిని స్మరించక తప్పదు. స్వతంత్రోద్యమంలో ప్రధాన భాగంగా విదేశీ వస్తు దహనం ముమ్మరంగా జరుగుతున్న సందర్భంలో ఎవరో "మీరు విదేశీ సిగరెట్లు కాలుస్తున్నారు. మనం విదేశీ వస్తువులు వాడం కదా!" అన్నారుట. దానికి నెహ్రూ గారు నవ్వుతూ... "అందుకే కదా దహనం చేస్తున్నాను." అన్నారుట.

> క్షీరసాగర మథనం చేసింది అమృతం కోసం. ఆ లోపు పాల సముద్రం నుండి ఎన్నో విశిష్ట వస్తువులు ఉద్భవించాయి - లోకోపద్రవ కారకమైన హాలాహలం నుండి కల్పవృక్షం, కామధేనువు, చంద్రుడు వంటి వారి నుండి లక్ష్మీదేవి వరకు. తెలివిగల వారు దేనిని ఏ విధంగా వినియోగించుకోవాలో, ఆ విధంగా వినియోగించుకున్నారు. తమ లక్ష్యమైన అమృతం సిద్ధించే వరకు పాలసముద్రాన్ని చిలకటం కొనసాగించారు. కల్పవృక్షం వంటి వాటి కోసం మళ్ళీ అటువంటి ప్రయత్నం చేయలేదు.

పేలాల కోసం కుప్పలు తగల బెట్టటం అనే సామెత ఉంది. వరిపేలాల కోసం వడ్లని వేయిస్తారు. కాసిని వడ్లతో సరిపోయేదానికి మొత్తం కుప్పని తగల బెట్టటం తెలివి గల పనేనా?

ప్రధానమైన ప్రయోజనం కోసం ప్రయత్నం చేస్తుంటే కొన్ని అనుకోనివి కూడా లభిస్తాయి. వాటిని పట్టించుకుంటే దృష్టి చెదిరే ప్రమాదం ఉంది.

– డా.ఎన్. అనంతలక్ష్మి

బౌద్ధవాణి

శీల సంపన్నుడు

వారణాసి పట్టణంలో సుప్రబుద్ధి అనే వ్యాపారి ఉన్నాడు. దేశవిదేశాల్లో వ్యాపారం చేసి ఎంతో ధనం సంపాదించాడు. అతనికి సుజాత అనే పెళ్ళీడుకొచ్చిన కుమార్తె ఉంది. సుగుణాల రాశి. అందాల బొమ్మ. అందానికి అందం. సంపదకి సంపద పుష్కలంగా ఉండటంతో ఎందరో ఆమెను పెళ్ళాడలనుకున్నారు. తమ తమ ఆస్తి వివరాలు, చిత్రపటాలూ పంపారు. సుప్రబుద్ధి భార్యకు వారిలో ధననందుడు నచ్చాడు. ఎందుకంటే ఆ పెళ్ళి కుమారులందరిలో అతనే అందగాడు. రంగూ, రూపం చాలా బాగుంది. "ధననందుని తల్లిదండ్రులకి కబురు పంపండి" అంది ఆమె.

సుప్రబుద్ధుని తండ్రికి మాత్రం విక్రముడు నచ్చాడు. అతను అవంతీనగర శ్రేష్ఠి కుమారుడు. ధనం, వంశగౌరవం కలవాడు కాబట్టి "విక్రముని కుటుంబంతోనే వియ్యమందుదాం" అన్నాడు పెద్దాయన. ధనం కంటే వంశం కంటే ఆరోగ్యమే మహాభాగ్యం అనుకున్నాడు సుప్రబుద్ధి. కాబట్టి అతనికి ఉజ్జయినీ యువకుడు ఉదయనుడు నచ్చాడు. తన కుమార్తెను చేపట్టేవాడు ఆరోగ్యంతో దీర్ఘాయువుగా ఉండాలి. పెళ్లంటే నూరేళ్ళ పంట. కాబట్టి ఉదయనుడే తనకు అల్లుడైతే చాలు అనుకున్నాడు. అలా ఆ ముగ్గురి అభిప్రాయాలూ వేరు వేరుగా ఉన్నాయి. కాబట్టి తన కుమార్తె అభిప్రాయం అడగాలనుకున్నాడు. వెంటనే పిలిచి తమ తమ అభిప్రాయాలు చెప్పి-

"అమ్మా! సుజాతా! మా ముగ్గురి అభిప్రాయాలు వేరుగా ఉన్నాయి. వీరిలో ఎవరు అయితే నీకిష్టం?" అని అడిగాడు. సుజాత చిరునవ్వు నవ్వింది. మౌనం వహించింది. "సందేహించక చెప్పు తల్లీ!" అన్నాడు.

"నాన్నా! నాకు ఈ మూడు రకాల వారూ వద్దు. గుణవంతుడు, శీలవంతుడు అయితే చాలు" అని లేచి అక్కడి నుంచి మేడ మీదికి పరుగు తీసింది సిగ్గుపడుతూ.

ఆ వచ్చిన వారిలో అలాంటి యువకుడు మగధకు చెందిన శీలభద్రుడున్నాడు. ఈ విషయంపై ఇంట్లో తర్జన భర్జనలు జరిగాయి. ఎటూ తేల్చుకోలేకపోయాడు సుప్రబుద్ధి.

మధ్యాహ్నం దాటాక సారనాథ్‌లోని జింకల వనానికి చేరాడు. అక్కడ వెదురు చెట్ల కింద కూర్చొన్న బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. నమస్కరించి, విషయం చెప్పాడు. అప్పుడు బుద్ధుడు-



"సుప్రబుద్ధీ! ఒకడు చాలా అందగాడు. మంచి శరీర వర్ణం గలవాడు. కన్నూ, ముక్కు తీరు బావుంటుంది. కానీ వాడు ఒక దొంగ అనుకో. అందగాడని దొంగను ఇష్టపడతావా?"

"లేదు భగవాన్!"

"అలాగే.. ఒకడు సోమరి. అజ్ఞాని. కానీ, ఆరోగ్యవంతుడు. అతణ్ణి ఇష్టపడతావా?"

"ఇష్టపడను భగవాన్!"

"ధనవంతుడు, గొప్ప వంశం కలవాడు. కానీ.. వాడు జూదరి. తాగుబోతు. తిరుగుబోతు. అతను నీకు ఇష్టమేనా?"

"కాదు భగవాన్! ఇష్టం కాదు"

"చూశావా! అందగాడైనా, ఆయుష్షు గలవాడైనా, ధనవంతుడైనా ఇష్టం కాదు అనే అంటున్నావు. అవునా! సుప్రబుద్ధీ! వీటన్నిటి కంటే గుణమే ప్రధానం. నీ కుమార్తె కోరినట్లు గుణవంతుడు, శీలవంతుడు నీకు అల్లుడైతే, నీవూ, నీ కుమార్తె, నీ కుటుంబం, నీ బంధువర్గం అందరికీ గౌరవం." అన్నాడు.

"భగవాన్! నా కుమార్తె ఇష్టం ప్రకారమే ఆమె పెళ్ళి చేస్తాను పెద్ద మనస్సుతో అంగీకరిస్తాను" అంటూ సుప్రబుద్ధి సంతోషంతో లేచి వెళ్ళాడు. అలాగే చేశాడు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

సంగీతం.. సనాతనం

సరస్వతీ దేవి వీణ పట్టుకుని పరమశివుని వైభవాన్ని గానం చేస్తుంటే... అమ్మవారు తాంబూల చర్వణం చేస్తూ, తల ఊపుతూ చిరునవ్వుతో వింటూ ఉంటుందట. ప్రవచనం వినేటప్పుడు కదలకుండా కూర్చుని వినాలి, సంగీతం వినేటప్పుడు తల కదుపుతూ మన అంగీకారాన్ని, సంతోషాన్ని ప్రకటించడం సభామర్యాద. సరిగమపదనీరతాం శాంతం మృదుల స్వాంతం... అన్నాడు కాళిదాస మహాకవి. ఉద్వేగం తో ఉండాల్సిన మహాశక్తి అంత ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతున్నది అంటే... ఆమె సంగీతంలో అంతగా రమిస్తున్నదట. అసలు ఆ సంగీతంలో రమించే మనసు ఎవరికుంటుందో, దానిలో తడిసిముద్దయిపోయే మనసు ఎవరికుంటుందో వారు పరమ కోమలమైన మనసు కలిగి ఉంటారు. మృదువైన మనసు అంటే.. అవతలివారి కష్టం తమ కష్టం అన్నంత బాధపడిపోతూ, దానిని తీర్చడానికి వారు ముందుకు పరిగెడతారు. ఆ దయ, ఆ కరుణ, ఆ ప్రశాంత స్థితి పొందినప్పుడు తమపట్ల కృతఘ్నులై ఉన్నా పట్టించుకోరు. అమ్మవారే కాదు, అయ్యవారిదీ అదే పరిస్థితి.



'నాదతనుమనిశం శంకరం' అని త్యాగరాజ స్వామి ఒక కీర్తన చేశారు. నిజానికి శంకరుడి శరీరం నాదమే. 'సద్యోజాతాది పంచ వక్త్రజ సరిగమపదని వర సప్తస్వరవిద్యాలోలం...'' లౌల్యం అట ఆయనకు .. ఏ సంగీతం మీద... అంటే... అసలు శంకరుడివే ఐదు ముఖాలు. సద్యోజాత, అఘోర, సత్పురుష, వామదేవ, ఈశానములు. సద్యోజాతం పశ్చిమాన్ని చూస్తుంది. అందుకే శివాలయాల్లో... పశ్చిమ ముఖంగా ఉండే శివాలయం గొప్పదంటారు. అఘోర ముఖం– దక్షిణం. సత్పురుష ముఖం – తూర్పు. వామదేవ ముఖం – ఉత్తరం. ఈశాన ముఖం –ఊర్ధ్వ ముఖం. ఇవి ఐదు.. ఐదు శక్తులను కలిగి ఉంటాయి. అందుకే శివుడికి ఎటువైపు అభిషేకం చేసినా ఆయనకు అందుతుంది. ఆ ముఖాలతో ఆయన సరిగమలనబడే వాటియందు ఎప్పుడూ రమిస్తుంటాడు. లౌల్యం అంటే... ఇక ఇప్పటికి చాల్లేండి... అన్న మాట అనకుండా ఎంత అనుభవించినా, ఎంత చేసినా ఇంకా చేయాలనిపిస్తే లౌల్యం అంటారు.

అసలు ఆ స్వరాలు ఎక్కడ పుట్టాయంటే... అవి ఆయన ఐదు ముఖాల్లోంచే పుట్టాయి. సప్త స్వరాలు ఏడయినప్పుడు ముఖాలు ఐదే కదా... అన్నప్పుడు... వీటిలో షడ్జం, పంచమం.. స, ప స్వరాలు. వీటిని ప్రకృతి స్వరాలంటారు. పరమశివుడు ఎంత సనాతనుడో, ఎంత స్వయం భూనో, ఆయనకు ఆద్యంతాలు ఎలా లేవో అలా సంగీతంలో ఈ రెండు ప్రకృతి స్వరాలూ ఆద్యంతాలు లేకుండా ఈశ్వరుడంతటి నిత్యములు, సనాతనాలై ఉన్నాయి. మిగిలినవి వికృతి స్వరాలు. అవి మిగిలిన ఐదు ముఖాల్లో నుంచి వచ్చాయి. అంటే సంగీతం ఎంత శక్తిమంతమో, భారతీయ సంగీతంలో సప్త స్వరాలు అంతే శక్తిమంతమూ, సనాతనమై, నిత్య నూతనమై వెలుగుతున్నాయి.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

కల నెరవేరనుందా?



పూజా హెగ్డేకి బోలెడన్ని కలలు ఉన్నాయి. వాటిలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ సరసన నటించాలన్న కల ఒకటి. 'షారుక్ ఖాన్ రొమాంటిక్ లుక్స్ అంటే నాకిష్టం. అందుకోసమే ఆయన సినిమాలు చూడ్డానికి ఇష్టపడతాను. షారుక్ రొమాంటిక్ కింగ్' అని గతంలో ఓ సందర్భంలో పూజా పేర్కొన్నారు కూడా. షారుక్ సరసన నటించాలనే తన కల నెరవేరే చాన్స్ ఉందని కూడా ఆమె అన్నారు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైనట్లుంది. ప్రస్తుతం షారుక్ 'డంకీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. 'డంకీ' తర్వాత షారుక్ నటించనున్న చిత్రంలోనే పూజా హెగ్డే ఈ బాలీవుడ్ బాద్‌షా సరసన నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. కాగా, షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ కాంబినేషన్‌లో రూపొందనున్న 'టైగర్ వెర్సస్ పఠాన్'లోనే పూజా హెగ్డే నటించనున్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

• పూజా హెగ్డే

వేసవిలో 171 షురూ

బ్రేక్ తీసుకునేది లేదు అన్నట్లు రజనీకాంత్ వరుసగా సినిమాలు చేస్తున్నారు. ఆయన హీరోగా నటించిన 'జైలర్' ఇటీవల విడుదలై, బంపర్ హిట్ సాధించింది. ప్రస్తుతం టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తన 170వ సినిమా చేస్తున్నారు రజనీ. ఇప్పటికే తన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో 'లాల్ సలాం' చిత్రంలో కీ రోల్ చిత్రీకరణ పూర్తి చేశారు. ఇక 170వ సినిమా పూర్తయిన వెంటనే 171వ సినిమాతో బిజీ అవుతారు రజనీ. ఈ చిత్ర దర్శకుడు లోకేశ్ కనగరాజ్ వెల్లడించిన ప్లాన్ ప్రకారం వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభమవుతుంది. ఏప్రిల్‌లో చిత్రీకరణ ఆరంభించేలా లోకేశ్ ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం విజయ్ హీరోగా లోకేశ్ దర్శకత్వం వహించిన 'లియో' ఈ నెల 19న రిలీజ్ కానుంది. కొన్ని నెలలుగా 'లియో'తో బిజీగా గడిపిన లోకేశ్ ఈ చిత్రం విడుదల తర్వాత చిన్న గ్యాప్ తీసుకుని, రజనీ 171వ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు ఆరంభిస్తారట. నిజానికి ఈ చిత్రకథను తాను దర్శకత్వం వహించిన 'మానగరం' (2017)కి ముందే రాశారట. ఒక ఫ్రెండ్ కోసం రాసిన ఈ కథను రజనీకాంత్‌కి వినిపించగా ఆయనకు నచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. అలాగే ఈ చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాల్లో కొన్నింటిని 'ఐమ్యాక్స్ కెమెరా'తో చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నామని లోకేశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.


• రజనీకాంత్

ఒక్క ట్వీట్‌తో గుడ్‌బై చెప్పాలనుకున్నా!


• లోకేశ్ కనగరాజ్

"దర్శకుడిగా చిత్ర పరిశ్రమలో ఎక్కువ కాలం ఉండాలనుకోవడం లేదు.. కెరీర్ పరంగా గర్వపడే స్థాయిలో ఉన్నప్పుడు ఒక్క ట్వీట్‌తో దర్శకత్వానికి గుడ్‌బై అని అనౌన్స్ చేయాలనుకున్నా" అన్నారు డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్. దర్శకుడిగా త్వరగా రిటైర్‌మెంట్ తీసుకుంటా అని గతంలో ఓసారి చెప్పిన లోకేశ్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలోనూ ఇదే విషయంపై స్పందించారు. "సినిమా ఇండస్ట్రీలో నేను ఎక్కువ కాలం ఉండాలనుకోలేదు. 10 మంచి సినిమాలు చేసి వీలైనంత త్వరగా రిటైర్ అవ్వాలనుకున్నాను. కెరీర్ పరంగా గర్వపడే స్థాయిలో ఉన్నప్పుడు ఒక్క ట్వీట్‌తో గుడ్‌బై అని అనౌన్స్ చేయాలనుకున్నాను. ఆ తర్వాత ఎన్నో ప్రదేశాలకు వెళ్లాలని ప్రణాళిక వేసుకున్నాను. అయితే, ఇటీవల ఓ వేడుకలో దర్శకులందరం కలిశాం. రిటైర్‌మెంట్ ప్రయత్నాలను విరమించుకోవాలని వాళ్లు సూచించారు.. వాళ్ల మాటలపై ఉన్న గౌరవంతో రిటైర్‌మెంట్ గురించి ఇప్పుడే మాట్లాడాలనుకోవడం లేదు" అన్నారు.

లారెన్స్ సినిమా నుంచి వాకౌట్?

లేడీ సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న నయనతార లేడీ ఓరియంటెడ్ మూవీస్‌తో పాటు రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల్లో హీరోల సరసన నటిస్తుంటారు. దక్షిణాదిన సక్సెస్‌ఫుల్ హీరోయిన్ అనిపించుకున్న నయన 'జవాన్' వంటి బ్లాక్ బస్టర్ హిట్‌తో హిందీ పరిశ్రమలోనూ విజయవంతంగా కెరీర్ ఆరంభించారు. ఇక ప్రస్తుతం 'ది టెస్ట్' చిత్రంతో పాటు మరో చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు నయనతార. కాగా, రత్నకుమార్ దర్శకత్వంలో లారెన్స్ హీరోగా రూపొందనున్న చిత్రంలో ఈ బ్యూటీ హీరోయిన్‌గా ఖరారయ్యారనే వార్త వినిపించింది. తాజాగా ఈ చిత్రం నుంచి ఆమె తప్పుకున్నారని టాక్. డేట్స్ సర్దుబాటు చేయలేక నయన ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


• నయనతార

వినోదం.. యాక్షన్

త్రిగుణ్ హీరోగా సురేష్ కుమార్ ఆకిరి దర్శకత్వం వహించిన చిత్రం 'గంజామ్'. ప్రణమ్ దేవరాజ్, హ్రితికా శ్రీనివాస్, విస్మయ, దేవరాజ్, రఘు కుంచె, అనితా చౌదరి ముఖ్య పాత్రలు పోషించారు. ఏవీఆర్ ఆర్ట్స్, ఏయు–ఐ బ్యానర్స్‌పై రత్నాజీ నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా త్రిగుణ్ మాట్లాడుతూ– "నేను చేసున్న 23వ సినిమా 'గంజామ్'. ఎప్పుడూ నన్ను ఆదరిస్తూ, అభిమానిస్తున్న తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమాకు మీ అందరి సపోర్ట్ కావాలి" అన్నారు. "వినోదం, యాక్షన్‌తో పాటు సామాజిక స్పృహ కలిగిన సినిమా 'గంజామ్'. నాకు అవకాశం ఇచ్చిన రత్నాజీగారికి ధన్యవాదాలు. త్రిగుణ్‌కి ఈ సినిమా మరో మంచి హిట్‌గా నిలుస్తుంది" అన్నారు సురేష్ కుమార్ ఆకిరి. "ఒక మంచి ప్రయత్నం మా 'గంజామ్'. ఈ సినిమా అందర్నీ ఆలోచింపజేసేలా ఉంటుంది" అన్నారు రత్నాజీ. "కథా బలం ఉన్న 'గంజామ్' విజయం సాధిస్తుంది" అన్నారు చిత్ర సంగీతదర్శకుడు, నటుడు రఘు కుంచె. ఈ చిత్రానికి కెమెరా: 'గరుడవేగ' అంజి.


• హ్రితికా శ్రీనివాస్, త్రిగుణ్

ఫైట్.. హైలైట్


• మంచు లక్ష్మి

మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. రావుల వెంకటేశ్వర రావు సమర్పణలో అన్విక్షా ఆర్ట్స్–అమెరికా ఇండియా ఎంటర్‌టైన్మెంట్స్‌పై రూపొందింది. కాగా ఆదివారం (అక్టోబర్ 8) మంచు లక్ష్మి పుట్టినరోజుని పురస్కరించుకుని 'ఆదిపర్వం'లోని ఆమె ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా సంజీవ్ మేగోటి మాట్లాడుతూ– "1974-1990 మధ్యకాలంలో జరిగిన వాస్తవ ఘటనలతో ఈ చిత్రం రూపొందింది. హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాతో పాటు ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ చిత్రంలో మంచు లక్ష్మి పాత్ర ఆమె కెరీర్‌లోనే చిరస్థాయిగా నిలిచిపోతుంది. తను చేసిన రెండు ఫైట్స్ సినిమాకి హైలెట్‌గా నిలుస్తాయి. 'అమ్మోరు, అరుంధతి' చిత్రాల తరహాలో కథ, గ్రాఫిక్స్ ఉంటాయి" అన్నారు. "రెట్రో ఫీల్‌తో ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా మొదలై కంప్లీట్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం అలరిస్తుంది" అన్నారు చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఘంటా శ్రీనివాస రావ్, సహనిర్మాత గోరెంట శ్రావణి. ఈ చిత్రంలో ఆదిత్య ఓం, ఎస్తేర్, సుహాసిని తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.

ద్రోహి

సందీప్ కుమార్, దీప్తీ వర్మ జంటగా విజయ్ పెందుర్తి దర్శకత్వం వహించిన చిత్రం 'ద్రోహి'. 'ద క్రిమినల్' అన్నది ఉపశీర్షిక. గుడ్ ఫెలో మీడియా, సఫైరస్ మీడియా, వెడ్నెస్ డే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై విజయ్ పెందుర్తి, డి. శ్రీకాంత రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ రోజు నేషనల్ సినిమా డేని పురస్కరించుకుని మల్టీప్లెక్స్‌లో రూ. 112లకే సినిమా టిక్కెట్ ఇస్తున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమా టీజర్‌ని నటుడు త్రిగుణ్ విడుదల చేసి, మాట్లాడుతూ– "సందీప్, విజయ్‌లకు కళ అంటే ప్రాణం. దర్శకుడి పని తీరు టీజర్‌లో కనిపించింది. ఈ చిత్రం విజయం సాధిస్తుంది" అన్నారు. "అద్భుతమైన డ్రామాగా తెరకెక్కిన చిత్రమిది. క్రైమ్, థ్రిల్లర్‌తో పాటు అన్ని అంశాలున్నాయి" అన్నారు సందీప్ కుమార్. "ఈ చిత్రంలో ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలు ఉన్నాయి.. ఎవర్నీ నిరాశపరచదు" అన్నారు విజయ్ పెందుర్తి. "మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి" అన్నారు నటి డెబాడాలీ. ఈ చిత్రానికి కెమెరా: అశోక దార్భ్రు, సంగీతం: అనంత నారాయణ్.


• సందీప్ కుమార్, దీప్తీ వర్మ

చేగువేరా పోరాటం


• బీఆర్ సభావత్ నాయక్

క్యూబా పోరాట యోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'చే'. 'లాంగ్ లివ్' అన్నది ఉపశీర్షిక. బీఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషించి, దర్శకత్వం వహించారు. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్‌పై సూర్య, బాబు, దేవేంద్ర నిర్మించారు. నేడు (అక్టోబర్ 9) చేగువేరా వర్ధంతి సందర్భంగా 'చే' టీజర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా బీఆర్ సభావత్ నాయక్ మాట్లాడుతూ– "క్యూబా తర్వాత ప్రపంచంలో, తొలిసారి భారతీయ చిత్ర పరిశ్రమలో రూపొందుతున్న చేగువేరా బయోపిక్ 'చే'. విప్లవ వీరుడు, యువతకి స్ఫూర్తి అయిన చేగువేరా జీవిత చరిత్రను సినిమాగా తీయడం చాలా గర్వంగా ఉంది. ఆయన చేసిన పోరాటలు, త్యాగాలు ఈ చిత్రంలో చూస్తారు. 'చే' పోస్టర్‌ను చేగువేరా కుమార్తె డా. అలైదా గువేరా విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. మా సినిమా ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. నవంబర్‌లో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కల్యాణ్ సమి, జగదీష్, సంగీతం: రవిశంకర్.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 199

సోమవారం 9-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



తడబడినా.. గెలిచారు

ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై 6 వికెట్ల తేడాతో భారత్ విజయం.. - 10లో



లిమిట్ పెంచుకుంటున్నారా?

క్రెడిట్ కార్డు లిమిట్ పెంపుతో ఉన్న ప్రయోజనాలు, రిస్క్‌లపై కథనం. - 13లో



'ఆదిత్య' మార్గాన్ని చక్కదిద్ది..

ఆదిత్య-ఎల్1 ఉపగ్రహ మార్గాన్ని సరిదిద్దే ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు ఇస్రో ఆదివారం ప్రకటించింది.

వివరాలు 6లో ▸



అత్యుత్తమమైనదిగా ఐఏఎఫ్

ఎయిర్‌ఫోర్స్ డేను పురస్కరించుకుని ప్రధాని మోదీ, ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి యుద్ధ వీరులకు శుభాకాంక్షలు తెలిపారు.

వివరాలు 6లో ▸



ఏడాదిలో 2సార్లు బోర్డు పరీక్షలు

10, 12వ తరగతి బోర్డు పరీక్షలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడాదిలో 2సార్లు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



ఎన్నికల వ్యూహమే అజెండాగా..

లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ సోమవారం జరగబోతోంది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్


ఆర్బీకేలపై ఎందుకంత అక్కసు!?

- విత్తు నుంచి విక్రయం వరకు రైతుకు అండగా ఆర్బీకేలు
- గతంలో రోజుల తరబడి పడిగాపులు.. నేడు సీజన్‌కు ముందుగానే పంపిణీ
- ముందస్తు రబీ కోసం ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు
- నాలుగేళ్లలో రెండు కోట్ల మందికి పైగా సేవలు
- అనతికాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతి.. కేంద్రంతో సహా విదేశీ ప్రముఖుల ప్రశంసలు
- ఆర్బీకేల సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు పోటీపడుతున్న రాష్ట్రాలు
- రాష్ట్ర ప్రభుత్వంతో ఇథియోపియా ఒప్పందం
- దేశంలోనే యూఎన్ చాంపియన్ అవార్డుకు నామినేట్
- ఆర్బీకేల స్ఫూర్తితో జాతీయ స్థాయిలో పీఎం సమృద్ధి కేంద్రాలు
- ఇంత ఘనత సాధించిన వీటిపై పనిగట్టుకుని బురదజల్లుతున్న ఈనాడు

- వివరాలు 3లో ▸

నగోయాలో కలుద్దాం!

- ముగిసిన హాంగ్జౌ ఆసియా క్రీడలు
- వరుసగా 11వ సారి పతకాల పట్టికలో చైనాయే టాప్
- మొదటిసారి స్వర్ణాల్లో 200 మార్క్ దాటిన చైనా
- 107 పతకాలతో నాలుగో స్థానంలో భారత్



- క్రీడాభిమానులను గత 16 రోజులుగా అలరించిన ఆసియా క్రీడలకు ఆదివారం తెరపడింది. చైనాలోని హాంగ్జౌ నగరంలో జరిగిన 19వ ఆసియా క్రీడలు ఘనంగా ముగిశాయి. తదుపరి ఆసియా క్రీడలు 2026లో జపాన్‌లోని నగోయా నగరంలో జరుగుతాయి. మొత్తం 45 దేశాల నుంచి 40 క్రీడాంశాల్లో 12,407 మంది క్రీడాకారులు పోటీపడిన హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా 201 స్వర్ణాలు, 111 రజతాలు, 71 కాంస్యాలతో మొత్తం 383 పతకాలు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. 107 పతకాలతో భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసి నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఆసియా క్రీడల్లో 13 కొత్త ప్రపంచ రికార్డులు, 26 ఆసియా రికార్డులు, 97 ఆసియా క్రీడల రికార్డులు నమోదయ్యాయి.

2036 ఒలింపిక్స్‌కు భారత్ బిడ్ వేయాలి

భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష

10లో

లక్ష్యం..175/175 క్లీన్ స్వీప్

వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయనున్న సీఎం వైఎస్ జగన్

- నేడు విజయవాడలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం
- రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మందికిపైగా ప్రతినిధుల రాక
- 53 నెలల సుపరిపాలన ద్వారా చేసిన మంచిని వివరించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- 'విప్లవాత్మక సంస్కరణలు - సమగ్రాభివృద్ధి - మళ్లీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత'పై మార్గ నిర్దేశం
- 'రాష్ట్రానికి జగనే కావాలి' కార్యక్రమాన్ని చేపట్టాల్సిన తీరుపై దిశా నిర్దేశం



విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సిద్ధమైన వేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా సోమవారం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షుల నుంచి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షుల వరకు 8 వేల మందికిపైగా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. గత 53 నెలలుగా సుపరిపాలన, సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రతి ఇంటికీ, గ్రామానికీ, నియోజకవర్గానికీ, జిల్లాకు, రాష్ట్రానికీ చేసిన మంచిని మరింత ప్రభావవంతంగా వివరించడం.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న

మిగతా 12వ పేజీలో ▶

24 గంటల వ్యవధిలో.. బిహార్‌లో 22 మంది నీటమునక

- వీరిలో అత్యధికులు జీవిత్‌పుత్రికా పండుగ సందర్భంగా స్నానాలకు వెళ్లిన మహిళలే

6లో



హెరాత్ ప్రావిన్సులో ఉన్న కష్కక్ గ్రామంలో శిథిలాల కింద కొనసాగుతున్న గాలింపు చర్యలు

అఫ్గాన్ భూకంప మృతులు 2,000 పైనే..

మరో 9,240 మందికి గాయాలు

తీవ్ర భూ ప్రకంపనలతో దెబ్బతిన్న హెరాత్ ప్రాంతం

భారీ స్థాయిలో కుప్పకూలిన ఇళ్లు

ఎటుచూసినా శిథిలాలతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం

6లో



హెరాత్‌లోని ఓ ఆస్పత్రిలో క్షతగాత్రులకు వైద్యం అందిస్తున్న దృశ్యం



రాష్ట్రంలో గోల్డ్ మైనింగ్

- కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో రూ.200 కోట్లతో అభివృద్ధి
- వచ్చే ఏడాది నవంబర్ నాటికి పూర్తిస్థాయిలో ఉత్పత్తి
- ఏడాదికి 750 కిలోలు లక్ష్యం
- ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నెలకు ఒక కిలో గోల్డ్ ఉత్పత్తి
- డెక్కన్ గోల్డ్‌మైన్స్ ఎండీ హనుమ ప్రసాద్

13లో



గాజా వైపు నుంచి దూసుకొస్తున్న రాకెట్లను (కుడివైపు) ఐరన్‌డోమ్ యాంటీ మిసైల్ వ్యవస్థ ద్వారా పేల్చేస్తున్న ఇజ్రాయెల్

భీకర యుద్ధం



గాజాలో గాయపడిన చిన్నారిని తరలిస్తున్న హమాస్ పోలీస్

రెండో రోజుకు చేరిన ఇజ్రాయెల్, హమాస్ ఘర్షణ

- దక్షిణ ఇజ్రాయెల్‌లో పరస్పరం కాల్పులు
- గాజాపై రాకెట్ల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం
- ఇజ్రాయెల్‌లో 600, గాజాలో 370 మంది సహా దాదాపు వెయ్యి మంది మృతి!
- బందీలుగా ఉన్న మహిళలపై ముష్కరుల అత్యాచారాలు
- వారు మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరిక

6లో



మీకు ఓటేస్తానా..! నాదొక ప్రశ్న!!

నాడు పేద మహిళలు.. నేడు లక్షాధికారులు

ఆమె బలోపేతం

నూతన మార్పు ఊరూరా సుస్పష్టం.. ప్రభుత్వ తోడ్పాటుతో పేద కుటుంబాల్లో సిరులు

- 14 లక్షల మంది పేద మహిళలకు లక్షాధికారి హోదా
- మరో 31 లక్షల మందికి ఏటా రూ.60 వేలకు పైగా పెరిగిన ఆదాయం
- పొదుపు సంఘాల్లో సగానికి పైగా నెలకు 5 వేలకు పైబడి ఆదాయం
- 92% కుటుంబాలలో ఆదాయం పెరిగిందని సర్వేలో వెల్లడి
- సొంత కాళ్లపై నిలబడేలా ఊతమిచ్చిన ప్రభుత్వ పథకాలు
- ప్రతి చిన్న అవసరానికి అప్పులు తెచ్చుకోవడం తగ్గుముఖం
- వడ్డీ భారం దూరం.. జీవనోపాధులతో కొత్త ఆదాయం
- మరింత సమగ్ర అధ్యయానికి ఎన్ఐఆర్‌డీతో సెర్ప్ ఒప్పందం



ఈమె పేరు నగీనా. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం వీరవల్లి సొంతూరు. శ్రీవాణి స్వయం సహాయక పొదుపు సంఘం సభ్యురాలు. అంతకు ముందు కుటుంబ పోషణ ఎలా అని మథనపడ్డ ఈమె ఐదు నెలల క్రితం గ్రామంలోని రైలుగేట్ వద్ద ఫ్యాన్సీ, చెప్పుల దుకాణం ప్రారంభించింది. ప్రస్తుతం ఇంటి ఖర్చులు పోను నెలకు రూ.6 వేల చొప్పున చెల్లించే చిట్టీలో సభ్యురాలిగా చేరింది.

(కృష్ణా జిల్లా బాపులపాడు, వీరవల్లి గ్రామాల నుంచి సాక్షి ప్రతినిధి మేడికొండ కోటిరెడ్డి) :

రాష్ట్రంలో 14,01,519 మంది పేదింటి పొదుపు సంఘాల మహిళలు ఏటా కనీసం లక్ష రూపాయల చొప్పున స్థిర ఆదాయం పొందుతూ కొత్తగా లక్షాధికారులుగా మారిపోయారు. ఇంకొక 31,04,314 మంది పేదింటి 'పొదుపు' మహిళలు నెలవారీ రూ.5 వేల నుంచి రూ.8 వేల చొప్పున ఏటా రూ.60 వేల నుంచి రూ.లక్ష మధ్య ఆదాయం పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 89.29 లక్షల మంది మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతుండగా, వారిలో సగానికి పైగా అంటే 54 శాతం మంది నెల వారీ సరాసరి స్థిర ఆదాయం రూ.5 వేలకు పైనే పెరిగింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల దేశ వ్యాప్తంగా పొదుపు సంఘాల మహిళల జీవనోపాధుల స్థితి గతులపై ఒక సర్వే నిర్వహించింది. ఈ నేపథ్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) రాష్ట్రంలో పొదుపు సంఘాల మహిళల జీవనోపాధుల స్థితిగతులతో పాటు గత నాలుగేళ్ల కాలంలో

మిగతా 11వ పేజీలో ▶

మా తరానికి విద్యా ప్రదాత


- సీఎం జగన్ కృషితో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు.. మన విద్యా రంగాన్ని దేశానికే ఆదర్శంగా మార్చారు
- ఇప్పుడు తల్లిదండ్రులకు పిల్లల చదువులపై బెంగ లేదు.. ఉచితంగా విదేశీ విజ్ఞాన యాత్రకు పంపడం దేశంలోనే ప్రథమం
- సర్కారు స్కూళ్లలో చదివిన మేమంతా ప్రముఖులను కలసి చర్చించడం గర్వంగా ఉంది
- సీఎంకు విద్యార్థులు, తల్లిదండ్రుల ధన్యవాదాలు

2లో



అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో ఏపీ విద్యార్థులు

నేడు అందరి దృష్టి కోర్టుల వైపే



సుప్రీంకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ విచారణ

కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టు తీర్పు

ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లోనూ హైకోర్టు తీర్పు

ఇప్పటికే సమర్థవంతంగా వాదనలు వినిపించిన సీఐడీ

12లో

మా తరానికి విద్యా ప్రదాత

సీఎం జగన్ కృషితో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు

- అంతర్జాతీయ వేదికపై రాణించిన పేదింటి పిల్లలు
- ఐరాస, వరల్డ్ యూత్ కాన్ఫరెన్స్‌లో స్ఫూర్తిదాయక ప్రసంగాలు
- సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు అమెరికాలో పర్యటన
- అధ్యక్షుడి నివాసం, కార్యాలయాల సందర్శన
- సీఎం జగన్‌కు విద్యార్థులు, తల్లిదండ్రుల ధన్యవాదాలు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న మా మాటలను ప్రపంచమంతా ఆసక్తిగా ఆలకించిందంటే మన విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పుల పుణ్యమే! చెట్ల కింద సాగే వానాకాలం చదువులను సంస్కరణల బాట పట్టించిన సీఎం జగన్ సర్‌దే ఆ గొప్పతనమంతా! చదువులతోటే పేదరికాన్ని ఎదిరిద్దామన్న ఆయన పిలుపు అక్షర సత్యం! విద్యారంగంలో ఎలాంటి సంస్కరణలు తీసుకొస్తే అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చో దేశానికే మార్గ నిర్దేశం చేశారు. ప్రతిభతో రాణిస్తున్న పేదింటి బిడ్డలకు దక్కిన అరుదైన గౌరవమిది. ఐరాస, వరల్డ్ బ్యాంక్ వేదికగా అంతర్జాతీయ ప్రతినిధులనుద్దేశించి ప్రసంగించడం.. ఎన్నడూ రాష్ట్రం దాటని మేం ఏకంగా అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో కాలు మోపడం.. కాణీ ఖర్చు లేకుండా విదేశాలకు వెళ్లి రావడం.. ఇదంతా ఇంకా నమ్మశక్యంగా లేదు!.. ఇదీ నిరుపేద కుటుంబాల్లో జన్మించి అంతర్జాతీయ వేదికలపై అందరినీ ఆకట్టుకున్న 10 మంది విద్యార్థుల మనోగతం. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 45 లక్షల మంది విద్యార్థులకు ప్రతినిధులుగా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వీరంతా సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు అమెరికాలో పర్యటించి వివిధ వేదికలపై తమ గళాన్ని సగర్వంగా వినిపించారు.

విద్యా సంస్కరణల అమలుతో..



మా అమ్మ ఫాతిమా వ్యవసాయ కూలీ. మాలాంటి పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుతో అమెరికా వెళ్లి అంతర్జాతీయ వేదికలపై ప్రసంగించే అవకాశాన్ని సీఎం జగన్ సర్ కల్పించారు. అమెరికాలో 15 రోజుల పర్యటనలో ఎన్నో విషయాలు తెలుసుకున్నా. విద్యాపరంగా ఎలాంటి సంస్కరణలు అమలుపరిస్తే దేశం అభివృద్ధి చెందుతుందో ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు, విద్యాకానుక, డిజిటల్ బోధన, గోరుముద్ద, అమ్మఒడి లాంటి పథకాలను మిగతా రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా స్వేచ్ఛ పథకాన్ని అమలు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతోంది.

– షేక్ అమ్మాజాన్, ఏపీ ఆర్ఎస్, వేంపల్లి, శ్రీసత్యసాయి జిల్లా

ప్రభుత్వ బడి నుంచి ఐఎంఎఫ్‌కు..

ఎకరం పొలంతో పాటు కేబుల్ ఆపరేటింగ్ పనులు చేసుకునే రైతు బిడ్డనైన నాకు 190 దేశాలకు సభ్యత్వమున్న అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో మాట్లాడే అవకాశం దక్కడం నిజంగా అదృష్టమే. అది సీఎం జగన్ సర్ తెచ్చిన విద్యా సంస్కరణల ఫలితమే. మన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానాన్ని అగ్రరాజ్యం ప్రతినిధులకు వివరించడం చాలా సంతోషంగా ఉంది. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, షూలు, నాణ్యమైన పోషకాహారం, ట్యాబ్‌లు, కార్పొరేట్ స్థాయిలో పాఠశాల మౌలిక సదుపాయాలు కల్పించిన విషయాన్ని తెలియచేశా. ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రమణ్యన్ మాలో ఎంతో స్ఫూర్తి నింపారు. ఏ స్థాయికి ఎదిగినా మన మూలాలను మరువకూడదని, రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ఖండాతరాలకు విస్తరింపజేయాలని నిర్ణయించుకున్నా. పేద పిల్లలకు జగనన్న ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకునే బాధ్యత విద్యార్థుల పైనే ఉంది.

– వంజివాకం యోగీశ్వర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసింగాపురం, తిరుపతి జిల్లా

ఎన్నడూ చూడని సదుపాయాలు..



మా బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాం. గతంలో ఎన్నడూ చూడని సదుపాయాలను సీఎం జగన్ ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో అద్భుతమైన సంస్కరణలు తెచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– నాగరాజు, విజయ (యోగీశ్వర్ తల్లిదండ్రులు, అక్క)

నిజంగా.. నేనేనా!

ఐరాస, వరల్డ్ బ్యాంకుల్లో ప్రసంగించింది నేనేనా అని ఆశ్చర్యంగా ఉంది. అమెరికా అధ్యక్ష భవనాన్ని సందర్శించడాన్ని కూడా నమ్మలేకున్నా. సోషల్ పుస్తకంలో ఫొటో మాత్రమే చూసిన ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ఒక రోజంతా ఉన్నాం. కొలంబియా యూనివర్సిటీలో జరిగిన ఎకో అంబాసిడర్ కార్యక్రమంలో పాల్గొని ఇతర దేశాల విద్యార్థులతో ముచ్చటించి వారి సంస్కృతిని తెలుసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, పథకాలను వివరించాం. ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి నాడు-నేడు, జగనన్న విద్యాదీవెన, గోరుముద్ద తదితర పథకాల అమలు తీరుతోపాటు బడుల్లో తాగునీరు, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్స్, ల్యాబ్స్‌తో పాటు జగనన్న కానుక కింద స్కూల్ యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, షూలు ప్రతి విద్యార్థికీ ఉచితంగా ఇవ్వడంపై వరల్డ్ బ్యాంక్, యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అధికారులతో మాట్లాడాం. నయాగరా వాటర్ ఫాల్స్ చూశాం. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, 2001లో కూలిపోయిన ట్విన్ టవర్స్ చరిత్ర తెలుసుకున్నా.

– అల్లం రిషితారెడ్డి, కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాల, విజయనగరం

ఇంత గుర్తింపు ప్రభుత్వ చలవే..



గతంలో మా ఇద్దరు అమ్మాయిలను ప్రైవేట్ స్కూళ్లలో చదివించాం. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాం. ఇద్దరికీ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లోనే చదివించి ఉంటే ఇంత గుర్తింపు లభించేది కాదు.

– ఉదయలక్ష్మి, రామకృష్ణారెడ్డి (రిషితారెడ్డి తల్లిదండ్రులు)

పేద కుటుంబాలకు విద్యా ప్రదాత

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న సీఎం జగన్ మా తరంలో పేద కుటుంబాలకు విద్యా ప్రదాతగా నిలిచిపోతారు. మన రాష్ట్రంలో తెచ్చిన విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఐరాస వేదికగా వీటిని చాటిచెప్పాం. ఈ పర్యటనను కలలో కూడా ఊహించలేదు. మాలాంటి పేద విద్యార్థులను ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం ప్రోత్సహించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం వల్లే ఈ అవకాశం లభించింది. రెండు వారాల పాటు ఎందరో ప్రముఖులతో చర్చించడం గర్వంగా ఉంది.

– మోతుకూరి చంద్రలేఖ, కేజీబీవీ, ఎటపాక, ఏఎస్ఆర్ జిల్లా

ధీమాగా చదువులు..



కేజీబీవీలో చదువుకున్న నా బిడ్డకు ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. ఈ ప్రభుత్వం వచ్చాక నాలాంటి తండ్రులకు పిల్లల చదువులపై బెంగ పోయింది. డబ్బున్న వారు, ఉద్యోగాలు చేసేవారు కూడా ఇప్పుడు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించేందుకు ఆసక్తి చూపడం విద్యా సంస్కరణల పుణ్యమే. – రామారావు, ఆటో డ్రైవర్ (చంద్రలేఖ తండ్రి)

ప్రపంచానికి చాటి చెప్పా..



మా నాన్న దస్తగిరి లారీ డ్రైవర్. అమ్మ రామలక్ష్మి రజక వృత్తిలో ఉంది. పేద కుటుంబం నుంచి వచ్చిన నాకు అమెరికా వెళ్లి అంతర్జాతీయ వేదికలపై ప్రసంగించే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారు. ఈ పర్యటన జీవితాంతం గుర్తుంటుంది. న్యూయార్క్‌లో జరిగిన ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడే అవకాశం నాకు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రపంచానికి తెలియచేశా. నాడు- నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పనులను వివరించా. ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు ఎంతో మెరుగయ్యాయి. టాయిలెట్ల శుభ్రతతో పాటు బాలికలకు ప్రత్యేకంగా న్యాప్‌కిన్ల వాడకంపై అవగాహన కల్పించడం, అమ్మఒడి పథకంతో స్కూళ్లలో డ్రాప్‌అవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ అంశాలను ఐరాస ప్రతినిధులకు వివరించా. మన దేశ ఆర్థిక వ్యవస్థలో యువత భాగస్వామ్యంపై ప్రసంగించా. ఐఐటీ గ్రాడ్యుయేట్స్‌లో చాలా మంది స్టార్టప్‌లు ప్రారంభించి ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని చెప్పా.

– చాకలి రాజేశ్వరి, ఏపీ మోడల్ స్కూల్, నంద్యాల

పక్క ఊరు వెళ్లాలన్నా చార్జీల గురించి ఆలోచించే మాకు..



కాకినాడ జిల్లా తీరప్రాంత గ్రామమైన రమణక్కపేటలో నిరుపేద ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు కుటుంబంలో జన్మించిన నాకు అంతర్జాతీయ వేదికపై ప్రసంగించేలా సీఎం జగన్ సార్ గొప్ప అవకాశాన్ని కల్పించారు. నాన్న సింహాచలం సెక్యూరిటీ గార్డు కాగా అమ్మ శాంతి గృహిణి. నేను, చెల్లి, తమ్ముడు.. ఇదీ మా కుటుంబం. నాన్న కొద్దిపాటి సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తూ మమ్మల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. పక్క ఊరు వెళ్లాలన్నా చార్జీల గురించి ఆలోచించే కుటుంబం నుంచి వచ్చిన నేను అమెరికా వెళ్లానంటే అది జగన్ సార్ విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పుల పుణ్యమే. విద్యతోనే అన్నీ సాధ్యమవుతాయని సీఎం సార్ చెబుతుంటారు. అది నిజమే. అందుకు నేనే నిదర్శనం. సాధారణ విద్యార్థులను ప్రభుత్వ ప్రతినిధులుగా అమెరికా పంపించి సీఎం జగన్ సర్ చరిత్ర సృష్టించారు. భవిష్యత్‌లో ఐఏఎస్ అయ్యి సీఎం జగన్ సార్ ఆశయ సాధనకు కృషిచేస్తా. రాష్ట్రంలోని విద్యా సంస్కరణలు విదేశాల్లో సైతం గుర్తింపు పొందాయి. కొలంబియా యూనివర్సిటీలో మాట్లాడే అవకాశం నాకు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గౌరవప్రదమైన జీవనోపాధులపై వివరించడం ఆనందంగా ఉంది.

– దడాల జ్యోత్స్న, సాంఘిక సంక్షేమ గురుకులపాఠశాల,వెంకటాపురం, కాకినాడ జిల్లా

మరపురాని అనుభూతి..

ఐరాస, కొలంబియా యూనివర్సిటీల్లో జరిగిన సదస్సుల్లో పాల్గొన్నా. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలపై మాట్లాడటం మరపురాని అనుభూతి. మా జీవితాన్ని మలుచుకునేందుకు ఈ పర్యటన ఎంతో స్ఫూర్తినిచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువలేం. విద్యా వ్యవస్థలో తెచ్చిన సంస్కరణలను సద్వినియోగం చేసుకుంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

– పసుపులేటి గాయత్రి, జడ్పీహెచ్ఎస్, వట్లూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా



ఎంతో నేర్చుకున్నాం..



నాకు ఇంత అరుదైన అవకాశం జగన్ మామయ్య పాలనలో దక్కడం, అందుకు ప్రభుత్వ పాఠశాలలు వేదిక కావడం ఎన్నటికీ మర్చిపోలేను. సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు జరిగిన విదేశీ విజ్ఞాన యాత్రలో ఐరాస జనరల్ అసెంబ్లీ హాల్‌ని సందర్శించాం. కొలంబియా యూనివర్సిటీలో ఎకో ఎంబాసిడర్ ప్రోగ్రాంలో పాల్గొన్నాం. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, ట్విన్ టవర్స్ కూలిన చోటు, నయాగరా జలపాతం ఇలా వివిధ ప్రాంతాలను సందర్శించి అక్కడి సంస్కృతిపై అవగాహన పెంచుకున్నాం. విదేశీ విద్యార్థులతో ముచ్చటించడం కొత్త అనుభూతిని కలిగించింది. ప్రపంచ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఆర్థిక విషయాలు, అంతర్జాతీయ ఆర్థిక అవసరాలు, ఆర్థిక పరిపుష్టికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తదితర అంశాలను నేర్చుకున్నాం. అమెరికా అధ్యక్షుడు నివసించే వైట్‌హౌస్‌ను సందర్శించే అవకాశం రావడం మరపురాని అనుభూతి. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయంలో 12 శాతం విద్యపై ఖర్చు చేయటాన్ని బట్టి చదువులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

– జి.గణేష్ అంజన సాయి, వల్లూరిపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా

గిరిజన బిడ్డకు గర్వకారణం..



మాది కురుపాం మండలం కొండబారిడి గిరిజన గ్రామం. కుటుంబ కారణాలతో తల్లిదండ్రులు విడిపోయారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నా. ఏసీ బస్సు అంటే ఏమిటో కూడా తెలియదు. గతంలో ఓసారి విశాఖపట్నం, మరోసారి సైన్స్ ఎగ్జిబిషన్ కోసం విజయవాడ వెళ్లా. అలాంటిది మన రాష్ట్ర ప్రతినిధిగా విమానం ఎక్కి ఏకంగా అమెరికా వెళ్లి రావడం కలగానే ఉంది. మన విద్యా సంస్కరణలు, సంక్షేమ పథకాలను ఐరాస, యూఎస్ స్టేట్ అధికారులకు వివరించా. ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్యా విధానంతో విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనాలను కొలంబియా యూనివర్సిటీలో జరిగిన సదస్సులో తెలియచేశా. వివిధ దేశాల విద్యార్థులతో మాట్లాడి భిన్న సంస్కృతులను తెలుసుకునే అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– సామల మనస్విని, కేజీబీవీ, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, మన్యం జిల్లా

ప్రభుత్వ స్కూళ్ల విశిష్టతను చాటిచెప్పాం..



నాన్న సోమనాథ్, అమ్మ గంగమ్మ వ్యవసాయ కూలీలు. పేద కుటుంబాల నుంచి వచ్చిన మేం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సదుపాయాలు, విశిష్టతను ప్రపంచానికి తెలియచేశాం. విద్యారంగంలో మన రాష్ట్రం ఏ స్థాయిలో రాణిస్తోందో చాటాం. ఈ పర్యటనలో చాలా విషయాలు నేర్చుకున్నా. యూఎన్‌వో హెడ్ క్వార్టర్స్, ఐఎంఎఫ్ సమావేశంలో ప్రసంగించడం మరచిపోలేని అనుభూతి. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, నయగారా ఫాల్స్, మ్యూజియం, వైట్‌హౌస్ లాంటి ప్రదేశాలను సందర్శించడం మాలాంటి వారికి అసాధ్యం. సీఎం జగన్ సర్ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించి బాగా చదువుకోమని ప్రోత్సహిస్తున్నారు. ప్రతిభ చాటిన మాకు మరువలేని అవకాశాన్ని కల్పించారు. చదువుల్లో రాణించే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అంతర్జాతీయ సదస్సులకు ఎంపిక చేయడం దేశంలో ఇదే ప్రథమం.

– మాల శివలింగమ్మ, కేజీబీవీ, ఆదోని, కర్నూలు జిల్లా

ప్రభుత్వ స్కూళ్లకు వంట పాత్రలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కోసం వంట పాత్రలు అందిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ 40 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండిపెడుతున్న 80 వేల మంది మధ్యాహ్న భోజన సిబ్బందికి ఇది శుభవార్తగా ఆయన పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన అల్యూమినియం పాత్రలను కాకుండా నాణ్యమైన స్టీల్‌తో చేసిన పాత్రలను అందిస్తున్నామని, సాంకేతికంగా వంటకు అనువుగా ఉండే వాటిని పరిశీలించి, వాటినే సరఫరా చేస్తున్నామని ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు.

అవగాహనే అస్త్రం!

- ప్రభుత్వ స్కూళ్లలో వినియోగదారుల క్లబ్‌లు
- 8, 9 తరగతుల విద్యార్థులతో 6 వేలకు పైగా క్లబ్‌లు ఏర్పాటు
- ప్రత్యేక శిక్షణ ద్వారా వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన
- తద్వారా వారి కుటుంబాల్లోనూ చైతన్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పిస్తోంది. దశాబ్దాలుగా ప్రకటనలకే పరిమితమైన 'స్కూల్ కన్స్యూమర్ క్లబ్'లను ప్రస్తుత వైఎస్ జగన్ సర్కార్.. ప్రతి ప్రభుత్వ స్కూల్లోనూ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే 8, 9 తరగతుల విద్యార్థులతో దాదాపు 6 వేలకు పైగా వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేయించింది. ఒక్కో క్లబ్‌లో కనీసం 100 మంది విద్యార్థులను భాగస్వాములను చేస్తూ.. సుమారు 6 లక్షల మందిని వినియోగదారుల హక్కుల పరిరక్షకులుగా తీర్చిదిద్దబోతోంది. విద్యార్థులే వినియోగదారులుగా తమ హక్కులను అర్థం చేసుకోవడంతో పాటు వాటిని తమ కుటుంబసభ్యులకు, గ్రామాల్లోని నిరక్షరాస్యులకు, తోటి విద్యార్థులకు బోధించేలా ప్రభుత్వం ఈ క్లబ్‌లకు రూపకల్పన చేసింది. వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు దోపిడీకి గురికాకుండా సమగ్ర పరిజ్ఞానాన్ని అందిస్తోంది. ఇప్పటికే జిల్లాకు ఇద్దరు మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చింది. ఈ మాస్టర్ ట్రైనర్లు రాష్ట్రంలోని అన్ని క్లబ్‌ల టీచర్ గైడ్‌లకు దశలవారీగా, క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వనున్నారు. పుస్తకాలు, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వినియోగదారుల హక్కులకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందిస్తున్నారు. ఇందులో భాగంగానే 'మేము సైతం' పేరుతో శిక్షణ మాడ్యూల్ పుస్తకాన్ని వెలువరించారు. త్వరలోనే వినియోగదారుల హక్కుల పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి, క్లబ్‌లు చేపట్టిన కార్యకలాపాలను అప్‌లోడ్ చేయడానికి వీలుగా ప్రత్యేక యాప్ అందుబాటులోకి రానుంది. క్లబ్‌ల కార్యక్రమాల ఆధారంగా అవార్డులతో విద్యార్థులను ప్రోత్సహిస్తారు.



వినియోగదారుల హక్కులను తెలియజేస్తూ రూపొందించిన పోస్టర్

పోస్టర్లతోనూ విస్తృత ప్రచారం

వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించేలా 10 రకాల పోస్టర్లతో కూడా ప్రభుత్వం విస్తృత ప్రచారం నిర్వహించనుంది. వస్తువు కొనుగోలులో వినియోగదారులకు ఉండే హక్కులు, బాధ్యతలు, ఎల్పీజీ గ్యాస్, పెట్రోల్ బంకుల్లో పొందే హక్కులు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుపై అవగాహన, సమస్య వస్తే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసే విధానం, బిల్లు ఆవశ్యకత తదితర అంశాలను వివరించనుంది. అలాగే వినియోగదారుల హక్కుల పరిరక్షణ అంశాలతో 'మేలు కొలుపు' పేరుతో మాస పత్రికను కూడా ప్రచురిస్తోంది. నెలకు సుమారు 9 వేల కాపీలను విడుదల చేస్తుండగా వీటిని వినియోగదారుల క్లబ్‌లకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల్లో వినియోగదారుల అవగాహన కార్యక్రమాల నిర్వహణకు జాయింట్ కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించారు.

విద్యార్థులతోనే చైతన్యం..

ఏదైనా ఒక వస్తువును కొనుగోలు చేసినప్పుడు లేదంటే సేవను పొందేటప్పుడు వినియోగదారుడికి చట్టం కొన్ని హక్కులు కల్పించింది. వీటి ద్వారా మోసాల నుంచి కొనుగోలుదారుడు తనను తాను రక్షించుకోవచ్చు. కానీ, ఎన్నో ఏళ్లుగా వినియోగదారులు తమ హక్కులు తెలుసుకోవడంలో వెనుకబడిపోయారు. అందుకే ప్రభుత్వం పాఠశాల విద్య దశలోనే ఈ అంశంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు కృషి చేస్తోంది. విద్యార్థుల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చు. అందుకే సమస్య వస్తే వినియోగదారుడు ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఫిర్యాదు చేయాలో తెలియజేయడంతో పాటు మోసపోకుండా సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నాం. – హెచ్.అరుణ్ కుమార్, వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ

రూ.2,300 కోట్లతో..
విశాఖలో భారీ ఐటీ బిజినెస్ పార్క్

- మధురవాడ హిల్ నెంబర్-3లో 19 ఎకరాల్లో అభివృద్ధి
- ఐటీ, ఐటీ ఆధారిత, ఆర్థిక సేవా కార్యకలాపాలకు అనుగుణంగా నిర్మాణాలు
- వీటితో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ సౌకర్యాలు కూడా..
- ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం ఈక్విటీతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు
- ఈక్విటీగా ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు
- మిగిలిన రూ.1,380 కోట్లు రుణ రూపంలో సమీకరణ
- డీపీఆర్ తయారీ నుంచి నిర్వహణ వరకు భాగస్వామ్య కంపెనీదే బాధ్యత
- ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ

సాక్షి, అమరావతి: ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల ఆకర్షణలో విశాఖ నగరం ముందంజలో ఉందని ఇటీవల నీతి ఆయోగ్ ప్రకటించిన నేపథ్యంలో.. ఏపీఐఐసీ (ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) కూడా భారీ ఐటీ బిజినెస్ పార్క్‌ను ఇక్కడ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. విశాఖలో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌తో పాటు ఐటీ పార్క్, రహేజా గ్రూపు ఇన్‌ఆర్బిట్ మాల్‌తో పాటు ఐటీ పార్క్ ఏర్పాటుచేస్తున్న సంగతి తెలిసిందే. మధురవాడ హిల్ నెంబర్-3 మీద 18.93 ఎకరాల విస్తీర్ణంలో ఐ-స్పేస్ పేరుతో ఈ ఐటీ బిజినెస్ పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి ఏపీఐఐసీ తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ఐటీ, ఐటీ ఆధారిత కార్యకలాపాలు నిర్వహించుకునే సంస్థలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలతో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్స్, సర్వీస్ అపార్ట్‌మెంట్స్, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ ఫెసిలిటీలతో పాటు తగినంత పార్కింగ్ సదుపాయాలు ఉండే విధంగా ఈ క్యాంపస్‌ను సుమారు రూ.2,300 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం భాగస్వామ్య కంపెనీతో ప్రత్యేక సంస్థ (ఎస్పీవీ)ని ఏర్పాటుచేస్తారు. ఈ ఎస్పీవీలో ఏపీఐఐసీ 26 శాతం వాటాను, భాగస్వామ్య కంపెనీ 74 శాతం వాటాను కలిగి ఉంటుంది.

బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా..

ఇక మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.2,300 కోట్లలో 40 శాతం ఈక్విటీగా సమకూర్చాల్సి ఉంటుంది. ఈక్విటీ రూపంలో ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు సమకూరుస్తాయి.



మిగిలిన మొత్తం రూ.1,380 కోట్లను రుణ రూపంలో సేకరిస్తారు. ఈ ప్రాజెక్టు డిజైన్ దగ్గర నుంచి నిర్మాణం, బ్రాండింగ్, నిర్వహణ అన్నీ భాగస్వామ్య కంపెనీయే చూడాల్సి ఉంటుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా ఈ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా చేరడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించామని, భాగస్వామ్య కంపెనీ ఎన్నిక అనంతరం నిర్మాణ పనులను ప్రారంభించి వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు.. గడిచిన ఐదేళ్లలో విశాఖ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, పలు అంతర్జాతీయ సంస్థలు, రిటైల్ సంస్థలు విశాఖలో ఏర్పాటుకావడంతో స్థిరాస్తి ధరలు 20 శాతం పైగా పెరిగినట్లు ఏపీఐఐసీ అధికారులు వెల్లడించారు. వాణిజ్య సముదాయాలకు భారీగా డిమాండ్ ఉండటంతో ఐ-స్పేస్ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఇజ్రాయెల్ నుంచి భారతీయులను క్షేమంగా తీసుకొస్తాం



కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి

సాక్షి, అమరావతి/మంగళగిరి: ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చేందుకు అన్ని చర్యలను పరిశీలిస్తున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి చెప్పారు. ఆమె ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఇజ్రాయెల్‌లో భారత పౌరులకు ఇబ్బంది లేకుండా కేంద్రం జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. అనంతరం బీజేపీ సోషల్ మీడియా వలంటీర్లతో సమావేశం నిర్వహించారు.

వైఎస్సార్ నేతన్న నేస్తంతో భరోసా

చేనేత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం అమలు చేయడం సంతోషకరమని కేంద్రమంత్రి మీనాక్షి లేఖి అన్నారు. మంగళగిరిలో రూ.3.50 కోట్లతో నిర్మించిన మగ్గం షెడ్లను ఆమె పరిశీలించారు. మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తీసుకుంటున్న చొరవ అభినందనీయమన్నారు.

క్లుప్తంగా...

అవినీతికి కేరాఫ్ చంద్రబాబు, రామోజీ
డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): అవినీతి, అక్రమాలకు చంద్రబాబు, రామోజీరావు రాష్ట్రంలో కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి విమర్శించారు. ఆయన ఆదివారం కార్వేటినగరం మండలం పాదిరి కుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో ముద్దాయిగా జైలుకెళ్లాడని, అదేకోవలో రామోజీకి మార్గదర్శి స్కామ్‌లో జైలుకూడు తప్పదని హెచ్చరించారు. ల్యాండ్ సీలింగ్ పెట్టిన 24 సంవత్సరాల్లో వందల ఎకరాల్లో డీకేటీ భూములను కొనుగోలు చేసిన ఘనుడు రామోజీ అన్నారు. చంద్రబాబు, రామోజీలు చేసిన స్కామ్‌లను కొన్ని ఎల్లో మీడియా పత్రికలు ఎందుకు బహిర్గతం చేయడంలేదని ప్రశ్నించారు. చంద్రబాబుది అక్రమ అరెస్ట్ అంటున్నారు తప్ప, బాబు చేసిన తప్పులను ఎందుకు ఎత్తి చూపించడం లేదని నిలదీశారు. చంద్రబాబు కోసం ప్యాకేజీ పుత్రుడు పవన్ కళ్యాణ్ రోడ్లపై పడి నిత్యం గొంతు చించుకోవడం కన్నా అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేయాలనుకుంటున్నాడో చెబితే బాగుంటుందన్నారు.

చంద్రబాబు ఆర్థిక నేరగాడు
ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షుడు రాజునాయక్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల ధనాన్ని లూటీ చేసిన ఆర్థిక నేరగాడు చంద్రబాబు అని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని రుజువు చేస్తూ న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించిందని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ స్పష్టం చేశారు. విజయవాడ ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దెబ్బతీసిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు గిరిజనులను తీవ్ర నిర్లక్ష్యం చేస్తే.. సీఎం జగన్ ఎంతో మేలు చేశారని కొనియాడారు.

జనగణనపై సీఎం తీరు మారాలి
టీడీపీ నేత యనమల రామకృష్ణుడు

సాక్షి, అమరావతి: బీసీల జనగణనపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు బీసీలకు ద్రోహం చేసేలా ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. టీడీపీ హయాంలో అన్ని రాష్ట్రాల కంటే ముందే శాసనసభలో బీసీ జనగణనపై తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, ఇప్పటి వరకూ ఆమోదం తెలపలేదని, దీనిపై ముఖ్యమంత్రి శ్రద్ధ పెట్టడం లేదని ఆరోపించారు. ఢిల్లీ పర్యటనలో బీసీ జనగణన గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

'మద్యం'పై సీబీఐతో విచారణ జరిపించండి
అమిత్‌షాకు పురందేశ్వరి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మద్యం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కలిసి వినతిపత్రం అందించారు. మద్యం ద్వారా ఏపీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని ఆమె ఆరోపించారు. గతంలో మద్యం దుకాణాలను వేలంపాట ద్వారా కేటాయించేవారని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తోందని తెలిపారు. కాగా మద్యంపై ఈనాడులో వస్తున్న అసత్య కథనాలలోని పలు ఆరోపణలను ఏర్చి కూర్చి ఆమె ఈ లేఖ తయారు చేసినట్లు కనిపిస్తోంది. ఈనాడు అసత్య కథనాలతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలను పురందేశ్వరి తన లేఖలో ప్రస్తావించడం మినహా అందులో కొత్తగా ఏమీలేకపోవడం గమనార్హం.

మహిళల వ్యక్తిత్వ హననం దారుణం
మంత్రి రోజాకు సినీనటి మీనా మద్దతు



సాక్షి, అమరావతి: మహిళలు రాజకీయాల్లో ఎదుగుతుంటే వ్యక్తిత్వ హననం ద్వారా అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని సినీ నటి మీనా అన్నారు. నీచమైన వ్యాఖ్యలు చేసినంత మాత్రాన మహిళలు భయపడి, తలుపులు మూసుకుని ఏడుస్తారనుకోవడం అవివేకమన్నారు. ఇటీవల మంత్రి రోజాపై టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలను మీనా ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఓ వీడియోలో ఖండించారు. 'కాలం మారిపోయింది. సమాజంలో మహిళలు బలమైన శక్తిగా ఎదిగారు. అభద్రతభావం, ఈర్ష్యతోనే మంత్రి రోజాను నీచంగా మాట్లాడి మహిళలపై మీకున్న కుసంస్కారాన్ని ప్రదర్శించారు' అంటూ బండారుపై మండిపడ్డారు. సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి రోజా ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారని, రాజకీయాల్లోనూ తనను తాను నిరూపించుకుంటూ డైనమిక్ లీడర్‌గా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మహిళల గౌరవాన్ని కాపాడాలని మీనా విన్నవించారు.

ఆర్బీకేలపై ఎందుకంత అక్కసు!?

విత్తు నుంచి విక్రయం వరకు రైతుకు అండగా ఆర్బీకేలు.. అనతికాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతి.. అయినా అదే పనిగా బురదజల్లుతున్న 'ఈనాడు'

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు చేస్తున్న మంచి ఏదీ రామోజీరావుకు కనిపించదు. కనిపించినా కనిపించనట్లు.. చూసినా చూడనట్లు నటిస్తారు. ఎందుకంటే.. అధికారంలో ఆయన ఆత్మబంధువు చంద్రబాబు లేడు కాబట్టి. ఆయనే కనుక ఉంటే ఆయనెన్ని తప్పులు చేసినా అవి సూపర్‌గానే కనిపిస్తాయి. తన జర్నలిజం మార్కు ఇదేనని రామోజీ నిత్యం నిరూపించుకుంటూనే ఉన్నారు. ఎందుకంటే.. తాజాగా ఆదివారం సంచికలో 'ఇదా భరోసా సిగ్గు.. సిగ్గు' అంటూ రైతుభరోసా కేంద్రాలపై రామోజీ నిస్సిగ్గుగా విషం కక్కిన తీరు ఈ కోవకు చెందినదే.



వైఎస్సార్ రైతుభరోసా (ఆర్బీకే) కేంద్రాలు.. గ్రామస్థాయిలో ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిలా పనిచేస్తుంటే.. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుంటే ఈనాడుకు కంటిమీద కునుకు కరువైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు, రైతుల అభ్యున్నతికి అవి పాటుపడుతూ నాలుగేళ్లలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో స్పష్టమైన మార్పునకు నిలువెత్తు నిదర్శనంగా కళ్లెదుట సాక్షాత్కరిస్తుండడంతో పచ్చ మీడియాకు దిక్కుతోచడంలేదు. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు విస్తృతమైన సేవలందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. రైతులకు అన్ని విధాలుగా భరోసా కల్పిస్తుంటే మెచ్చుకోవాల్సింది పోయి.. ఆ వ్యవస్థే వృథా అన్నట్లుగా నిత్యం బురదజల్లడమే పనిగా పెట్టుకుంది ఈనాడు. నిజానికి.. రబీ సీజన్ కోసం ముందస్తుగా ఓ వైపు ముమ్మరంగా విత్తన పంపిణీ జరుగుతోంది.. ఎరువులు పుష్కలంగా ఉన్నాయి.. పురుగు మందుల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.. అయినా అవేమీ రామోజీకి కన్పించడం లేదు. ఎక్కడా ఏ ఒక్క రైతు తమకు విత్తనం అందడంలేదని కానీ, ఎరువు దొరకడం లేదంటూ కనీసం ఫిర్యాదు కాదు కదా రోడ్డెక్కిన పాపాన కూడా పోలేదు. ఆర్బీకేలకు వస్తున్న ఈ ఆదరణను చూసి ఓర్వలేక రామోజీ కల్లుతాగిన కోతిలా వెర్రెక్కిపోతున్నారు. 'ఇదా భరోసా సిగ్గు.. సిగ్గు' కథనంపై 'ఫ్యాక్ట్‌చెక్' చదవండి..

ఆరోపణ: నామమాత్రమైన ఆర్బీకేలు..

వాస్తవం: రైతులకు గ్రామస్థాయిలో సకాలంలో సమర్థవంతమైన, నాణ్యమైన సేవలను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన ఆర్బీకేలు రైతుల ఆదరణ చూరగొంటున్నాయి. గతంలో వ్యయ ప్రయాసల కోర్చి మండల కేంద్రాలకు వెళ్లి ఎండనక, వాననక, పగలనకా, రేయనకా నిద్రాహారాలు మాని విత్తనాలను, ఎరువులను పురుగుల మందుల కోసం పడిగాపులు కాస్తే కాని దొరికే పరిస్థితి ఉండేది కాదు. కానీ, ప్రస్తుతం చూద్దామంటే నాలుగేళ్లలో క్యూలైన్ అనేది కన్పించలేదు. పైగా గతంలో తమ పార్టీ నేతలు, సానుభూతిపరులైన భూస్వాములు, రైతులకు పంచగా, మిగిలినవి సన్న, చిన్నకారు రైతులకు విదిల్చేవారు. ప్రస్తుతం వివక్షకు తావులేకుండా అడిగిన ప్రతీ రైతుకు అవసరమైన మేరకు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు.

ఆరోపణ: పురుగు మందుల జాడేది?

వాస్తవం: ఆర్బీకేల ద్వారా మూడేళ్లలో 1,50,822 మంది రైతులకు రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగు మందులను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేశారు. వచ్చే సీజన్ కోసం సర్టిఫై చేసిన సస్యరక్షణ మందులు, సూక్ష్మ పోషకాల పంపిణీకి ఏర్పాట్లుచేస్తున్నారు. ఇంతవరకు పురుగు మందులను కేవలం వివిధ పథకాల కింద మాత్రమే పంపిణీ చేయగా, 2023 రబీకాలం నుంచి ఎరువుల మాదిరిగా పురుగు మందులను కూడా సాధారణ పద్ధతిలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇవేమీ రామోజీకి కన్పించడంలేదు.

ఆరోపణ: అక్కరకు రాని ఆర్బీకేలు..

వాస్తవం: నిజానికి.. ఆర్బీకేల ఏర్పాటుతో వ్యవసాయ రంగంలో స్పష్టమైన మార్పు కన్పిస్తోంది. కేవలం సాగు ఉత్పాదకాలు రైతు ముంగిట అందించడమే కాదు.. సర్టిఫై చేసిన నాణ్యమైన ఉత్పాదకాల పంపిణీతో పాటు రైతుల్లో సామర్థ్యం పెంపు, పరిశోధనా ఫలాలు రైతు క్షేత్రాలకు చేరవేయడం, పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఈ–క్రాప్ బుకింగ్, రైతు సంక్షేమ పథకాల అమలులో ఆర్బీకేలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా కళ్లాల వద్దే పంట ఉత్పత్తుల కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 45,226 కోట్ల విలువైన ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను 26.55 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు ఈనాడుకు కన్పించకపోవడం విడ్డూరం. ధరలు పతనమైన ప్రతీసారి మార్కెట్ ఇంటర్‌వెన్షన్ కింద బహిరంగ మార్కెట్‌లో జోక్యం చేసుకుని వ్యాపారులతో పోటీపడి రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా కృషిచేస్తున్నారు.

ఆరోపణ: ఆర్బీకేలకు రూ.మూడువేల కోట్లు వెచ్చించినా..

వాస్తవం: రాష్ట్రంలో 10,778 ఆర్బీకేలను ఏర్పాటు చేయగా, వాటిలో 542 గ్రామాల్లో సొంత భవనాలుండగా 10,236 ఆర్బీకే భవనాల నిర్మాణం చేపట్టారు. వాటిలో 3,947 భవనాల నిర్మాణం పూర్తికాగా.. 2,948 భవనాలను ఇప్పటికే వ్యవసాయ శాఖకు అప్పగించారు. మరో 5,212 భవనాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన 1,077 భవనాల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు భవనాల కోసం రూ.944 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.343 కోట్లు ఖర్చు చేశారు. కియోస్క్‌ల పనితీరును ప్రత్యేక డాష్ బోర్డు ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏపీ ఫైబర్‌నెట్, మొబైల్ ఇంటర్నెట్ ద్వారా కియోస్క్‌లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. 94 శాతం కియోస్క్‌లు పూర్తిస్థాయిలో పనిచేస్తూ రైతులకు సేవలందిస్తున్నాయి. రెండు విడతల్లో నియమించిన 6,246 వ్యవసాయ, 4,655 పశుసంవర్ధక, 2,356 ఉద్యాన, 731 మత్స్య, 377 పట్టు సహాయకులతో పాటు అనుభవజ్ఞులైన బహుళార్థ, వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు గోపాలమిత్రలు సేవలందిస్తున్నారు. ప్రతీ ఆర్బీకేకు ఓ వలంటీర్‌తోపాటు బ్యాంకింగ్ కరస్పాండెంట్‌ను అనుసంధానం చేశారు.

ఆరోపణ: ఎరువుల అమ్మకాలు తూచ్..

వాస్తవం: ఆర్బీకేల్లో ఎరువుల అమ్మకం వ్యాపారం కాదని, రైతులకు గ్రామ స్థాయిలో కల్పించిన ఓ సదుపాయం మాత్రమే. రాష్ట్రానికి సరఫరా అయ్యే ఎరువుల్లో 50 శాతం వ్యాపారులకు, మిగిలిన 50 శాతం సహకార కేంద్రాలు, ఆర్బీకేలకు కేటాయిస్తున్నారు. ఆర్బీకేలు ఏర్పాటుచేసిన తొలి ఏడాది 1.07లక్షల టన్నుల అమ్మకాలు జరగ్గా, మూడో ఏడాదికి వచ్చేసరికి అది దాదాపు నాలుగు లక్షల టన్నులకు చేరుకుంది. ఈ సదుపాయం వినియోగించుకున్న రైతుల సంఖ్య 2020–21లో 2.55 లక్షల మంది ఉంటే, 2022–23లో ఏకంగా 10.89 లక్షల మందికి చేరింది. అంటే.. 428 శాతం వృద్ధి కన్పిస్తోంది. అలాగే, ఇప్పటివరకు రూ.1,196.07 కోట్ల విలువైన 10.83 లక్షల టన్నుల ఎరువులను 28.95 లక్షల మంది రైతులకు పంపిణీ చేశారు. 2023–24లో ఇప్పటివరకు ఆర్బీకేల ద్వారా 5.48 లక్షల మంది రైతులకు 2.13 లక్షల టన్నుల ఎరువులు పంపిణీ చేయగా, ఆర్బీకేల వద్ద 80వేల టన్నులు, సొసైటీల వద్ద 36 వేల టన్నుల ఎరువులు ఇంకా అందుబాటులో ఉన్నాయి. రైతు ముంగిట ఎమ్మార్పీకే అందుబాటులో ఉండడంతో బ్యాగ్‌పై రూ.20 చొప్పున ఈ నాలుగేళ్లలో రూ.50 కోట్లకు పైగా ఆదా అయ్యింది. ఇక సర్టిఫై చేసిన ఎరువుల పంపిణీవల్ల నకిలీ ఎరువులు, బ్లాక్ మార్కెటింగ్‌కు పూర్తిగా చెక్ పడింది.

ఆర్బీకేల ద్వారా ఎరువుల విక్రయాలు..

సంవత్సరం	అమ్మకం (లక్షల టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)	రైతులు (లక్షల్లో)
2020–21	1.07	99.88	2.55
2021–22	3.68	379.22	10.03
2022–23	3.94	473.92	10.89
2023–24 (ఖరీఫ్)	2.00	227.19	5.15
రబీ	0.13	15.86	0.33

(అక్టోబర్ 8 వరకు)

ఆరోపణ: విత్తనాలు దొరకవు..

వాస్తవం: సీజన్‌కు ముందుగానే సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలను రైతులు బుక్ చేసుకున్న 24 గంటల్లోపే వారికి అందిస్తున్నారు. ఇలా ఈ నాలుగేళ్లలో 55.72 లక్షల మంది రైతులకు రూ.881.47 కోట్ల విలువైన 30.99 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై ఆర్బీకేల ద్వారా మాత్రమే పంపిణీ చేశారు. అంతేకాదు.. రూ.12.75 కోట్ల విలువైన మిరప, పత్తి, మొక్కజొన్న వంటి నాన్ సబ్సిడీ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.

ఆర్బీకేల ద్వారా విత్తన విక్రయాలు ఇలా..

సంవత్సరం	ఖరీఫ్‌లో ఎరువులు (క్వింటాళ్లలో)	రబీలో ఎరువులు (క్వింటాళ్లలో)	రైతులు (లక్షల్లో)
2020–21	6,99,179	2,28,953	17
2021–22	6,16,806	3,17,673	16.59
2022–23	5,40,901	1,75,535	12.55
2023–24	5,20,321	--	9.58

ఆరోపణ: ఆర్బీకేలకు గుర్తింపేది?

వాస్తవం: ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటై మూడున్నరేళ్లు కావస్తోంది. అనతికాలంలోనే ఆర్బీకేలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖుల ప్రశంసలు పొందాయి. అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయి. కేంద్ర వ్యవసాయ శాఖ, నీతి ఆయోగ్, ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసలందుకున్నాయి. యూఎన్ చాంపియన్ అవార్డుకు నామినేట్ అయ్యాయి. ఆర్బీకే స్ఫూర్తితో జాతీయస్థాయిలో పీఎం సమృద్ధి కేంద్రాలను కేంద్రం ఏర్పాటుచేసింది. ఆర్బీకే సాంకేతికత కోసం పొరుగు రాష్ట్రాలే కాదు.. దేశ, విదేశాలు సైతం పోటీపడుతున్నాయి. ఇథియోపియా వంటి ఆఫ్రికన్ దేశం ఆర్బీకే సాంకేతికత కోసం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా చేసుకుంది. ఇలా ఆర్బీకేలు ఇన్ని వసతులను కల్పించి రైతుకు భరోసా ఇచ్చినా.. ఆర్బీకే వ్యవస్థను సిగ్గు సిగ్గు అని తక్కువ చేసి చూపడం రామోజీకే చెల్లింది.

ఎమ్మెల్యే శంకరనారాయణ వాహనంపై డిటోనేటర్‌తో దాడి

- అది పేలకపోవడంతో తప్పినముప్పు
- పెనుకొండ నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఘటన
- ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఎమ్మెల్యే వాహనంపై డిటోనేటర్ విసిరిన గణేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గోరంట్ల: శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ వాహనంపై ఆదివారం ఓ వ్యక్తి ఎలక్ట్రికల్ డిటోనేటర్‌తో దాడిచేశాడు. అది పేలకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు.. ఎమ్మెల్యే శంకరనారాయణ పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండాలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. అదే సమయంలో సోమందేపల్లి మండలం గుడిపల్లికి చెందిన హరిజన గణేశ్ తన జేబులో ఉన్న ఎలక్ట్రికల్ డిటోనేటర్ తీసుకుని ఎమ్మెల్యే వాహనంపై విసిరాడు. అది పేలలేదు. గమనించిన సీఐ సుబ్బరాయుడు, పోలీసు సిబ్బంది వెంటనే గణేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. నిందితుడు గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని నాసన్ కంపెనీలో డ్రైవర్ విధులతోపాటు డిటోనేటర్లు పేల్చేపని చేసేవాడు. ఆదివారం అతిగా మద్యం తాగడంతో కాంట్రాక్టర్ పనుల్లో పెట్టుకోకుండా వెళ్లిపొమ్మన్నాడు. దీంతో అతడు నేరుగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నాడు. మద్యం మత్తులో ఎమ్మెల్యే వాహనంపైకి డిటోనేటర్ విసిరాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ డీఎస్పీ ఉసేన్‌పీరా గోరంట్ల స్టేషన్‌కు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మరింత లోతుగా విచారించి నిజానిజాలు నిగ్గుతేలుస్తామని ఎస్పీ తెలిపారు.

ఘటన దురదృష్టకరం

నియోజకవర్గంలో ఎలాంటి ఫ్యాక్షన్ ప్రభావం లేకుండా ప్రజలకు సేవచేస్తున్నా. డిటోనేటర్ పేలకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన దురదృష్టకరం. పోలీసులు సమగ్ర విచారణ జరిపి ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– ఎమ్మెల్యే శంకరనారాయణ

ఆర్బీకేలపై ఎల్లో మీడియా దుష్ప్రచారం

- రుణమాఫీని బాబు ఎగ్గొట్టినప్పుడు రైతులు ఎందుకు గుర్తుకురాలేదు?
- వారి ప్రయోజనాలను అప్పటి మంత్రి సోమిరెడ్డి తాకట్టు పెట్టారు
- అప్పట్లో గిట్టుబాటు ధరలులేక రైతులు రోడ్డెక్కారు
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకే)పై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని.. పుచ్చిపోయిన మెదళ్లతో రోత పుట్టేలా నిస్సిగ్గుగా వార్తలు రాస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ఆర్బీకేల ద్వారా నాలుగు లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించామని, రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తోపాటు పంటల బీమాను అమలుచేస్తూ రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. 2014 ఎన్నికల్లో రైతుకు పూర్తి రుణమాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు చెప్పి మోసం చేశారని, అప్పుడు పచ్చమీడియాకు రైతులు ఎందుకు గుర్తుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. నెల్లూరు నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి కాకాణి ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలన అంతా అవినీతిమయమని, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతుల ప్రయోజనాలను కమీషన్ల కోసం తాకట్టు పెట్టారని, అలా కోట్లు సంపాదించిన సోమిరెడ్డి నేడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పట్లో గిట్టుబాటు ధరలులేక రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేశారని, మిల్లర్లతో సోమిరెడ్డి కుమ్మక్కు కావడంవల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని మంత్రి గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో చందాలు దండుకోవడం, వచ్చిన డబ్బులతో ఐదేళ్లు గడుపుకోవడం సోమిరెడ్డికి అలవాటుగా మారిందన్నారు.

'స్కిల్' స్కాంలో పచ్చ మీడియా తంటాలు..

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ సీఎం చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని.. ఆయన చేసిన అవినీతి గురించి మాట్లాడకుండా అరెస్టు అక్రమమని టీడీపీ నేతలు చెబుతుండడం విడ్డూరంగా ఉందని కాకాణి అన్నారు. అలాగే, చంద్రబాబు అవినీతికి పాల్పడలేదని కోర్టులకు కూడా చెప్పడంలేదని, సెక్షన్ల గురించే చెబుతున్నారన్నారు. ఈ కేసులో అవినీతి జరిగిందని, ఇప్పటికే ఐటీ శాఖ, ఈడీలు నిర్ధారించాయని, కానీ.. ఎల్లో మీడియా మాత్రం తప్పును కప్పిపుచ్చుకునేందుకు తంటాలు పడుతోందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ ఆందోళనలకు ప్రజలు రావడంలేదని.. దీన్నిబట్టి ప్రజల్లో చంద్రబాబుకు ఎంత పరపతి ఉందో అర్థమవుతోందన్నారు. ఇక మంత్రి స్థాయిలో ఉన్న రోజాపై బండారు సత్యనారాయణ మూర్తితో విమర్శలు చేయించడం పద్ధతి కాదని, అందుకే రోజాకు అందరూ మద్దతు తెలుపుతున్నారని మంత్రి కాకాణి అన్నారు.

అవినీతి, దోపిడీలు చేసే చంద్రబాబు జైలుకు

వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి, మంత్రి బొత్స



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, అనకాపల్లి: టీడీపీ ప్రభుత్వంలో చేసిన అవినీతి, దోపిడీ వల్లే నేడు చంద్రబాబు జైలుకు వెళ్లాల్సి వచ్చిందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. కె.కోటపాడు మండలం మర్రివలసలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో రూ.88 లక్షలతో నిర్మించిన నూతన భవనాలు, జల్ జీవన్ మిషన్‌లో భాగంగా రూ.41 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ భీశెట్టి సత్యవతి ఆదివారం ప్రారంభించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేనలు సీఎంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని గ్రామ స్థాయి నుంచే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు రానున్నాయని, టీడీపీ, జనసేన రెండూ కలిసి మరోసారి మోసపూరిత హామీలిచ్చేందుకు సిద్ధమయ్యాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ మర్రివలసలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి రాష్ట్రంలోనే మొదటిసారిగా శిలాఫలకాలు వేసి, ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఈర్లె అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

బండారు వ్యాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్తా

అతడిలాంటి చీడపురుగుల్ని ఏరివేయాలి: మంత్రి రోజా



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి తనపై చేసిన వాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయపరంగా పోరాడతానని మంత్రి ఆర్.కె.రోజా చెప్పారు. బండారు లాంటి చీడపురుగులను ఏరిపారేయాలంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ఒకమాట అనాలంటే భయపడే పరిస్థితి రావాలన్నారు. చైనాలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో టెన్నిస్ మెన్స్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన మైనేని సాకేత్‌ను ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. స్కిల్ కుంభకోణంలో అవినీతికి పాల్పడిన చంద్రబాబునాయుడును సీఐడీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడంతో టీడీపీ వారికి పిచ్చెక్కి ఎవరిని తిడదామా.. అని ఆలోచిస్తున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీ నుంచి లాయర్లు వచ్చినా చంద్రబాబును జైలు నుంచి బయటకు తీసుకురాలేకపోతున్నారని పేర్కొన్నారు. బండారు సత్యనారాయణమూర్తి తన నియోజకవర్గంలోని, ఇంట్లోని మహిళలకు ఏవిధమైన విలువ ఇస్తారో బహిర్గతమైందని చెప్పారు. తనకు ఊహ తెలిసినంతవరకు ఎవరూ ఇంతలా ఒక మహిళ గురించి మాట్లాడలేదన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని రోజా విమర్శించారు.

చంద్రబాబు హయాంలో సాకేత్‌పై వివక్ష

సాకేత్ మైనేని సత్కార కార్యక్రమంలో రోజా మాట్లాడుతూ క్రీడల్లో ఆడి ఓడితే రికార్డుల్లో ఉంటారని, గెలిస్తే వారిపేరు చరిత్రలో ఉంటుందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వకాలంలోనే సాకేత్ మైనేని పతకాలు సాధించినా వివక్ష చూపి సరైన ప్రోత్సాహకాలు ఇవ్వలేదని చెప్పారు. క్రీడల విషయంలో కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలు చూడకుండా ప్రోత్సహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. సాకేత్‌కు అతి త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని కూడా ప్రభుత్వం కేటాయిస్తుందని ప్రకటించారు. 'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడా సంబరాలు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014లో జరిగిన ఆసియా క్రీడల్లో మిక్సిడ్ డబుల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించినా సాకేత్‌పై అప్పటి సీఎం చంద్రబాబు వివక్ష చూపించి సరైన ప్రోత్సాహకాలివ్వలేదని విమర్శించారు. సాకేత్ మైనేని మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో ఆడి దేశానికి మెడల్ తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పారు. తన పరిస్థితి తెలుసుకుని ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి అవినాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ జి.గంగరాజు, ఏపీ లాన్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.పట్టాభిరామయ్య ప్రసంగించారు. మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్, బొప్పన భవకుమార్, సాకేత్ మైనేని సతీమణి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

జనసేనకు 'మేడా' గుడ్‌బై

- పవన్ వైఖరి నచ్చకే రాజీనామా: రాజానగరం మాజీ ఇన్‌చార్జి మేడా గురుదత్త ప్రసాద్
- మరో 100 మంది కూడా..



మధురపూడి: తూర్పు గోదావరి జిల్లాలో జనసేనకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గతంలో రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసిన మేడా గురుదత్త ప్రసాద్ సహా 100 మంది ఆ పార్టీకి రాజీనామా చేశారు. కోరుకొండలో ఆదివారం ఆయన మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం గురించి మాట్లాడే జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్.. ఆ పార్టీలో ఉన్న వారికి కూడా ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ఉంటాయన్న విషయం తెలుకోలేకపోవడం బాధాకరమని, ఈ కారణంగానే తాను పార్టీని వీడాల్సి వచ్చిందని గురుదత్త ప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజారాజ్యం, తరువాత జనసేన పార్టీలో కలిపి 16 ఏళ్లు అంకితభావంతో పనిచేశానని చెప్పారు. పార్టీలో ఒంటెద్దు పోకడలు నెలకొన్నాయని, అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడిందని, ఈ కారణంతోనే మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణతోపాటు తోట చంద్రశేఖర్, అద్దేపల్లి శ్రీధర్, రాజురవితేజ, జయలలిత వద్ద చీఫ్ సెక్రటరీగా పనిచేసిన రామ్మోహన్ సహా 11 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు జనసేనకు గుడ్‌బై చెప్పారని గుర్తుచేశారు. వారితో పోలిస్తే తాను చాలా చిన్నవాడినన్నారు. తనను నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తప్పిస్తున్నట్లు తనకు తెలియజేయలేదని, అధిష్టానం అపాయింట్‌మెంట్ కోసం 87 రోజులుగా వేచి చూశానని.. చివరకు ఈ అవమానం భరించలేక రాజీనామా చేస్తానని గత నెల 30న లేఖ రాసినప్పటికీ ఎవ్వరూ స్పందించలేదన్నారు. పార్టీ అధ్యక్షుడు పవన్ తీరు కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురుదత్త ప్రసాద్ తెలిపారు. ఆయనతో పాటు జనసేన కోరుకొండ మండలాధ్యక్షుడు మండపాక శ్రీను, రాజానగరం మండలాధ్యక్షుడు బత్తిన వెంకన్నదొర, ఉపాధ్యక్షుడు నాగారపు భానుశంకర్, నాయకులు అడబాల సత్యనారాయణ, కొచ్చెర్ల బాబీతోపాటు 100 మంది జనసేనకు గుడ్‌బై చెప్పారు. త్వరలో మరికొందరు కూడా రాజీనామా చేస్తారని మేడా తెలిపారు. స్థానిక నాయకత్వం వన్ మ్యాన్ షోలా వ్యవహరించడం, ఇతర సమస్యల కారణంగా రాజీనామాలు తప్పవన్నారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలో వెల్లడిస్తానని చెప్పారు.



నేను డైయొజినీజ్ అనే కుక్కను. దయగలవారి వద్దకు చేరుతాను. దురాశాపరుల మీద అరుస్తాను. దుష్టులను కొరుకుతాను.

– డైయొజినీజ్

సాక్షి
సోమవారం, 9 అక్టోబర్ 2023

సీన్యో కాల్వీనో

ఇటాలో కాల్వీనో అనే పేరు వినగానే ఆయనో ఇటాలియన్ రచయిత అనిపించడం సహజమే. ఊహకు అందేట్టుగా ఇటాలియనే అయినా కాల్వీనో పుట్టింది క్యూబా రాజధాని హవానాలో. తమ దేశ మూలాలు మర్చిపోకూడదనే ఉద్దేశంతో తల్లి పెట్టిన ఈ పేరు ఆయనకు పెద్దయ్యాక మరీ జాతీయవాదపు పేరులా తోచింది. అయితే వాళ్ల కుటుంబం ఇటలీకి తిరిగి వచ్చాక, తన 20 ఏళ్ల వయసులో కాల్వీనో జాతీయవాద ఫాసిస్టు పార్టీ మీద పోరాడటం దానికి ఒక చిత్రమైన కొనసాగింపు. ఆ పోరాటంలో భాగంగా ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యాడు. కమ్యూనిస్టుగా బతికాడు. అనంతర కాలంలో ఆ పార్టీకి దూరమయ్యాడు. అప్పటికే ఆయన వాస్తవిక చిత్రణ మీద పార్టీ విమర్శించడం మొదలుపెట్టింది. ఇక హంగెరీ మీద సోవియట్ రష్యా దాడి(1956) తర్వాత పార్టీ మీది భ్రమలు పూర్తిగా చెదిరిపోయి రాజీనామా చేశాడు. మళ్లీ ఏ పార్టీలోనూ సభ్యుడు కాలేదు. జర్నలిస్టుగా ఉద్యోగం చేసుకుంటూ; కథలు, నవలలు రాసుకుంటూ; తనకు నచ్చిన రాతలను ప్రమోట్ చేసుకుంటూ, కథల మీద మాట్లాడుకుంటూ బతికాడు. ఆధునిక ఇటాలియన్ సాహిత్యంలో అత్యధికంగా అనువాదం అయిన రచయితగా ప్రసిద్ధి గడించిన ఇటాలో కాల్వీనో శతజయంతి (జననం: 1923 అక్టోబర్ 15) సంవత్సరం ఇది.

ఇటాలో కాల్వీనో ప్రపంచంలో నిచ్చెన వేసుకుని చందమామ మీదికి ఒక్క గెంతులో ఎక్కేయొచ్చు. దాని పాలను లోడుకోవచ్చు. చేయాల్సిందల్లా పొక్కులుగట్టిన చందమామ ఉపరితలం మీదుండే పొలుసులను కొద్దిగా జరిపి అక్కడ గరిట పెట్టడమే. కాకపోతే ఆ మీగడ చిక్కదనపు పాలల్లో 'ఎక్కువభాగం పండ్లు, కప్పల గుడ్లు, శిలాజిత్, అలచందలు, తేనె, పటికలుగా మారిన పిండి, సొరచేపల గుడ్లు, నాచు, పుప్పొడి, చిన్నచిన్న పురుగులు, చెట్ల జిగురు, మిరియాలు, ఖనిజ లవణాలు, బూడిద' ఉంటాయి కాబట్టి వాటిని శుద్ధి చేసుకోవాల్సి ఉంటుంది (ద డిస్టన్స్ ఆఫ్ ద మూన్). ఇంకా, కాల్వీనో లోకంలో చిన్న పిల్లను పోనివ్వడానికి జోర్డాన్ నది తన నీటిని కొద్దిగా వంచి దారి ఇస్తుంది. ఎందుకంటే ఆ నదికి ఇష్టమైన ఉంగరపు ఆకృతి కేకుల్ని ఆ పాప పెడతానంది కదా (ఫాల్స్ గ్రాండ్‌మదర్)! ఆయన సృజించిన నగరానికి ఎప్పటికీ దేనికీ కిందికి దిగే పనిలేదు. అది పొడవాటి ఫ్లెమింగో కాళ్ల మీద నిలబడి ఉంటుంది. అదొక్కటే నగరానికీ, భూమికీ సంబంధం (ది ఇన్విజిబుల్ సిటీ). వెంట వెంటనే కలుసుకుంటున్నట్టుగా వచ్చి, లేచి, విరిగిపడే అలల్లో ఒకదాన్నుంచి ఇంకోదాన్ని ఎలా విడదీయాలో తెలీక అదేపనిగా చూస్తుంటాడు 'మిస్టర్ పాలొమార్'. విలువలు తలకిందులైన ప్రపంచంలో ఒక మనిషి నిజాయితీ కూడా ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేయగలదు. అందరూ బుద్ధిగా దొంగతనం చేస్తున్నప్పుడు, ఆయన మాత్రం చేయనంటే ఎలా కుదురుతుంది? (ద బ్లాక్ షీప్).

కాల్వీనో తల్లి ఇటలీలోని సార్డీనియా ద్వీపానికి చెందినవారు. ప్రపంచంలో శతాధిక వృద్ధులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇదీ ఒకటి. దీనికి భిన్నంగా కాల్వీనో అరవై ఏళ్లే బతికాడు(మరణం: 1985 సెప్టెంబర్ 19). ఆయన రచనల విషయంలో మాత్రం ఈ మాట అనలేము. 'అవర్ యాన్సెస్టర్స్' ట్రయాలజీ, 'కాస్మికామిక్స్' లాంటి పుస్తకాలను వెలువరించిన కాల్వీనో ప్రపంచంలో అన్నీ అసాధ్యాలే. కొన్నిసార్లు రాస్తున్నప్పుడు నాకు వెర్రెత్తుతుంది అంటాడాయన. ఒక నవలను మళ్లీ మళ్లీ చదవడానికి ఉపక్రమించే పాఠకుడి జీవితం కూడా ఆయనకు నవల అవుతుంది. దీన్ని అత్యంత పోస్ట్ మాడర్నిస్ట్ నవల అంటారు (ఇఫ్ ఆన్ ఎ వింటర్స్ నైట్ ఎ ట్రావెలర్). కానీ ఆయన రచనలు ఎంత ఆధునికమో అంత ప్రాచీనం. ఎంత ప్రాచీనమో అంత ఆధునికం. కొత్త పుంతలు తొక్కడం అనే మాట ఆయనకు బాగా వర్తిస్తుంది. ఇటాలియన్ జానపద గాథలను కూడా ఆయన ప్రచురించాడు. కాల్వీనో రచనా వ్యాసంగంలో ఇదొక ముఖ్యాంశం.

'రాజకీయాల తర్వాత, సాహిత్యానికి రెండో స్థానం ఇవ్వడం అనే ఆలోచన పెద్ద తప్పు. ఎందుకంటే, రాజకీయాలు దాదాపుగా ఎన్నడూ తన ఆదర్శాలను సాధించలేవు. మరోపక్కన, సాహిత్యం దాని రంగంలో అది కొంతైనా సాధించగలదు, దీర్ఘకాలంలో కొంత ఆచరణాత్మక ప్రభావాన్ని కూడా కలిగించగలదు... ముఖ్యమైన విషయాలు నెమ్మదైన ప్రక్రియల ద్వారా మాత్రమే సాధించగలం' అనే కాల్వీనో విదేశీ సంస్కృతులను గురించిన అవగాహన ఏ సంస్కృతికైనా కీలకం అనేవాడు. సొంత సృజన శక్తిని సజీవంగా ఉంచుకోవాలంటే విదేశీ ప్రభావాలకు సిద్ధంగా ఉండాలన్నాడు. ఇద్దరం కలుస్తున్నామంటే, భిన్న ప్రపంచాల్ని వెంట బెట్టుకుని వస్తాం; ఆ కలిసిన బిందువు నుంచి కొత్త కథ మొదలవుతుందంటాడు.

ఒకరోజు– మనకు కవితలు, నవలలు రాసేలా కవికీ, రచయితకూ ప్రత్యామ్నాయం కాగలిగే సాంకేతిక పరిజ్ఞానం వస్తుందని 1967లోనే కాల్వీనో ఊహించిన విషయాన్ని ఛాట్ జీపీటీ నేపథ్యంలో పాత్రికేయుడు రాబెర్టో డి కారో గుర్తుచేసుకుంటారు. విదేశీ మాటలు, ప్రత్యేకించి ఆంగ్లపదం 'ఫీడ్‌బ్యాక్' మీద కాల్వీనో మోజు పడి, దాన్ని ఎలాగైనా 'మిస్టర్ పాలొమార్' ఆంగ్లానువాదంలో చేర్చాలని ఉబలాటపడ్డాడట. 'సీన్యో(మిస్టర్ లాంటి ఒక గౌరవ వాచకం) కాల్వీనో! ఒక ఇటాలియన్ చెవికి ఆ పదం ఎంత అందంగా వినబడినా, ఆంగ్ల సాహిత్యంలో అదేమంత ఉచితంగా ఉండ'దని కాల్వీనో రచనలకు స్థిర అనువాదకుడిగా పనిచేసిన విలియమ్ వీవర్ తిరస్కరించాడట. అయితే, ఎంతటి కృత్రిమ మేధ వచ్చినా, చంద్రుడి పాలు మీగడలా చిక్కగా ఉంటాయని ఊహించిన కాల్వీనో మెదడును ఏ కంప్యూటరూ అందుకోలేదని మనం ఫీడ్‌బ్యాక్ ఇచ్చి ఆయన్ని ఆనందపరచొచ్చు!

కలవర పెడుతున్న ప్రశ్నలు

కామెంట్



కరణ్ థాపర్

ఇద్దరు మైతేయి విద్యార్థుల హత్యపై దర్యాప్తు జరిపేందుకు కేంద్రం ప్రత్యేక సీబీఐ బృందాన్ని మణిపుర్‌కు పంపింది. సీబీఐ పదకొండు కేసులను దర్యాప్తు చేస్తోంది. వాటి కోసం మణిపుర్ వెళ్లని సీబీఐ బృందం, ఈ కేసు కోసమే ఎందుకు వెళ్లినట్లు? ''మణిపుర్‌లోని ప్రస్తుత సంక్షోభం జాతుల మధ్య ఘర్షణ కాదు. మయన్మార్, బంగ్లాదేశ్‌లలో స్థావరాలు ఏర్పరచుకుని ఉన్న కుకీ మిలిటెంట్‌లు... మణిపుర్ నుంచి పని చేస్తున్న తీవ్రవాద సంస్థల సహకారంతో భారత ప్రభుత్వంపై తలపెట్టిన పూర్తిస్థాయి యుద్ధం'' అని ముఖ్యమంత్రి బీరేన్ అన్నారు. తీవ్రవాద సంస్థలు ఈ రెండు తెగలతోనూ సంబంధాలను కలిగి ఉండి మణిపుర్‌లో ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నాయి. బీరేన్ ఎందుకు ఒక వైపే మాట్లాడుతున్నారు?

ఇద్దరు మైతేయి విద్యార్థుల హత్యపై దర్యాప్తు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక సీబీఐ బృందాన్ని మణిపుర్‌కు పంపడంలో చూపిన ఉల్లాస పూరితమైన సంసిద్ధతను, ఆ కేసును ఛేదించారని చెబుతున్న సీబీఐ బృందం పని తీరులోని గొప్ప వేగాన్ని అభినందిస్తూనే... విషయాలను క్లిష్టతరం చేయగల కొన్ని ప్రశ్నల్ని కూడా ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం ఒక విలువైన పరిశీలన కాగలదని నేను విశ్వసిస్తున్నాను. ఈ ప్రశ్నల్లో కొన్ని నిస్సందేహంగా కుకీ తెగలవారు లేవనెత్తినవే అయి ఉంటాయన్నది ఆశ్చర్యమేమీ కాదు. అంతమాత్రాన ఆ ప్రశ్నలు చెల్లుబాటు కాకుండాపోతాయని మాత్రం నేనైతే కచ్చితంగా అనుకోను.

మొదటి విషయం ఏంటంటే, సీబీఐ పదకొండు కేసులను దర్యాప్తు చేస్తోంది. కార్–వాష్ స్టేషన్‌లో ఇద్దరు కుకీ మహిళలపై లైంగిక దాడి జరిపి వారిని హత్య చేసినప్పుడు... డేవిడ్ థీక్ తల నరికి చంపినప్పుడు... అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న తల్లినీ, బిడ్డనూ వాహనంతో సహా కాల్చి బూడిద చేసినప్పుడు... దర్యాప్తు కోసం మణిపుర్ వెళ్లని సీబీఐ ప్రత్యేక బృందం... ఇద్దరు మైతేయి విద్యార్థుల హత్యపై విచారణ జరిపేందుకు ఇంఫాల్‌కు ఎందుకు వెళ్లినట్లని మీరడగవచ్చు. మీరు కుకీ తెగకు చెందిన వారైతే కనుక ఇది మీకు మైతేయిల పట్ల కేంద్రం ప్రత్యేకమైన శ్రద్ధను కనబరుస్తున్నట్లుగా అనిపించదా?

రెండో ప్రశ్న కూడా అంతే ముఖ్యమైనది. అజయ్ భట్నాగర్ నేతృత్వంలోని సీబీఐ ప్రత్యేక బృందం సెప్టెంబర్ 27 సాయంత్రం ఇంఫాల్ చేరుకుంది. నాలుగు రోజుల లోపే కొన్ని అరెస్టులు జరిపింది. ఇక్కడే ఐ.టి.ఎల్.ఎఫ్. (ఇండీజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్) ఒక ప్రశ్నను లేవనెత్తింది. ''ఇంత వేగంగా పని చేయగలిగిన సీబీఐ మిగతా హేయమైన కేసులలో ఎందుకని ఒక్కర్నీ అరెస్టు చేయలేదు?'' అని ప్రశ్నించింది.

కుకీ తెగ ప్రజల అత్యున్నత స్థాయి స్వయం ప్రకటిత సంఘం 'కుకీ ఇంపీ' మరింత సూటిదైన ప్రశ్నకు సమాధానం కోరుతోంది. ''కుకీ–జో కమ్యూనిటీకి వ్యతిరేకంగా అనుమానాస్పద కారణాలతో అరెస్టులు చేసినప్పుడు... కుకీ–జో ప్రజలపై ఎంతో అమానుషంగా, అనాగరికంగా శిరచ్ఛేదనకు, అత్యాచారాలకు, గృహ దహనాలకు పాల్పడిన నేరస్థులను అదే తరహాలో ఎందుకు అరెస్టు చేయలేదు?'' అని కుకీ ఇంపీ ప్రశ్నిస్తోంది.



మణిపుర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్

ఏమైనా, కుకీలు లేవనెత్తిన ఈ ప్రశ్నలతో పాటుగా ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చేసిన వ్యాఖ్యల నుంచి తలెత్తిన ప్రశ్నలూ కొన్ని ఆలోచన రేకెత్తించేవిగా ఉన్నాయి. సీబీఐ అరెస్టుల అనంతరం బీరెన్ సింగ్, ''విద్యార్థుల అపహరణ, హత్యకు కారణమైన కొంతమంది ప్రధాన నేరస్థులు ఈ రోజు చురాచాంద్‌పుర్‌లో అరెస్ట్ అయ్యారని చెప్పడానికి నేనెంతో సంతోషిస్తున్నాను'' అని ట్వీట్ చేశారు. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు నిందితులు మాత్రమే కదా అవుతారు? బీరేన్ ఏ ప్రాతిపదికన నిందితులను దోషులుగా పేర్కొన్నారు? అలా పేర్కొనడం... కోర్టులో నిందితుల అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉంటుందా?

కుకీలకు ఇది రుచించకపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఐ.టి.ఎల్.ఎఫ్. వ్యక్తం చేసిన ఆందోళనే ఇతరులు అనేక మందిలోనూ చోటు చేసుకుంది. ''మహిళలు సహా అభాగ్యులైన కుకీ గిరిజనుల పట్ల కఠినంగా వ్యవహరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మైతేయి తెగల ఆగ్రహం నుండి ముఖ్యమంత్రిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా కనిపిస్తోంది'' అని వారి అనుమానం.

కనుక మీరిప్పుడు నేనెందుకు ఈ ప్రశ్నల వైపు మీ దృష్టిని మరల్చానో అర్థం చేసుకోవచ్చు. ఈ నిర్దిష్ట ఘటనలో ఇంఫాల్‌లోని పరిణామాలు చురాచాంద్‌పుర్ నుండి చూసినప్పుడు పూర్తి భిన్నంగా కనిపిస్తాయి. కచ్చితంగా ఐదు నెలల తర్వాత ఢిల్లీలో మంత్రులకు, అధికారులకు ఈ విషయం తెలిసి తీరుతుంది. అయినప్పటికీ అది వారినేమీ భావోద్వేగానికి గురి చేయదు. ''నేనెందుకు ఆశ్చర్యపోతున్నాను?'' అనే మరొక ప్రశ్నకు ఆ పరిణామం దారి తీస్తుంది.

ఒక భిన్నమైన, అయినప్పటికీ సంబంధం కలిగివున్న ఒక విషయాన్ని లేవనెత్తడంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఇప్పుడు తన రాష్ట్రాన్ని ఇలా చూస్తున్నారు: ''మణిపుర్‌లోని ప్రస్తుత సంక్షోభం జాతుల సమూహాల మధ్య ఘర్షణ కాదు. రాష్ట్ర శాంతి భద్రతల సమస్య కూడా కాదు. మయన్మార్, బంగ్లాదేశ్‌లలో స్థావరాలు ఏర్పరచుకుని ఉన్న కుకీ మిలిటెంట్‌లు... మణిపుర్ నుంచి పని చేస్తున్న తీవ్రవాద సంస్థల సహకారంతో భారత ప్రభుత్వంపై తలపెట్టిన పూర్తిస్థాయి యుద్ధం'' అంటారు ఆయన. ఇది మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇది బీరేన్ అభిప్రాయమా? లేక న్యూఢిల్లీ అభిప్రాయమా? న్యూఢిల్లీ అభిప్రాయమే అయితే ఈ విషయాన్ని నెపిడా(మయన్మార్ రాజధాని), ఢాకాల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందా?

యుద్ధం అని మీరెలా చెప్పగలరు అని ముఖ్యమంత్రిని అడిగితే, ఆయన నిస్సందేహంగా సీమిన్లుమ్ గాంగ్టే అనే కుకీ అరెస్టును చూపుతారు. ఎన్.ఐ.ఎ. (నేషనల్ ఇంటెలిజన్స్ ఏజెన్సీ) అంటున్న దానిని బట్టి గాంగ్టే దేశ సరిహద్దుకు అవల ఉన్న తీవ్రవాద సంస్థ సభ్యుడు. అయితే గాంగ్టే అరెస్టుకు కొన్ని రోజుల ముందు నిషేధిత 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ' సభ్యుడైన మొయిరాంగ్థమ్ ఆనంద్ సింగ్ అనే మైతేయి తెగ వ్యక్తిని కూడా ఎన్.ఐ.ఎ. అరెస్టు చేసింది. దీనిని బట్టి తీవ్రవాద సంస్థలు ఈ రెండు తెగల వారితోనూ సంబంధాలను కలిగి ఉండి మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుండి మణిపుర్‌లో కుకీలు, మైతేయిల మధ్య ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నాయని అనుకోవాలి. మరైతే ముఖ్యమంత్రి ఎందుకు ఒక వైపే మాట్లాడుతున్నారు? మళ్లీ ఇదొక కలవరపెట్టే ప్రశ్న.

నా ముగింపు: మణిపుర్ రెండు వైపుల నుంచీ కలవరపరిచే ప్రశ్నలను విసురుతోంది. అందుకే కేవలం ఒక కోణం నుంచి ఇచ్చే సమాధానం పరిస్థితిని మరింతగా దిగజారుస్తుంది. ఎందుకు అని అర్థం చేసుకోడానికి ఈ చిన్న ముక్క మీకు సహాయపడి ఉంటుందని నేను ఆశిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

విశేషమైన క్షణం



చరిత్రలో తొలిసారి ఈ పోరాటంలో పాలస్తీనియన్లు సెటిలర్ల నుంచి పట్టణాన్ని వెనక్కి తీసుకున్నారు. ఇది కొద్ది కాలమే కావొచ్చు, దాన్ని నిలుపుకోలేకపోవచ్చు, కానీ ఇది మానసిక యుద్ధంలో విశేషమైన క్షణం.

– సెమీ హెర్మేజ్, ఆంత్రోపాలజిస్ట్

తూతూ మంత్రమా?



చిత్రమైన పరిస్థితి: ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్ జరపడం మాత్రమే బీసీసీఐకీ, ప్రభుత్వానికీ ప్రాధాన్యం; కానీ పాకిస్తానీ అభిమానులు, జర్నలిస్టులను మాత్రం దాన్ని చూడటానికి అనుమతించరా?

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

చేప కథ



మనిషికి ఒక చేప ఇవ్వండి, అతడు ఆ రోజుకు భోంచేస్తాడు. చేపను పట్టడం ఎలాగో నేర్పండి, అతడు జీవితకాలం తినగలుగుతాడు. కానీ ప్రార్థన చేయడం బోధించండి, అతడు చేప కోసం ప్రార్థిస్తూ చనిపోతాడు.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

మనుగడ ఉంటుందా?



నిజమైన పోరాటం రైట్, లెఫ్ట్ మధ్య కాదు; మానవ వాదులకూ, వినాశన వాదులకూ మధ్య.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

ఇంత అసమానతా?



ప్రపంచంలో ఇప్పుడున్న అసమానతా స్థాయిలు అన్యాయమైనవి. ఒక కాలం వస్తుంది, అప్పుడు జనం వెనక్కి చూసి, మనం ఇంత అసమానతను సహించామా అని దిగ్భ్రమ చెందుతారు; బానిసత్వాన్నీ, దాస్యాన్నీ మన ప్రాచీనులు ఎలా సహించారా అని మనం దిగ్భ్రమ చెందుతున్నట్టుగానే!

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇజ్రాయిల్ వెంటే!



పాలస్తీనా తీవ్రవాద దాడుల నేపథ్యంలో మేము గట్టిగా ఇజ్రాయిల్ వెనక నిలబడతాం. అందరికీ మెరుగైన పరిష్కారం కోసం, శాంతి ఒప్పందం కోసం సౌదీ అరేబియా, ఇజ్రాయిల్ పనిచేస్తుంటే, రక్తదాహపు ఇరానియన్ మిలిటెంట్లు రెచ్చగొట్టడానికి పూనుకున్నారు. ముస్లిం లేదా అరబ్ ప్రపంచంలో అందరూ 'హమాస్'కు మద్దతివ్వడం లేదు. ఇజ్రాయిల్ గెలుస్తుంది.

– అమ్జద్ తాహా, వ్యూహాత్మక రాజకీయాల నిపుణుడు

ఏది లౌకికవాదం?



ఫ్రాన్స్ లౌకికవాదం అణచివేతతో కూడినది. దాని ప్రధానోద్దేశం 'మతం నుంచి రాజ్యాన్ని' కాపాడటమే. ఇందులో మతానికి ఉన్న రక్షణ తక్కువ. కానీ అదే అమెరికాలో లౌకికవాదం అంటే 'చర్చ్‌కూ, రాజ్యానికీ మధ్య విభజన'. రాజ్యం నుంచి మతాన్ని కాపాడటం. అందుకే అమెరికాలో స్వేచ్ఛ ఎక్కువ. అమెరికన్ ముస్లింలు సంతోషంగా ఉండటానికి కారణం అదే.

– ముస్తఫా అక్యోల్, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కొండ దాని శ్వాసని నిలుపుకుంది!

దీర్ఘ శ్వాస తీసుకున్నాక
కొండ అక్కడ నిలుచుంది
తరువాత కొండలు నిలుచున్నాయి అక్కడ
అదిగో అలా అక్కడ కొండలు

క్రింది వైపు
ఇంకా క్రిందికి
వాటిలోకి వాటికవే ఒంగిపోయి
వాటి శ్వాసని నిలుపుకుంటున్నాయి

ఆకాశం సముద్రం
లాలిస్తూ కొడుతున్నా
దాని శ్వాసని కొండ నిలుపుకునే ఉంది

– జాన్ ఫోసే

ఆంగ్లానువాదం: మే–బ్రిట్ అఖెర్హోల్ట్

తెలుగు అనువాదం: ముకుంద రామారావు । 99083 47273



జాన్ ఫోసే

(2023 సంవత్సరానికి నోబెల్ సాహిత్య బహుమతి పొందిన 'జాన్ ఫోసే' (1959) నార్వే లోని హార్డంగెర్ఫోర్డ్ తీరంలో పెరిగాడు. అక్కడి నీరు, గాలి, రాళ్లు, వర్షపు ప్రకృతి దృశ్యం, అతని అన్ని రచనల్లోనూ ఏదో ఒక రూపంలో తొంగిచూస్తుంటాయి. దానికి తోడు జన్మం–మరణం, స్నేహం–ఏకాంతం కూడా పునరావృతమయే ఇతివృత్తాలే. అయినా అవన్నీ అతని ప్రత్యేక శైలిలో, ఒక నిశ్శబ్ద సంగీత స్వరంలా చదువరులకు ధ్వనిస్తాయి. 'ఎరుపు నలుపు' నవలతో 1983లో సాహిత్య రంగప్రవేశం చేసిన ఆయన తన నాటకాల మూలంగా అంతర్జాతీయ ఖ్యాతి అర్జించాడు. అనేక అంతర్జాతీయ బహుమతులు పొందాడు. 40కి పైగా వచ్చిన అతని పుస్తకాలలో 10 గద్యం, 5 పద్యం, 9 పిల్లల కోసం చేసిన రచనలు, 20 నాటకాలు, 6 వ్యాస సంకలనాలు వగైరా వచ్చాయి. అందరూ అంగీకరించిన అతని ప్రముఖ కవితలలో పైది ఒకటి.)

మనసుకూ జబ్బులొస్తాయి!

సందర్భం



డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి

మన దేశ జనాభాలో దాదాపు రెండు కోట్ల మందికి పైగా పలురకాల మానసిక వ్యాధులతో బాధపడుతున్నారు. ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో మానసిక వైద్యుల సంఖ్య చాలా తక్కువే. అర్హత పొందిన మానసిక వైద్యులు కేవలం పదివేల మంది మాత్రమే ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వీరి సంఖ్య నాలుగు వందల లోపే! శరీరంలో ఏదైనా భాగానికి జబ్బు చేస్తే, వెంటనే ఆయా స్పెషలిస్టుల దగ్గరికి వెళ్తాము. కానీ ఒక వ్యక్తి వింతగా ప్రవర్తించినా, మాట్లాడినా, కుంగిపోయినా, అది కూడా ఒక జబ్బేననీ, దానికి కూడా శాస్త్రీయమైన చికిత్స ఉందనీ, వైద్యనిపుణులు కూడా ఉన్నారనీ ఇప్పటికీ చాలామందికి తెలియదు. ఒకవేళ తెల్సినా, మానసిక డాక్టరు దగ్గరికి వెళ్తే పిచ్చిపట్టిందని చులకనగా చూస్తారనే భయంతో తొలి దశలోనే చికిత్స చేయించుకోక, ముదర పెట్టుకుంటారు. ఇంతేకాకుండా, దయ్యం, గాలి సోకిందనో, చేతబడి చేశారనో, మందు పెట్టారనో అపోహలతో, మూఢనమ్మకాలతో నాటు వైద్యులు, మంత్రవైద్యులతో వైద్యం చేయించుకొని వ్యాధి బాగా ముదిరిన తర్వాత డాక్టర్ల దగ్గరకి వెళ్తుంటారు.

ఇతర శరీర భాగాల్లాగా కాకుండా మనసనేది కంటికి కనబడని ఒక ప్రత్యేకమైన అవయవం. మనసనేది మెదడులోని అంతర్భాగమేనని శాస్త్రీయంగా నిర్ధారించిన విషయమే! మెదడు 'హార్డ్‌వేర్' అయితే మనసు 'సాఫ్ట్‌వేర్'. 'కంప్యూటర్‌లో సాఫ్ట్‌వేర్ కనబడకపోయినా, దాని పనితీరు తెలిసినట్లే, మనసనేది కనబడకపోయినా, దాని ప్రవర్తన, ఆలోచనాతీరు, భావోద్వేగాలు, నిర్ణయాత్మక శక్తి లాంటివన్నీ బయటికి తెలుస్తూనే ఉంటాయి. శరీరానికి, మనసుకు అవినాభావ సంబంధముంది. శరీరం ఆరోగ్యంగా ఉంటే మనసు కూడా ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మనసు ప్రశాంతంగా ఉంటే, శారీరక జబ్బులు కూడా మనల్ని ఇబ్బంది పెట్టవు.



మానసిక వ్యాధులు వచ్చే ముఖ్య కారణాల్లో వారసత్వంగా వచ్చేవి, మెదడు లోపాలు, మద్యం, మత్తు, మందుల అలవాటు, సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యం లేకపోవడం, తల్లితండ్రుల పెంపకంలో లోపాలు ముఖ్యమైనవి. మానసిక వ్యాధులంటే కేవలం 'పిచ్చి' అనే అపోహ చాలామందికి ఉంది. వందల రకాల మానసిక వ్యాధుల్లో 'పిచ్చి' (ఉన్మాదం) కేవలం ఒక రకమే! ఆందోళన, టెన్షన్, నిద్రలేమి, దిగులు, మనోవేదన, లేనిపోని భయాలు, అతిశుభ్రత లాంటి చాదస్తాలు, మద్యపానం, డ్రగ్స్‌కు బానిసలు కావడం, ఆత్మహత్యా ప్రయత్నాలు, మనస్పర్థలతో దంపతులు సర్దుకుపోలేకపోవడం, లైంగిక సమస్యలు. భ్రమలు, భ్రాంతులు, అకారణంగా ఇతరులను అనుమానించడం, దయ్యం–గాలిసోకినట్లు ఊగిపోవడం, ఇంకా చిన్నపిల్లల్లో వచ్చే ఆటిజమ్, హైపరాక్టివిటీ, మొండితనం, అతి కోపంతో తిట్టడం, కొట్టడం లాంటి పలురకాల లక్షణాలన్నీ మానసిక రుగ్మతలే నంటే చాలా మందికి ఆశ్చర్యం కలుగవచ్చు.

మానసిక వైద్యులు కేవలం నిద్రమాత్రలే ఇస్తారనే అపోహ ప్రజల్లో ఉంది. అది పూర్తిగా తప్పు. నిద్ర రావడమనేది ఆ మందుల ఫలితాల్లో ఒక లక్షణమే తప్ప అవి నిద్రమాత్రలు కాదు. ఆ యా జబ్బుల్లో ఉన్న మూల కారణాలను సరి చేసి, ఆ వ్యక్తిని మానసిక ఆరోగ్యవంతుడిని చేస్తాయి. ఒకప్పటి కరెంటు చికిత్సతో పాటు, ఇటీవలే వచ్చిన ఆర్‌టీఎమ్‌ఎస్ అనే మేగ్నటిక్ చికిత్స కూడా చాలా అద్భుతంగా పనిచేస్తుంది. కౌన్సెలింగ్ పద్ధతుల్లో, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, మైండ్‌ఫుల్‌నెస్ థెరపీ, డీబీటీ, సీఆర్‌టీ, వర్చువల్ రియాలిటీ థెరపీ లాంటి ఆధునిక చికిత్సా పద్ధతులు కూడా ఇపుడు అందుబాటులోకి వచ్చాయి. ఎవరికి ఎలాంటి చికిత్స అవసరమన్నది అర్హత గల మానసిక వైద్య నిపుణులే నిర్ణయిస్తారు. ఎంబీబీఎస్ తర్వాత మానసిక వైద్యశాస్త్రంలో మూడేళ్ళు ఎమ్‌డీ లేదా డీఎన్‌బీ కోర్సు చేసిన వారినే 'సైకియాట్రిస్టు' లంటారు. రోగ నిర్ధారణకు తగిన పరీక్షలు చేసి మందులతోపాటు కౌన్సిలింగ్ చేసే శిక్షణ సైకియాట్రిస్టులకే ఉంటుంది. 'సైకాలజిస్టు'లంటే సైకాలజీలో ఎమ్మెస్సీ లేదా ఎమ్‌ఫిల్ క్లినికల్ సైకాలజీ చేసినవారు. వీరు మానసిక రోగులకు కౌన్సెలింగ్‌తో పాటు తెలివితేటల నిర్ధారణ, వ్యక్తిత్వ నిర్ధారణ లాంటి మానసిక పరీక్షలు మాత్రమే చేస్తారు. రోగనిర్ధారణ, మందులు ఇవ్వడం లాంటివి వీరు చేయకూడదు.


మానసిక రోగుల సంక్షేమం కొరకు, కేంద్రప్రభుత్వం 2017లో 'మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్' అనే ఒక కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. రాష్ట్ర స్థాయిలో 'స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ'నీ, జిల్లా స్థాయిలో 'రివ్యూ బోర్డ్స్'ను ఏర్పాటు చేశారు. దేశంలో మానసిక వైద్యం అవసరమైన ప్రతి వ్యక్తికీ చికిత్స చేయించి, ఆ ఖర్చు భరించాల్సిన బాధ్యత ఆ యా ప్రభుత్వాలదేనని ఈ చట్టంలో పేర్కొన్నారు. అలాగే ఆదరణ, కూడు, గూడు లేకుండా వీధుల్లో తిరిగే అనాథ మానసిక రోగులను కూడా చేరదీసి వైద్యం చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! ప్రతి సంవత్సరం అక్టోబర్ పదవ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంగా జరుపుకొంటూ, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పించే ప్రయత్నాన్ని మానసిక నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయి. ఈ సంవత్సరం 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్' పిలుపు ఇచ్చిన సందర్భంగా, సమాజంలో మానసిక అనారోగ్యంపై, మూఢనమ్మకాలపై పోరాడదామని అందరం ఈ సందర్భంగా ప్రతిన బూనుదాం!

వ్యాసకర్త ప్రముఖ సైకియాట్రిస్ట్

(రేపు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం)

భక్తే ప్రధానం

పండరీపురంలో అయిదు వందల ఏళ్ల క్రితం విద్యానంద బోస్లే అనే పండితుడు ఉండేవాడు. తనకు మించిన పండితుడు మరొకరు లేరు అన్న గర్వం ఆయనకుండేది. అయితే విద్యానందకు పాండురంగడంటే అమితమైన భక్తి. రోజూ ఉదయం నదీతీరానికి వెళ్ళి స్నానసంధ్యాదులు కానిచ్చుకుని పాండురంగడిని దర్శించుకున్న తర్వాతే మిగిలిన పనులన్నీ చేసేవాడు. ఆ నది సమీపంలో ఉన్న గుడిసెలో ఓ కుష్ఠు రోగి నివసించేవాడు. అతను తన గుడిసె బయటికి వచ్చి ఆలయంకేసి చేతులెత్తి నమస్కరిస్తుంటాడు. రోగి కావడం వల్ల అతడిని ఎవరూ ఆలయంలోకి రానివ్వడం లేదు. ఒకరోజు విద్యానంద శిష్యులు 'కార్తీక మాసం ఏకాదశి రోజున ఉపవాసం చేసి మరుసటి రోజైన ద్వాదశినాడు సూర్యోదయాని కన్నా ముందరే తులసీ తీర్థాన్ని స్వీకరించి ఆదిత్యుడికి నివేదించి వ్రతం ముగిస్తే పుణ్యమనీ, పాండురంగడే ఈ ఏకాదశినాడు వ్రతమూ చరించినట్లు భక్తిగ్రంథాలు చెప్తున్నాయ'ని అన్నారు. దాంతో అతడు ఏకాదశినాడు నదీ స్నానం చేసి ఆలయానికి వెళ్లేందుకు ప్రయత్నించాడు.



అయితే అప్పటికే విఠలుని దర్శనం కానిచ్చుకున్న విద్యానంద బోస్లే గుడి నుంచి బయటకు వస్తూ తన శిష్యులకు ఆ రోగిని చూపిస్తూ 'వాణ్ణి చూస్తేనే ఏమో అయిపోతోంది. వాడిని ఇక్కడికి రాకుండా తరిమికొట్టండి' అన్నాడు. శిష్యులు గురువుగారి ఆజ్ఞ పాటించారు. ఆ రోజు రాత్రి ఆ రోగి జరిగినదంతా తలచుకుని బాధపడ్డాడు. 'ఏమిటి విఠలా, నాకీ అవస్థ. ఈ జీవితంలో నాకు నీ దర్శనభాగ్యం ఉందా, లేదా?' అని మనసులోనే అడిగాడు. మరుసటి రోజు ద్వాదశి. అతిథులను పిలిచి భోజనం పెట్టడానికి విద్యానంద ప్రయత్నించాడు. కానీ ఆ రోజు ఒక్క అతిథి కూడా అతడికి దొరకలేదు. కానీ ఆ రోగికి ఓ అతిథి దొరకడం చూసిన విద్యానంద బాధపడ్డాడు.

ఆ రోజు రాత్రి విద్యానంద కలలో పాండురంగడు కనిపించాడు. 'విద్యానందా! నీ అహంకారం వల్ల నీ జ్ఞానమంతా వృథా అయింది. కానీ నా భక్తుడేమో తనను అనుగ్రహించమని ప్రాధేయపడ్డాడు. అతనిది స్వచ్ఛమైన పవిత్ర భక్తి, కనుక అతని భక్తికి నేను దాసుడనయ్యాను. అందుకే అతనికి అతిథిగా వెళ్ళాన'న్నా'డు. మరుసటి రోజు విద్యానందుడు ఆ కుష్ఠురోగి దగ్గరకు వెళ్లి జరిగిందంతా చెప్పి తనను క్షమించమని కోరాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: బ.దశమి ప.1.10 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఆశ్లేష పూర్తి (24 గంటలు), వర్జ్యం: ప.1.02 నుండి 2.32 వరకు, దుర్ముహూర్తం: ప.12.12 నుండి 12.59 వరకు తదుపరి ప.2.33 నుండి 3.21 వరకు, అమృతఘడియలు: తె.5.16 నుండి 7.01 వరకు (తెల్లవారితే మంగళవారం); రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.55, సూర్యాస్తమయం: 5.41.

క్లుప్తంగా...

పైడితల్లి పండుగ ఆరంభం



సిరిమాను చెట్టుకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెడుతున్న మహిళలు

నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీపైడితల్లి అమ్మవారి పండుగ ఆరంభమైంది. పండుగలో భాగమైన సిరిమాను ఘట్టానికి అవసరమైన చింత చెట్టును విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం జరజాపుపేటలో తుమ్మి అప్పారావు కుటుంబానికి చెందిన కల్లంలో గుర్తించారు. చెట్టుకు ఆలయ అధికారులు, పూజారులు ఆదివారం బొట్టు పెట్టి పూజలు నిర్వహించారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు, పాలకవర్గం

కాణిపాకం(యాదమరి)/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెంకటేశు తెలిపారు. గత నెల 18న వినాయక చవితి రోజు నుంచి 21 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక బ్రహ్మోత్సవాల నిర్వహణ నేపథ్యంలో ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను ఆదివారం సమర్పించారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ పాలక మండలి సభ్యులు పట్టువస్త్రాలను తీసుకెళ్లగా, కాణిపాకం ఆలయ ఈవో ఎ.వెంకటేశు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ఎల్లో మీడియా ఉద్యమమని తేటతెల్లమైంది

బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: 'రాజమండ్రి' గజదొంగ కోసం అమరావతి దీక్షా శిబిరాల్లో జరుగుతున్న హడావుడితో 29 గ్రామాల్లో అమరావతి పేరిట కొనసాగుతుంది ఎల్లో మీడియా కులరాజ్య ఉద్యమమని తేటతెల్లమైందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,106వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి, మాట్లాడారు. అమరావతికి భూములిచ్చిన రైతులు స్పష్టమైన అజెండా లేకుండా బాబు అవినీతిని కాపాడేందుకే అమరావతి ఉద్యమం నిర్వహిస్తున్నారన్నారు. ఎప్పుడైతే రాజధానిలో జరిగిన అవినీతిపై కేసు నమోదు చేసి మూడు రాజధానులు ప్రకటించారో అప్పటి నుంచే కులవాదులంతా దొంగ ఉద్యమానికి శ్రీకారం చుట్టి అవినీతికి కాపలా కాస్తున్నారనే నిజం ప్రజలకు తేటతెల్లమైందన్నారు. రాజధాని అంటే అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవాలి కానీ ఓ సామాజిక వర్గ ప్రయోజనాల కోసం ఎంపిక చేయడం మంచిది కాదన్నారు. అమరావతి పేరుతో ఈ ప్రాంతంలో బాబు బినామీలంతా ఓ సామాజికవర్గం అండదండలతో చేసిన అవినీతి బయటపడితే వీరు కూడా జైలు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుందనే ఆందోళన అందరిలో మొదలైందన్నారు. అవినీతిపరులకు కఠిన శిక్షలు పడినపుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, త్వరలో చంద్రబాబుతోపాటు లోకేశ్, నాటి మంత్రులు జైలు ఊచలు లెక్కబెట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీ సభ్యుడు లొంగుబాటు

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): సీపీఐ మావోయిస్టు పార్టీ 24వ ప్లాటూన్ సభ్యుడు వెట్టి దుల్గా ఆదివారం ఎస్పీ తుహీన్ సిన్హా, ఓఎస్డీ మహేశ్వర్‌రెడ్డి ఎదుట లొంగిపోయాడు. దీనికి సంబంధించిన వివరాలను ఓఎస్డీ మహేశ్వర్ రెడ్డి విలేకరులకు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని, దంతెవాడ జిల్లా కటికళ్యాన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పర్చేలి గ్రామానికి చెందిన వెట్టి దుల్గా 2016లో మావోయిస్టు పార్టీలో చేరాడు. 2018 నుంచి 2022 వరకు దర్భా డీవీసీ ప్లాటూన్‌లో పనిచేశాడు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నాడనీ, అందుకే పోలీసుల ఎదుట లొంగిపోయాడని ఓఎస్డీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన దుల్గాకు రూ.లక్ష రివార్డుతోపాటు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందిస్తామన్నారు.

పల్లెకు పోదాం.. ప్రజాసేవ చేద్దాం!

యూనివర్సిటీలు, విద్యాసంస్థల పల్లెబాట

- గ్రామాలను దత్తత తీసుకుని సేవ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టు
- రాష్ట్రంలో ఇప్పటివరకు 129 విద్యా సంస్థల నమోదు
- ఒక్కో విద్యా సంస్థ ఐదు గ్రామాల చొప్పున దత్తత
- పల్లెల్లో ఆరు ప్రాధాన్యతా రంగాల్లో ప్రభుత్వానికి తోడ్పాటు
- భాగస్వాములయ్యే విద్యాసంస్థలకు రూ.10 లక్షల చొప్పున గ్రాంట్



సాక్షి, అమరావతి: 'దేశానికి పల్లె సీమలే పట్టుగొమ్మలు' అనే నానుడిని నిజం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం ప్రగతి పథంలో పయనించినట్టే. ఈ నేపథ్యంలో గ్రామాలను అభివృద్ధి చేయడానికి యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలను ప్రభుత్వం రంగంలో దింపుతోంది. ఉన్నత భారత్ అభియాన్ పేరుతో గ్రామాల్లో సామాజిక సేవలో పాలుపంచుకునేలా వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలను భాగస్వాములను చేస్తోంది. ఇప్పటివరకు మన రాష్ట్రంలో 129 విద్యా సంస్థలు గ్రామాలను దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చాయి. ఒక్కో సంస్థ ఐదు చొప్పున 645 గ్రామాలను దత్తత తీసుకున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించుకున్న ఆరు ప్రాధాన్యత రంగాల్లో విద్యా సంస్థలు తోడ్పాటు అందిస్తున్నాయి. ఇలా గ్రామాలను దత్తత తీసుకుంటూ పల్లె సేవలో భాగస్వాములవుతున్న సంస్థలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున గ్రాంట్ అందిస్తోంది.

50 వేల విద్యా సంస్థలు.. 2.5 లక్షల పంచాయతీలు..

పరిశోధన ఫలాలు, ప్రభుత్వ పథకాలను సమన్వయపరుస్తూ సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ద్వారా గ్రామీణాభివృద్ధికి బాటలు వేయడమే ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యం. దేశవ్యాప్తంగా 2023 నాటికి 50 వేల విద్యాసంస్థలను ఇందులో భాగస్వాములను చేయడం, వీటితో 2.5 లక్షల గ్రామ పంచాయతీలను అనుసంధానించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈ సంయుక్త ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ఐఐటీ ఢిల్లీ, రాష్ట్ర స్థాయిలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ సమన్వయ సంస్థలుగా వ్యవహరిస్తున్నాయి.

నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు



ఉన్నత భారత్ అభియాన్ ప్రాజెక్టులో భాగస్వాములయ్యేందుకు పెద్ద ఎత్తున విద్యాసంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా అవి అభివృద్ధి చేసే నూతన ఆవిష్కరణలను నేరుగా పల్లెలకు తీసుకెళ్తున్నాయి. ఇప్పటికే 129 విద్యాసంస్థలు నమోదయ్యాయి. వీటి నుంచి 1.93 లక్షల మంది విద్యార్థులు భాగస్వాములయ్యారు. 645 గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ప్రాధాన్యతా రంగాల్లో ప్రగతికి బాటలు వేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు అభినందనీయం.

– ప్రొ.సర్జన్ రెడ్డి, కేంద్ర సమన్వయకర్త, ఉన్నత్ భారత్ అభియాన్

ఆరు ప్రాధాన్యతా రంగాల్లో..

129 విద్యా సంస్థలు ఆయా గ్రామాల్లో సురక్షిత మంచినీరు, ఆరోగ్యం–పరిసరాల పరిశుభ్రత, వ్యవసాయం, గ్రామీణ చేతివృత్తులు, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామీణ మౌలిక వసతుల కల్పన వంటి ఆరు ప్రాధాన్యతా రంగాల్లో సౌకర్యాల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వ తోడ్పాటుతో కృషి చేస్తాయి. ఈ 129 విద్యాసంస్థలకు చెందిన 1.93 లక్షల మంది విద్యార్థుల ద్వారా దత్తత తీసుకున్న 645 గ్రామాల్లో పెద్దఎత్తున సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. నూతన ఆవిష్కరణల ఫలాలు, పరిశోధన ఫలితాల ద్వారా పల్లె ప్రగతికి బాటలు వేస్తున్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన మూడు ఆవిష్కరణలు

పల్లె ప్రగతిలో కీలకంగా మారే నూతన ఆవిష్కరణలను జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారు. ఇవి పెట్టుబడులను ఆకర్షించినట్టైతే అందుకు అవసరమైన తోడ్పాటును జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా అందిస్తారు. గ్రామీణాభివృద్ధికి తోడ్పాటునందించే ఆవిష్కరణలను వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేసి.. వచ్చే లాభాల్లో రాయల్టీని ఆయా విద్యాసంస్థలు, విద్యార్థులకు చెల్లిస్తారు. ఇలా ఇప్పటివరకు తిరుపతి ఐఐటీ విద్యార్థులు తాగునీటిని శుద్ధి చేసేందుకు రూపొందించిన కెపాసిటివ్ డీఅయోనైజేషన్ పరికరం, వైఎస్సార్ జిల్లా మనూ పాలిటెక్నిక్ విద్యార్థులు.. చేతివృత్తులు వారు సహజ ఉత్పత్తులు తయారీ చేసేందుకు అభివృద్ధి చేసిన నూతన సాంకేతికత, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించిన సోలార్ మొబైల్ చార్జర్ వంటి ఆవిష్కరణలను జాతీయ స్థాయి పరిశీలనకు పంపించారు. వీటితో పాటు మరో ఏడు విద్యాసంస్థలు కూడా నూతన సాంకేతికతలను అభివృద్ధి చేశాయి.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సాంకేతిక నైపుణ్యం..

https://unnatbharatabhiyan.gov.in ద్వారా నమోదైన విద్యాసంస్థలు జిల్లా కలెక్టర్‌కు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. నమోదు ప్రక్రియ పూర్తి కాగానే, ముందు ప్రాంతీయ సమన్వయ సంస్థ, ఆ తర్వాత జాతీయ సమన్వయ సంస్థ వివరాలు తనిఖీ చేసి ఆమోద ముద్ర వేస్తాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ఆ విద్యాసంస్థకు రూ.10 లక్షల గ్రాంటు మంజూరు చేస్తారు. ఈ మొత్తాన్ని గ్రామాలను గుర్తించడం, అక్కడ పర్యటించడం, సమస్యలను అధ్యయనం చేయడం వంటి కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చు. అంతేకాకుండా ఆయా పల్లెలకు ఉపయోగపడేలా చేపట్టే పరిశోధనలకు కూడా వాడుకోవచ్చు. దత్తత గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలకు అవసరమయ్యే మద్దతును వివిధ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. దత్తత తీసుకున్న పల్లెల్లో స్థానిక ప్రాధాన్యాల గుర్తింపు, సాంకేతికత బదిలీ వంటి కీలక అంశాల్లో సహకరిస్తుంది. ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సాంకేతిక నైపుణ్యం, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కూడా పెంపొందుతాయి. ఆయా విద్యా సంస్థల నుంచి ఉత్తీర్ణులయ్యేనాటికి మంచి నైపుణ్యాలను పొందుతారు.

మహిళపై చిరుత దాడి!

- స్వల్ప గాయాలతో తప్పించుకున్న బాధితురాలు
- చిత్తూరు జిల్లా ఎర్రగుంటపల్లెలో ఘటన



గాయపడిన శైలజ

వెదురుకుప్పం: కాలకృత్యాలు తీర్చుకునేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లిన ఓ మహిళపై చిరుత దాడి చేసింది. చిరుత నుంచి ఆమె తప్పించుకుని స్వల్పగాయాలతో బయటపడింది. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని ఎర్రగుంటపల్లె సమీపంలోని శ్రీ లక్ష్మీశ్రీనివాస స్టోన్ క్రషర్ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎర్రగుంటపల్లె వద్ద అటవీ ప్రాంతంలోని క్రషర్‌లో శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన శైలజ పని చేస్తుంది. ఆమె క్రషర్ సమీపంలోని అటవీ ప్రాంతానికి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా, అకస్మాత్తుగా చిరుత పులి దాడి చేసింది. శైలజ భయంతో కేకలు వేస్తూ చిరుతను నెట్టివేసింది. ఆమె కేకలు విని క్రషర్ వద్ద ఉన్నవారు రావడంతో చిరుత పారిపోయింది. స్వల్పంగా గాయపడిన శైలజకు పచ్చికాపల్లం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు పంపారు. నాలుగు రోజులుగా చిరుత సంచరిస్తోందని తాము చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పుడు ఏకంగా మహిళపై దాడి చేసిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక ఆధారాలు లేవు: అటవీశాఖ అధికారులు

మహిళపై చిరుత దాడి చేసినట్లు సమాచారం అందడంతో ఎఫ్‌ఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌వో కార్సింగ్, ఇతర అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ శైలజపై అడవి జంతువు దాడి చేసినట్లు తాము అనుమానిస్తున్నామని, చిరుత దాడి చేసినట్లు, అక్కడ సంచరించినట్లు ప్రాథమిక ఆధారాలు లభించలేదని చెప్పారు. మహిళపై దాడి చేసింది చిరుతే అని నిర్ధారించడానికి కొంత సమయం పడుతుందన్నారు. అయినా రాత్రివేళ పికెట్ ఏర్పాటుచేసి రక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

'ఈశాన్యం'లో చల్లని కబురు

- ఈనెల 20 నాటికి ఈశాన్య రుతుపవనాల రాక!
- వీటి ప్రభావంతో అధిక వర్షపాతం నమోదవుతుందన్న ఐఎండీ
- నవంబర్ నెలలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం
- 'నైరుతి' నిష్క్రమణకు బ్రేక్ వేస్తున్న ద్రోణి, ఆవర్తనాలు



సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ఒకింత నిరాశపరిచిన నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఆ ఆందోళనకు తెరదించుతూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) చల్లని కబురు మోసుకొచ్చింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల వల్ల రాష్ట్రంలో సాధారణం కంటే ఒకింత అధిక వర్షపాతం నమోదవుతుందని తాజాగా ప్రకటించింది. దీనిని బట్టి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగనున్న ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కురిసే వర్షాలతో రబీ పంటలకు ఎంతో మేలు జరగనుంది. ఐఎండీ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాలు సాధారణానికి మించి, ఉత్తర కోస్తాంధ్రలో సాధారణంగాను వర్షాలు కురవనున్నాయి. ఈ రుతుపవనాలు రాష్ట్రంలోకి ఈ నెల 20 నాటికల్లా ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. నైరుతి రుతుపవనాల మాదిరిగా ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కురిస్తే కుండపోత వర్షాలు కురుస్తాయని.. ఒకవేళ అధిక వర్షాలు కురవకపోయినా వర్షాభావ పరిస్థితులు మాత్రం ఉండకపోవచ్చని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కాగా.. ఈ నెలలో రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, నవంబర్‌లో మాత్రం విస్తారంగా కురవనున్నాయని ఐఎండీ అంచనా వేస్తోంది.

నైరుతి నిష్క్రమణలో జాప్యం!

రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమించిన అనంతరం ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపుతాయి. సాధారణంగా రాష్ట్రంలోకి ఇవి అక్టోబర్ 18–22 తేదీల మధ్య ప్రవేశిస్తాయి. ఇప్పటికే వారం రోజుల ఆలస్యంగా నైరుతి రుతుపవనాలు సెప్టెంబర్ 25న రాజస్థాన్ నుంచి క్రమంగా ఉపసంహరించుకుంటున్నాయి. అక్టోబర్ 15 నాటికల్లా ఇవి దేశం నుంచి పూర్తిగా నిష్క్రమిస్తాయి. మరో రెండు రోజుల్లో ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి ఉపసంహరించుకుంటాయని ఐఎండీ తెలిపింది. ఈ తరుణంలో సిక్కిం నుంచి ఉత్తర ఒడిశా వరకు ఉపరితల ద్రోణి, ఉత్తర కోస్తాంధ్ర పరిసరాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నాయి. గాలిలో తేమ తగ్గి పొడి గాలులు ఏర్పడితే ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కానీ.. ప్రస్తుత ద్రోణి, ఆవర్తనాల వల్ల గాలిలో తేమ పెరిగి నైరుతి రుతుపవనాల నిష్క్రమణను ఒకింత మందగించేలా చేస్తాయని అంచనా వేస్తున్నారు.

'నైరుతి'లో సాధారణమే కానీ..

ఐఎండీ నివేదిక ప్రకారం జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో సాధారణ వర్షపాతమే నమోదైంది. ఈ నాలుగు నెలల సమయంలో రాష్ట్రంలో 521.6 మి.మీ.కు గాను 454.6 మి.మీ. వర్షపాతం రికార్డయింది. అంటే కురవాల్సిన దానికంటే 13 శాతం తక్కువ వర్షపాతం అన్నమాట. సాధారణం కంటే 20 శాతం తక్కువ కురిస్తే అది సాధారణ వర్షపాతంగానే పరిగణిస్తారు. రాష్ట్రంలోని కాకినాడ, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమ గోదావరి, అనంతపురం, అన్నమయ్య, కర్నూలు జిల్లాల్లో లోటు, కృష్ణా జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతమే రికార్డయింది. మరోవైపు ఈసారి నైరుతి రుతుపవనాలు సకాలంలో వర్షించకపోగా, కొన్ని సమయాల్లో కుండపోతగా వర్షాలను కురిపించాయి. ఆగస్టులో రుతుపవన ద్రోణి మూడు వారాలకు పైగా హిమాలయాల్లోనే తిష్ట వేసుకుని ఉండిపోయింది. ఫలితంగా బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడక వర్షాలు కురవకుండా పోయాయి.

ఆ పది జిల్లాల్లో.. సైబర్ దొంగలు!

- ఇందులో రాజస్థాన్‌లోని భరత్‌పూర్ టాప్
- ఢిల్లీ, రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అడ్డాలు
- 80శాతం సైబర్ నేరాలకు పాల్పడుతున్నది ఆ జిల్లాల నుంచే..

సాక్షి, హైదరాబాద్: అవి నాలుగు రాష్ట్రాల్లోని పది జిల్లాలు.. అమాయకులకు గాలం వేస్తూ దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లకు అడ్డాలు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ నేరాల్లో 80శాతానికిపైగా ఆ పది జిల్లాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకున్న నేరగాళ్లు చేస్తున్నవే. ఢిల్లీ, రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ జిల్లాలు ఉన్నాయి. కేటుగాళ్లు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి త్వరగా వెళ్లేపోయే వీలున్న జిల్లాల్లో అడ్డా వేసి, సైబర్ క్రైం పోలీసులకు చిక్కకుండా మోసాలకు పాల్పడుతున్నారు. అడపాదడపా తెలంగాణ పోలీసులు మినహా మిగతా రాష్ట్రాల పోలీసులు ఈ సైబర్ దొంగలను పట్టుకోలేకపోతున్నారు. ఎక్కువగా సైబర్ నేరగాళ్లు ఏ రాష్ట్రాల్లో, ఏ జిల్లాల్లో ఉంటున్నారన్న అంశంపై 'ఫ్యూచర్ క్రైం రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఫ్‌సీఆర్ఎఫ్)' ఇటీవల విడుదల చేసిన తమ అధ్యయన నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. సైబర్ నేరగాళ్లకు కొత్త అడ్డాలుగా మారుతున్న ప్రాంతాలను పేర్కొంది.

ఆ పది జిల్లాలే ఎందుకు?

సైబర్ నేరగాళ్లు ఆ పది జిల్లాల్లోనే ఎందుకు ఎక్కువగా ఉంటున్నారన్న దాని వెనుక కొన్ని కీలక అంశాలు ఉన్నాయి. ఈ పది జిల్లాలు ఆయా రాష్ట్రాల్లోని కీలక పట్టణాలకు సమీపంలో ఉండటం, సైబర్ సెక్యూరిటీ పరంగా అంతగా అభివృద్ధి చెందకపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారు ఎక్కువగా ఉండటం వంటివి సైబర్ మోసగాళ్ల ముఠాలకు కలిసి వస్తున్నాయని నివేదిక తేల్చింది. ఆయా జిల్లాల్లో సరైన ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్థానికుల సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలను వాడుకుంటూ ఈ ఉచ్చులోకి సులభంగా దింపుతున్నాయని పేర్కొంది. ఈ పది జిల్లాల్లో చాలా వరకు దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలోనివే. స్థానికంగా పోలీసులు ఈ సైబర్ నేరగాళ్లను గుర్తించలేకపోవడం, అవసరమైతే అప్పటికప్పుడు రాష్ట్రాలు మార్చేయడంతో పట్టుబడటం కష్టంగా మారుతోంది.

కొత్తగా సైబర్ క్రైం హాట్‌స్పాట్లుగా మారుతున్న ప్రాంతాలివీ..

అస్సాం (బార్పేట, ధుబ్రి, గోల్పర, మోరిగాన్, నగాన్), ఏపీ (చిత్తూర్), బిహార్ (బన్క, బెగుసరాయ్, జముయి, నలంద, పాట్నా, ససరామ్), ఢిల్లీ (అశోక్‌నగర్, ఉత్తమ్‌నగర్ వెస్ట్, న్యూఅశోక్‌నగర్, హర్కేష్ నగర్ ఓఖ్లా, ఆర్‌కే పురం, ఆజాద్‌పురా), గుజరాత్ (అహ్మదాబాద్, సూరత్), హరియాణా (బివాని, మనోత, హసన్‌పూర్, పల్వాల్), జార్ఖండ్ (లటేహర్, ధన్‌బాద్, సంత్‌పాల్ పరగణా, హజారీబాగ్, కుంతి, నారాయణపూర్, రాంచీ), కర్ణాటక (బెంగళూరు), మధ్యప్రదేశ్ (గుణా), మహారాష్ట్ర (ఔరంగాబాద్, ముంబై), ఒడిశా (బాలాసోర్, ఢేన్‌కనల్, జజ్‌పుర్, మయూర్‌భంజ్), పంజాబ్ (ఫజిక్రా, మొహాలి), రాజస్థాన్ (బిదర్కా, బర్మార్, జైపూర్), తమిళనాడు (చెన్నై, కోయంబత్తూర్), తెలంగాణ (హైదరాబాద్, మహబూబ్‌నగర్), త్రిపుర (ధలాయ్), ఉత్తరప్రదేశ్ (బులందర్‌షహర్, ఘాజియాబాద్, ఝాన్సీ, కాన్పూర్, లక్నో, సీతాపూర్, గౌతమబుద్ధ నగర్), పశ్చిమ బెంగాల్ (పుర్బ బర్ధమాన్, దుల్‌చంద్రియ).

చుక్కలు చెదిరి.. లెక్కలు మారి..



రాత్రిపూట ఆకాశాన్ని చూస్తే కోట్ల కొద్దీ నక్షత్రాలు కనువిందు చేస్తుంటాయి. అందులో కొన్ని ఆకారాలూ కనిపిస్తుంటాయి. కానీ భవిష్యత్తులో ఆ చుక్కల లెక్కలన్నీ మారిపోతాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. నక్షత్రాలన్నీ స్థానం మారిపోతాయని.. ఆకాశాన్ని అత్యంత ప్రకాశవంతమైన వెలుగు ఆక్రమిస్తుందని అంటున్నారు. మరి దానికి కారణం ఏమిటో తెలుసా? మన భూమి, సౌర కుటుంబం ఉన్న పాలపుంత గెలాక్సీ, సమీపంలోని ఆండ్రోమెడా అనే మరో గెలాక్సీ రెండూ ఢీకొని కలిసిపోనుండటమే. ఇప్పటికే ఈ రెండూ ఒకదానికొకటి సమీపంలోకి వస్తున్నాయి. మరో 375 కోట్ల ఏళ్ల తర్వాత ఢీకొనడం మొదలవుతుంది. సుమారు 700 కోట్ల ఏళ్ల తర్వాత రెండూ పూర్తిగా కలిసిపోయి పెద్ద గెలాక్సీగా మారిపోతాయి. ఈ క్రమంలో చాలా నక్షత్రాలు చెల్లాచెదురైపోతాయి. వాటి స్థానాలు మారిపోతాయి. మరి ఇలా రెండూ దగ్గరికి రావడం, కలిసిపోవడం జరుగుతున్నప్పుడు మనకు ఆకాశం ఎలా కనిపిస్తుందనే దానిపై నాసా ఓ వీడియోను రూపొందించింది. చంద్ర ఎక్స్‌రే అబ్జర్వేటరీ తీసిన చిత్రాలు, దాని సాయంతో చేసిన పరిశీలన ఆధారంగా సిద్ధం చేసిన ఈ వీడియోను.. చంద్ర అబ్జర్వేటరీ పేరిట ఉన్న 'ఎక్స్ (ట్విట్టర్)' ఖాతాలో పోస్ట్ చేసింది.

మనం చూసేది పాలపుంతనే కాదు..!

మన సౌర కుటుంబం ఉన్న పాలపుంత (మిల్కీవే) గెలాక్సీ అంటూ ఫొటోల్లో, ఇంటర్నెట్‌లో మనం చూస్తున్నది నిజానికి పాలపుంత ఫొటో కానే కాదు. అసలు మనం పాలపుంత మొత్తం చిత్రాన్ని తీయడం సాధ్యమే కాదు. ఎందుకంటే కొన్ని వేల కోట్ల నక్షత్రాలున్న పాలపుంత గెలాక్సీలో మధ్య భాగానికి ఓ పక్కన మన సూర్యుడు, భూమి ఉన్నాయి. పాలపుంత గెలాక్సీ మొత్తాన్ని దాటి బయటికి వెళితే తప్ప దీనిని ఫొటో తీయలేం! ఎలాగంటే.. సముద్రం మధ్య చిన్న పడవలో కెమెరా పట్టుకుని కూర్చున్న మనం వేల కిలోమీటర్లు విస్తరించి ఉన్న సముద్రం మొత్తాన్ని ఫొటో తీయగలమా? ఇదీ అంతే..

మరి మనం చూసే పాలపుంత చిత్రం ఏమిటి అంటారా.. దాదాపుగా పాలపుంతలా ఉండే ఆండ్రోమెడా గెలాక్సీ చిత్రమే. ఈ గెలాక్సీయే భవిష్యత్తులో పాలపుంతను ఢీకొట్టేది.

భీకర యుద్ధం

రెండో రోజుకు చేరిన ఇజ్రాయెల్, హమాస్ ఘర్షణ

- దక్షిణ ఇజ్రాయెల్‌లో పరస్పరం కాల్పులు
- గాజాపై రాకెట్ల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం
- ఇజ్రాయెల్‌లో 600 మంది, గాజాలో 370మంది దాదాపు 1,000 మంది మృతి!
- బందీలుగా ఉన్న మహిళలపై సాయుధుల అత్యాచారాలు
- ముష్కరులు మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రధాని నెతన్యాహూ హెచ్చరిక


గాజాలో ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన భవనం

టెల్ అవివ్/జెరూసలేం: ఇజ్రాయెల్ సైన్యం, పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతూనే ఉంది. శనివారం ఉదయం మొదలైన ఘర్షణ ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. దక్షిణ ఇజ్రాయెల్‌లో పరిస్థితి భీతావహంగా మారింది. హమాస్ మిలిటెంట్లు, ఇజ్రాయెల్ జవాన్ల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. గాజా నుంచి ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకువచ్చిన తీవ్రవాదులు వీధుల్లో జవాన్లతో తలపడుతున్నారు. హమాస్ దుశ్చర్య పట్ల ప్రతీకారంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్ సైన్యం పెద్ద సంఖ్యలో రాకెట్లను గాజాపై ప్రయోగించింది. ఈ దాడుల్లో గాజాలో పలు భవనాలు ధ్వంసమయ్యాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల నుంచి తప్పించుకోవడానికి గాజా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఇప్పటికే 20,000 మంది ఇళ్లు విడిచి వెళ్లిపోయినట్లు అంచనా. దాడులు, ప్రతిదాడుల్లో ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌లో 600 మందికిపైగా, గాజాలో 370 మందికిపైగా మొత్తంగా దాదాపు వేయి మంది మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ యుద్ధ రంగంలో ఉన్నట్లు ప్రధాని నెతన్యాహూ కేబినెట్ ఆదివారం ప్రకటించింది. సంక్షోభ నివారణకు సైనిక పరమైన చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించింది.

బందీలపై తీవ్రవాదుల అత్యాచారాలు

హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌లో బీభత్సం సృష్టించారు. ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా పట్టుకొని గాజాకు తరలించారు. వీరిలో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు కూడా ఉండడం గమనార్హం. ఈ బందీలను అడ్డం పెట్టుకొని పెద్ద బేరమే ఆడబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వేలాది మంది పాలస్తీనావాసులు ఖైదీలుగా ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్నారు. వీరిని విడిపించుకోవడానికి మిలిటెంట్లు ఇజ్రాయెల్ బందీలను పావులుగా ప్రయోగించబోతున్నట్లు సమాచారం. ఇంకోవైపు చాలామంది ఇజ్రాయెల్ పౌరులను మిలిటెంట్లు అపహరించినట్లు ప్రచారం సాగుతోంది.

ఇజ్రాయెల్‌లో వందలాది మంది...

ఇజ్రాయెల్‌లో హమాస్ దాడిలో మరణించిన వారి సంఖ్య ఇప్పటిదాకా 600కు చేరినట్లు మీడియా సంస్థలు వెల్లడించాయి. వీరిలో 44 మంది సైనికులు ఉన్నారని తెలిపాయి. ఇజ్రాయెల్ ఎదురుదాడిలో గాజాలో 370 మందికి పైగా మృతి చెందారని పాలస్తీనా అధికారులు చెప్పారు. ఇరువైపులా 2,000 మంది చొప్పున గాయపడినట్లు సమాచారం. తమ సైనిక దళాలు 400 మంది హమాస్ మిలిటెంట్లను హతమార్చినట్లు ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలియజేశాయి. చాలామందిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నాయి.


ఇజ్రాయెల్ మహిళను కిడ్నాప్ చేస్తున్న దృశ్యం


హమాస్ వద్ద బందీగా ఉన్న కుటుంబం

భారతీయులు క్షేమం..

ఇజ్రాయెల్, గాజాలో భారతీయులంతా ఇప్పటిదాకా క్షేమంగా ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వారికి ప్రమాదం ఏమీ లేదని చెప్పారు. ఇజ్రాయెల్‌లో దాదాపు 18,000 మంది భారతీయులు నివసిస్తున్నారు. భారతీయులకు తాము అందుబాటులో ఉంటున్నామని, వారి తగిన సలహాలు సూచనలు ఇస్తున్నామని భారత రాయబార కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితి త్వరలోనే అదుపులోకి వస్తుందని ఆశిస్తున్నట్లు తెలియజేశాయి. మరోవైపు గాజాలో వాతావరణం భయంకరంగా ఉందని అక్కడి భారతీయులు చెప్పారు. ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యం పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఇలా ఉండగా, ఇజ్రాయెల్‌లోని టెల్ అవివ్‌కు ఈ నెల 14 దాకా తమ విమానాల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది.

తల్లిదండ్రుల కళ్లెదుటే పసిబిడ్డ హత్య

హమాస్ తీవ్రవాదులు రాక్షసుల్లాగా ప్రవర్తిస్తున్నారు. వారి ఘాతుకం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. తీవ్రవాదులు ఇజ్రాయెల్‌లో ఓ కుటుంబాన్ని బందీలుగా మార్చారు. తమ అధీనంలో ఉన్న భార్యాభర్తలు, వారి ఇద్దరి కుమార్తెలు, కుమారుడిని హింసించారు. ఒక పసిబిడ్డను ఆమె తల్లిదండ్రుల కళ్లెదుటే మెడు తాడు బిగించి చంపేశారు. అది చూసి బిగ్గరగా రోదిస్తున్న మరో కుమార్తె, కుమారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ సోదరి స్వర్గానికి వెళ్లింది' అని అరుస్తూ చెప్పారు. ఇజ్రాయెల్ జర్నలిస్టు హనాయా నఫ్తాలీ ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

దేశాన్నే వణికిస్తున్న బుల్లి సంస్థ!

ఇజ్రాయెల్‌కు చుక్కలు చూపుతున్న హమాస్ • వినాశనమే లక్ష్యంగా చీటికీమాటికీ దాడులు

హమాస్. అత్యాధునిక నిఘాలో, అంతకుమించిన సైనిక సంపత్తిలో ప్రపంచంలోనే తిరుగులేనిదని పేరున్న ఇజ్రాయెల్‌ను మెరుపు దాడులతో నిలువునా వణికించిన పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్. పక్కా ప్రణాళిక ప్రకారం భూ, జల, వాయు తలాల గుండా దాడులకు దిగి గుక్కతిప్పుకోనివ్వలేదు. ఇంతకీ ఏమిటీ సంస్థ? ఎందుకు ఈ స్థాయిలో దాడులకు దిగింది? ఇంతటి శక్తి సామర్థ్యాలను ఎలా సంతరించుకుంది...?

పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌ను పాలిస్తున్న సాయుధ సంస్థ హమాస్. ఇజ్రాయెల్ వినాశనం, ఇస్లామిక్ సామ్రాజ్య స్థాపనే లక్ష్యమని ప్రకటించుకుంది. 2007లో గాజాను చేజిక్కించుకున్న నాటి నుంచీ ఇజ్రాయెల్‌తో ఎన్నోసార్లు పోరుకు దిగింది. హమాస్ అంటే హర్కతల్ ముఖవమా అల్ ఇస్లామియా. రాజకీయ పార్టీగా మొదలై సాయుధ సంస్థగా మారింది. 2000లో రెండో తిరుగుబాటులో భాగంగా ఇజ్రాయెల్‌పై భారీ దాడులకు పాల్పడి వందల మందిని బలి తీసుకుంది.

- శనివారం నాటి దాడి ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన వాటిలో అత్యంత తీవ్రమైనది. ఈజిప్టు, సిరియా ఇలాగే ఇజ్రాయెల్‌పై సరిగ్గా 50 ఏళ్ల కిందట, 1973లో మెరుపు దాడికి దిగాయి. అది మధ్యప్రాచ్యంలో తీవ్ర యుద్ధంగా మారింది.
- 2000లో బందీగా దొరికిన ఒకే ఒక్క ఇజ్రాయెల్ సైనికుడిని అడ్డం పెట్టుకుని వేల మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయించుకుంది. తాజాగా భారీ సంఖ్యలో ఇజ్రాయెల్ సైనికులను నిర్బంధించిన ఆ సంస్థ, ఈసారి ఏ స్థాయిలో బేరం పెడుతుందన్నది తేలాల్సి ఉంది!
- ఇజ్రాయెల్, అమెరికా, యూరోపియన్ యూనియన్ హమాస్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించాయి.
- ఈ సంస్థకు ఇరాన్ దన్నుగా నిలుస్తోంది. నిధులు, ఆయుధాలతో పాటు సాయుధ శిక్షణ ఇస్తోంది. తుర్కియే, ప్రవాస పాలస్తీనీయులు, ప్రైవేటు దాతలతో పాటు పలు ఇస్లామిక్ సంస్థలు సాయం చేస్తుంటాయి.

పాలస్తీనా సంగతేంటి?

ఇజ్రాయెల్, పాలస్తీనా ఘర్షణ ఇప్పటిది కాదు. అవి ఆవిర్భవించినప్పటి నుంచీ నిత్య రావణకాష్టంలా రగులుతోంది. వెస్ట్‌బ్యాంక్, గాజాలను కలిపి పాలస్తీనాగా పిలుస్తారు. రోమన్ సామ్రాజ్య కాలంనాటి పాలస్తీనాలో నేటి తూర్పు జెరూసలేం, ఇజ్రాయెల్ కలిసే ఉంటాయి. బైబిల్‌లో వీటిని యూదు రాజ్యాలుగా పేర్కొన్నారు. యూదులు వీటిని తమ పూర్వీకుల భూభాగంగా పరిగణిస్తారు.

- 1948లో ఇజ్రాయెల్ తనను తాను స్వతంత్రదేశంగా ప్రకటించుకుంది. దీన్ని పాలస్తీనా ముస్లింలు మొదటినుంచీ వ్యతిరేకిస్తూ వస్తున్నారు.
- పాలస్తీనియన్లతో పాటు అరబ్ దేశాలు తమ సైనిక చర్యలో పాల్గొని ఇజ్రాయెల్‌ను తుడిచి పెట్టాలని హమాస్ సైనిక కమాండర్ మొహమ్మద్ డెయిఫ్ శనివారం దాడులు మొదలయ్యాక వీడియో సందేశంలో పిలుపునిచ్చాడు.
- అరబ్బు దేశాల మాట అటుంచితే వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలేం పాలస్తీనియన్లు ఆ పిలుపునకు ఏ మేరకు స్పందిస్తారన్నది చూడాలి.
- పాత జెరూసలేంలోని అల్ అక్సా మసీదుపై నియంత్రణ దాడికి ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. క్రైస్తవులతో పాటు ముస్లింలు, యూదులకు ఇది అతి పవిత్ర ప్రాంతం. ఇది ఇజ్రాయెల్ అధీనంలో ఉంది. శాంతి ఒప్పందానికి లోబడి అక్కడ ముస్లింల ప్రార్థనలకు అనుమతిస్తూ వస్తోంది. మసీదుకు పహారాగా ఉండే ఇజ్రాయెలీ దళాల దన్నుతో యూదు అతివాదులు అక్కడ హల్‌చల్ చేస్తుండటం హమాస్ ఆగ్రహానికి మరో కారణం



గాజా స్ట్రిప్ కథ ఇదీ..

ఇజ్రాయెల్, ఈజిప్టు, మధ్యధరా సముద్రం మధ్యన ఉండే కేవలం 41 కిలోమీటర్ల పొడవు, 10 కిలోమీటర్ల వెడల్పు భూభాగమిది. అక్కడ జనాభా ఏకంగా 23 లక్షలు!

- గాజా గగనతలమే గాక చాలావరకు సముద్ర తీరం ఇజ్రాయెల్ నియంత్రణలో ఉంది. అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి గాజాలోకి ఆహార పదార్థాలు, నిత్యావసరాల సరఫరాను అనుమతిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అత్యవసర జాతీయ ఐక్య ప్రభుత్వం!

దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో రాజకీయ పార్టీలన్నీ చేతులు కలుపుతున్నాయి. సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలపై కసరత్తు చేస్తున్నాయి. అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన అత్యవసర జాతీయ ఐక్య ప్రభుత్వ ఏర్పాటుపై సంప్రదింపులు జరుపుతున్నాయి. దీనిపై ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ, విపక్ష నేతలు యాయిర్ లాపిడ్ బెన్నీ గాంట్జ్ ఇప్పటికే చర్చించుకున్నారు. అత్యవసర ప్రభుత్వంలో భాగస్వాములుగా చేరేందుకు విపక్ష నాయకులు సంసిద్ధత వ్యక్తం చేశారు.

ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ కళ్లు గప్పి..

ఇజ్రాయెల్‌కు పకడ్బందీగా ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంది. ప్రపంచం నలుమూలల ఎక్కడ చీమ చిటుక్కుమన్నా ఇజ్రాయెల్ నిఘా వర్గాలకే మొట్టమొదట సమాచారం అందుతుంది. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇజ్రాయెల్ కళ్లు గప్పి హమాస్ మిలిటెంట్లు ముప్పేట దాడులకు తెగబడడం అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేస్తోంది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలైన షిన్‌బెత్, మొసాద్‌ల గురించి ఎప్పుడూ ఆ దేశం గర్వంగా చెప్పుకుంటుంది. గాజా సరిహద్దుల్లో భారీగా భద్రతా సిబ్బంది మోహరించి ఉంటారు. నిరంతరం సీసీ కెమెరాలు పని చేస్తూ ఉంటాయి. ఆర్ట్ థర్మల్ ఇమేజింగ్, మోషన్ సెన్సర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లను దాటుకొని హమాస్ మిలిటెంట్ల దాడులకు దిగారంటే కచ్చితంగా ఇంటెలిజెన్స్ వైఫల్యమేనన్న అభిప్రాయాలున్నాయి.

మోటరైజ్డ్ పారా గ్లైడర్ల సాయంతో

మోటరైజ్డ్ పారా గ్లైడర్ల సాయంతో సరిహద్దుల్లో కంచెలు దాటిన హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ పట్టణాలపై దిగుతూనే విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. సరిహద్దులు దాటడానికి పారా గ్లైడర్లు హమాస్ వినియోగిస్తుందని ఇజ్రాయెల్ ఊహకి కూడా అందలేదు. 'మధ్యధర సముద్రం నుంచి చిన్న చిన్న బోట్లలో గాజా మీదుగా ఇజ్రాయెల్‌లోకి అడుగు పెట్టారు. పికప్ ట్రక్కుల్లో భారీ మిషన్ గన్లుతో భూ మార్గంలో చొచ్చుకువచ్చారు. సరిహద్దులు దాటినప్పుడు భారీగా పేలుడు పదార్థాలు వినియోగించారు. కొందరు మిలిటెంట్లు వైర్లను కట్ చేసుకుంటూ కంచెలు అడ్డం తొలగించి లోపలికి వచ్చారు. ఇలా ఏకకాలంలో మూడు మార్గాల ద్వారా దాడులకు దిగడంతో తేరుకొని ఎదురు దాడులకు దిగేలోపుల నష్టం జరిగిపోయింది. హమాస్ మిలిటెంట్లు పకడ్బందీగా దాడులు జరపడానికి పదేళ్ల కిందట నుంచే విదేశాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. పారాగ్లైడర్ల దాడికి శిక్షణ తీసుకున్న వీడియోలను హమాస్ సంస్థ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

ఐరన్ డోమ్‌ను దాటుకొని మరీ..

ఇజ్రాయెల్ వద్ద శత్రు దుర్భేద్యమైన ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ ఉంది. దూసుకొచ్చే శత్రుదేశ రాకెట్ల దిశకు తగ్గట్టు ప్రతిగా రాకెట్లను ప్రయోగించి వాటిని ధ్వంసం చేయడంలో ఐరన్‌డోమ్ వ్యవస్థ పేరుగాంచింది. అయితే హమాస్ మిలిటెంట్లు ఆ ఐరన్ డోమ్ వ్యవస్థ తికమకపడేలా లెక్కలుమిక్కిలిగా అంటే 20 నిమిషాల్లో 5 వేల రాకెట్లను ప్రయోగించారు. ఇన్నాళ్లూ 80% సక్సెస్ రేటుతో పని చేసిన ఐరన్ డోమ్ వ్యవస్థ దీంతో ఒక్కసారిగా చేతులెత్తేసింది. ఈ రాకెట్ల దాడిలో ఇజ్రాయెల్‌లో వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి.

ఎన్నికల వ్యూహం, కులగణనే ఎజెండా?

నేడే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యూహాలకు మరింత పదును పెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. అందులో భాగంగా కీలకమైన పార్టీ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం సోమవారం జరగనుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ చీఫ్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, కీలక నాయకులు ఇందులో పాల్గొంటారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, త్రిపుర అసెంబ్లీ ఎన్నికలతో పాటు త్వరలో లోక్‌సభ పోరు కూడా జరగనుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికలు, కులగణన మీదే భేటీలో ప్రధానంగా చర్చ జరగనుందని సమాచారం. పార్టీ ఎన్నికల సన్నద్ధతను సమీక్షించనున్నారు. జాతీయ స్థాయిలో కులాల వారీగా జనగణనకు కాంగ్రెస్ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే కుల గణన చేపడుతోంది. అయితే దీనిపై పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భేటీలో ఎలాంటి వాదనలు జరుగుతాయోనన్న ఆసక్తి నెలకొంది. పునర్ వ్యవస్థీకరించిన సీడబ్ల్యూసీ తొలి భేటీ సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లో జరగడం తెలిసిందే.

రంగంలోకి లెబనాన్ హెజ్బుల్లా మిలిటెంట్లు


ఖాన్ యూనిస్ పట్టణంలో ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన మసీదు

టెల్ అవివ్: ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలోకి లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్ కూడా అడుగుపెట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం దక్షిణ ఇజ్రాయెల్ వీధుల్లో ఇజ్రాయెల్ సైనికులు, హమాస్ తీవ్రవాదుల మధ్య పరస్పరం కాల్పులు జరిగాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలోని పలు భవనాలు నేలమట్టమయ్యాయి. ఉత్తర ఇజ్రాయెల్‌లో హెజ్బొల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్ జవాన్లతో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. దీనివల్ల ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో అవాంఛనీయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇజ్రాయెల్‌కు బద్ధ శత్రువులైన హెజ్బొల్లా మిలిటెంట్లకు ఇరాన్ అండగా నిలుస్తోంది. ఆయుధ, ఆర్థిక సాయం అందిస్తోంది. హెజ్బొల్లా వద్ద వేలాది రాకెట్లు, ఆయుధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రాంతాల్లో హెజ్బొల్లా మిలిటెంట్లు మకాం వేశారు. ఆదివారం ఒక్కడి నుంచి మూడు ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై పదుల సంఖ్యలో రాకెట్లు ప్రయోగించారు. ప్రతిగా ఇజ్రాయెల్ సాయుధ డ్రోన్లు ప్రయోగించింది. దీంతో లెబనాన్ వైపు ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఉత్తర సరిహద్దులో ప్రస్తుతం సాధారణ పరిస్థితులుండగా దక్షిణ ప్రాంతంలో పోరాటం కొనసాగుతోందని ఇజ్రాయెల్ పేర్కొంది.

10, 12 బోర్డు పరీక్షలు ఇకపై ఏడాదిలో రెండుసార్లు

న్యూఢిల్లీ: పది, పన్నెండో తరగతి బోర్డు పరీక్షలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడాదిలో రెండుసార్లు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. రెండు పరీక్షలు రాయాలా, లేదా ఒక్క పరీక్షకే హాజరు కావాలా అన్నది విద్యార్థుల ఇష్టమని స్పష్టం చేసింది. ఈ ఆప్షన్ ఐచ్ఛికమే తప్ప, నిర్బంధం కాదని వివరించింది. విద్యార్థుల్లో పరీక్షంటే భయం దూరం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం పీటీఐకి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. నూతన కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌సీఎఫ్) సాధాసాధ్యాలపై మంత్రి ప్రధాన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈకి మాదిరిగానే విద్యార్థులకు రెండుసార్లు పరీక్ష రాసేందుకు వీలు దొరుకుతుంది. బెస్ట్ స్కోర్ సాధించొచ్చు. ఈ ఆప్షన్ పూర్తిగా విద్యార్థుల ఇష్టానికే వదిలేశాం. ఇందులో ఎటువంటి నిర్బంధం లేదు. ఏడాదిలో ఒకేసారి పరీక్ష ఉండటం, ఈ చాన్స్ మిస్సయితే ఒక సంవత్సరం కోల్పోతామనే భయం, ఒత్తిడి ఎక్కువమంది విద్యార్థుల్లో ఉంటున్నాయి. దీంతో, వారు పరీక్షలు సరిగా రాయలేకపోతున్నారు. రెండుసార్లు పరీక్షలు రాసే అవకాశమిస్తే ఇలాంటి భయాలు వారిలో ఉండవు. పూర్తిస్థాయిలో ప్రిపేరయి పరీక్ష రాస్తే సంతృప్తికరమైన స్కోర్ సాధించగలుగుతారు. ఒకసారి మంచి స్కోర్ తెచ్చుకున్న విద్యార్థి మరో విడత పరీక్ష రాయాలా వద్దా అనేది ఐచ్ఛికం. ఇందులో ఎటువంటి నిర్బంధం లేదు'అని వివరించారు. 2024 నుంచే ఈ విధానాన్ని అమల్లోకి తెస్తున్నామని తెలిపారు.

డమ్మీ స్కూళ్ళ పనిపడతాం

రాజస్తాన్‌లోని కోటాలో పరీక్షలకు శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులు ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో బలవన్మరణాలకు పాల్పడటంపై మంత్రి ప్రధాన్ స్పందిస్తూ.. 'ఇది చాలా సున్నితమైన అంశం. విస్మరించరానిది'అన్నారు. అదేవిధంగా, తమ సొంత రాష్ట్రంలోని స్కూల్‌లో అడ్మిట్ అయిన విద్యార్థులు అక్కడ చదవకుండా, పరీక్షల శిక్షణ కోసం కోటా వంటి చోట్లకు వెళ్తుండటం పై మంత్రి.. ఇటువంటి డమ్మీ స్కూళ్లపై చర్యలకు ఉపక్రమించాల్సిన సమయం వచ్చిందన్నారు. పాఠశాలకు హాజరు కాకపోవడం విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుందని, వారు ఒంటరితనంతో బాధపడుతూ, ఒత్తిడులకు గురవుతున్నట్లు నిపుణులు చెబుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విద్యా సంబంధ విధాన నిర్ణయాలపై ప్రభుత్వానికి సలహాలిచ్చే సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్(సీఏబీఈ)ని ఆధునీకరిస్తామని మంత్రి ప్రధాన చెప్పారు.

'ఆదిత్య' మార్గాన్ని చక్కదిద్ది...

కీలక ఘట్టాన్ని పూర్తి చేసిన ఇస్రో

బెంగళూరు: సూర్యశోధనకు ఉద్దేశించిన ఆదిత్య -ఎల్1 ఉపగ్రహ ప్రయోగంలో మరో కీలక దశను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది. దాని మార్గాన్ని సరిదిద్దే ప్రక్రియను సజావుగా జరిపినట్టు ఆదివారం ప్రకటించింది. అక్టోబర్ 6న 16 సెకన్ల పాటు ఇది కొనసాగిందని వివరించింది. లగ్రాంజ్ పాయింట్1 వైపు ఉపగ్రహం నిర్దేశిత మార్గంలో సాగేలా ఉంచేందుకు ఈ ప్రక్రియ తోడ్పడుతుంది. ఆదిత్య -ఎల్1 సూర్యునిపైకి భారత తొలి ప్రయోగం. దీన్ని సెప్టెంబర్ 2న శ్రీహరికోట నుంచి జరిపారు. తర్వాత దాని గమనాన్ని సెప్టెంబర్ 19న లగ్రాంజియన్ పాయింట్ కేసి నిర్దేశించారు. తాజా ప్రయత్నం ద్వారా దాన్ని మరింతగా సరిచేశారు. 125 రోజుల పాటు భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల ప్రయాణం తర్వాత ఆదిత్య-ఎల్1ను సూర్యునికి అతి సన్నిహితమైన హాలో కక్ష్యలోకి ప్రవేశపెట్టాలన్నది ఇస్రో లక్ష్యం.

ఐఏఎఫ్ అత్యుత్తమమైందిగా ఉండాలి

ఎయిర్‌చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి పిలుపు

ప్రయాగ్‌రాజ్: ఎప్పటికప్పుడు కొత్తగా ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి పిలుపునిచ్చారు. దేశ ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించేందుకు, శత్రువులను దీటుగా ఎదుర్కొనేందుకు ఐఏఎఫ్ కట్టుబడి ఉంటుందని ఆయన నొక్కిచెప్పారు. ఎయిర్ ఫోర్స్‌డేను పురస్కరించుకుని ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఏఎఫ్ అవతరించి 2032 నాటికి 100 ఏళ్లు పూర్తవుతుందని చెబుతూ ఆయన ప్రపంచంలోనే అత్యుత్తమ వైమానిక దళాల్లో ఒకటిగా ఐఏఎఫ్ అవతరించాలని అన్నారు. వ్యూహాలను మెరుగుపరుచుకోవడం, సామర్థ్యాలను సమకూర్చుకోవడం వంటివి భవిష్యత్ యుద్ధాల్లో పైచేయి సాధించడంలో ఐఏఎఫ్‌కు ఎంతో కీలకమన్నారు. ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా ప్రధాని మోదీ యుద్ధ వీరులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి నిరుపమాన సేవలు, త్యాగాల వల్లే మన గగనతలం సురక్షితంగా ఉందని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

24 గంటల వ్యవధిలో.. బిహార్‌లో 22 మంది నీటమునక

పట్నా: బిహార్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో 24 గంటల వ్యవధిలో నదులు, చెరువుల్లో స్నానాలు చేసేందుకు వెళ్లిన 22 మంది మృత్యువాత పడినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. వీరిలో అత్యధికులు జీవిత్‌పుత్రికా పండుగ సందర్భంగా స్నానాలు చేయడానికి వెళ్లిన మహిళలేనన్నారు. ఈ పండుగ రోజు మహిళలు తమ సంతానం బాగుండాలని దేవుణ్ని కోరుకుంటూ ఉపవాస దీక్షలు, నదీ స్నానాలు ఆచరించడం సంప్రదాయం. భోజ్‌పూర్‌లో బహియారా ఘాట్ వద్ద సోనె నదిలో స్నానాలు చేసేందుకు వెళ్లిన 15–20 మధ్య వయస్కులైన బాలికలు సెల్ఫీ తీసుకుంటూ నీటి ఉధృతికి కొట్టుకుపోయినట్లు అధికారులు వివరించారు. భోజ్‌పూర్‌లో అయిదుగురు, జెహానాబాద్‌లో నలుగురు, పట్నా, రొహతాస్‌ల్లో ముగ్గురు చొప్పున, దర్భంగా, నవడాల్లో ఇద్దరేసి, కై మూర్, మాధెపురా, ఔరంగాబాద్‌ల్లో ఒక్కరు చొప్పున జల సమాధి అయినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది.

వృద్ధుని శవాన్ని ఈడ్చుకెళ్లి... కాల్వలోకి విసిరేశారు!

బిహార్ పోలీసుల నిర్వాకం

పట్నా: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఒక వృద్ధుని శరీర భాగాలను పోలీసులు అమాంతంగా ఈడ్చుకెళ్లి కాల్వలోకి విసిరేశారు. ఈ అమానుష ఘటన ఆదివారం బిహార్‌లోని ముజఫర్‌నగర్ సమీపంలో చోటుచేసుకుంది. సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పోలీసు శాఖ నష్ట నివారణ చర్యలకు దిగింది. 'మీదినుంచి ట్రక్కు దూసుకెళ్లడంతో శరీర భాగాలు కొన్ని ఛిదికి రోడ్డుకు అంటుకుపోయాయి. వాటిని కాల్వలో వేసి మిగతా శరీరాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపాం'అని చెప్పుకొచ్చింది. ఆ వెంటనే పోలీసులు కాల్వలో వేసిన శరీర భాగాలను కూడా వెలికితీసి పోస్ట్ మార్టానికి పంపారు!!

2 వేలు దాటిన అఫ్గాన్ మరణాలు

- మరో 9,240 మందికి గాయాలు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

కాబూల్: అఫ్గానిస్తాన్ పశ్చిమ ప్రాంతాన్ని శనివారం కుదిపేసిన పెనుభూకంపంలో మృతుల సంఖ్య రెండువేలు దాటింది. తీవ్ర భూప్రకంపనల కారణంగా మట్టితో నిర్మించిన వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఆరు గ్రామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎటు చూసినా శిథిలాలు దుమ్ము ధూళితో నిండిపోయాయి. గత రెండు దశాబ్దాల్లో ఇలాంటి పెను భూకంపం అఫ్గాన్‌ను కుదిపేయడం ఇదే మొదటిసారి. గత ఏడాది జూన్‌లో అఫ్గానిస్తాన్‌లోని పర్వత ప్రాంతాల్లో సంభవించిన భూకంపంలో కనీసం వెయ్యి మంది చనిపోయారు. అఫ్గాన్‌లో నాలుగో అతి పెద్ద నగరమైన హెరాత్ కేంద్రంగా శనివారం భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. మృతుల సంఖ్య 2,100కి చేరువలో ఉందని ఆదివారం తాలిబన్ సమాచార, సాంస్కృతిక శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ వాహిద్ రయాన్ చెప్పారు. మరో 9,240 మందికి తీవ్ర గాయాలయ్యాయని 1,320 ఇళ్లు నేలమట్టమయ్యాయని ఆయన తెలిపారు. డజనుకి పైగా బృందాలు అత్యవసర సహాయ చర్యల్లో మునిగిపోయాయి. కొన్ని గ్రామాల్లోకి సహాయ సిబ్బంది అడుగు పెట్టడానికి కూడా వీల్లేకుండా శిథిలాలతో నిండిపోయాయి. ఎటు చూసినా శిథిలాల్లో చిక్కుకున్న వారి రోదనలే వినిపిస్తున్నాయి. శిథిలాల కింద ఉన్న వారిని కాపాడడానికి సహాయ బృందాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తమ చేతులనే ఆయుధాలుగా చేసుకొని శిథిలాలను తొలగిస్తున్నారు. శిథిలాలు తొలగిస్తున్న కొద్దీ గుట్టలు గుట్టలుగా శవాలు బయటకి వస్తున్నాయి. మరికొందరు స్థానికులు శిథిలాల మీద పాకుతూ వెతుకుతూ వాటిని తొలగిస్తున్నారు. కొన ఊపిరితో ఉన్న వారిని కాపాడుతున్నారు. హెరాత్‌లో నేలమట్టమైన ఓ ఇంటి శిథిలాల్లో నుంచి ఆదివారం ఒక శిశువును అక్కడి వారు కాపాడుతున్న దృశ్యాన్ని అసోసియేటెడ్ ప్రెస్ ప్రసారం చేసింది. అక్కడే శిథిలాల నుంచి ఓ మహిళ చేయి బయటికి కనిపిస్తుండటం కూడా రికార్డయ్యింది. ఆ మహిళ చిన్నారి తల్లేనని స్థానికులు తెలిపారు. ఆమె బతికున్నదీ లేనిదీ స్పష్టం కాలేదు. క్షతగాత్రులకు చికిత్స అందించడానికి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.


భూకంపం ధాటికి నామరూపాల్లేకుండా పోయిన మట్టి ఇళ్లు

బాధితులకు అందుతున్న సాయం..

అఫ్గాన్‌లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి నుంచి భూకంప బాధితుల్ని కాపాడేందుకు యూనిసెఫ్ దుస్తులు, దుప్పట్లు, టార్పాలిన్లు తదితరాలను పంపించింది. ఐరాస వలసల విభాగం నాలుగు అంబులెన్సులు, వైద్యులు, ఇతర సిబ్బందిని అక్కడి ఆస్పత్రికి పంపించింది. మూడు మొబైల్ వైద్య బృందాలను జెందాజన్ జిల్లాకు పంపిస్తున్నట్లు వెల్లడించింది. డాక్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్ సంస్థ కూడా 80 మంది రోగులకు సరిపోయే అయిదు మెడికల్ టెంట్లను హెరాత్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించింది. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం వంటి సంస్థలు కూడా అత్యవసరాలను అఫ్గానిస్తాన్‌కు అందజేస్తామని ప్రకటించాయి.

ఐవీఎఫ్ హార్మోన్ల బదులు అబార్షన్ బిళ్లలిచ్చారు!

న్యూయార్క్: వైద్యపరమైన నిర్లక్ష్యానికి పరాకాష్ట ఈ ఉదంతం. అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో సంతానం కోసం ఐవీఎఫ్ పద్ధతిని ఆశ్రయించిన తమికా థామస్ అనే మహిళకు మెడికల్ షాపు ఐవీఎఫ్ హార్మోన్ల బదులు పొరపాటున అబార్షన్ మాత్రలు ఇచ్చింది. ఏకంగా ఇద్దరు గర్భస్థ శిశువుల మరణానికి కారణమైంది! పుట్టబోయే బిడ్డలను పొట్టన పెట్టుకున్నారంటూ మెడికల్ షాప్‌పై ఆమె స్టేట్ బోర్డ్ ఆఫ్ ఫార్మసీకి ఫిర్యాదు చేసింది. ప్రిస్క్రిప్షన్‌లోని డాక్టర్ చేతిరాత అర్థం కాకపోవడం ఈ దారుణ పొరపాటుకు దారి తీసినట్టు విచారణలో తేలింది. 'షాపు సిబ్బంది తప్పు మీద తప్పు చేశారు. ఆ రాతను తమకు తోచినట్టుగా అర్థం చేసుకుని ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. పైగా తాము ఏం మందులు ఇస్తున్నదీ, వాటివల్ల ఏం జరుగుతుందన్నది విధిగా చెప్పాల్సి ఉండగా ఆ పని కూడా చేయలేదు'అని బోర్డు తేల్చింది. మెడికల్ షాప్‌కు పది వేల డాలర్ల జరిమానా విధించింది. కానీ దీనివల్ల పుట్టక ముందే కన్ను మూసిన తమ బిడ్డలు తిరిగొస్తారా అంటూ థామస్ దంపతులు విలపిస్తున్నారు. వారికి నలుగురు సంతానం. పెద్ద కుటుంబం కావాలనే కోరికతో మళ్లీ పిల్లలను కనాలని నిర్ణయించుకుని ఐవీఎఫ్ పద్ధతిని ఆశ్రయించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



తిరుపతమ్మకు వెండి వస్తువులు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మకు ఆదివారం కైకలూరులోని వదర్లపాడుకు చెందిన వడుపు తులసీరామ ఆనంద్‌కుమార్ దంపతులు 1.635 కేజీల వెండి వస్తువులను అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 525.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,944, ఎడమ కాలువకు 4,416 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన ప్రారంభమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో స్పందన కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

రేపు జిమ్నాస్టిక్స్, రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపిక

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని క్రీడాకారులకు అండర్–14, 17 జిమ్నాస్టిక్స్ కృష్ణా జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక కార్యక్రమం ఈ నెల 10వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోటీలో పాల్గొనే విద్యార్థులు రిపోర్ట్ చేయాలని సూచించారు. అలాగే అండర్–14, 17 రోప్ స్కిప్పింగ్ బాల బాలికల కృష్ణా జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పామర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఉదయం 9గంటల కల్లా పోటీలో పాల్గొనే విద్యార్థులు రిపోర్ట్ చేయాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు విరాళాలు అందించారు. విజయవాడ ఎలక్ట్రిసిటీ కాలనీకి చెందిన శాఖమూరి శ్రీనివాస్ రూ. లక్ష, గుంటూరుకు చెందిన ఒంటెద్దు చిన్న బాపిరెడ్డి, శేషరత్నం దంపతులు రూ. 1,00,116 విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందివ్వగా దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.


నేడు శివలింగాల ఊరేగింపు

మచిలీపట్నంటౌన్: కాశీ మహాక్షేత్రం వద్ద నవంబర్‌లో నిర్వహించే కోటి లింగాల అభిషేకం, అర్చనకు మచిలీపట్నంలో తయారుచేసిన 6.50 లక్షల శివలింగాల ఊరేగింపు ఈ నెల 9వ తేదీన ఉంటుందని నిర్వాహకురాలు కోరె చిట్టి కుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు సర్కిల్‌పేట నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు జవ్వారుపేట సెంటర్ నుంచి నాగపోతరావు సెంటర్, కోనేరుసెంటర్, మునిసిపల్ కార్యాలయం వద్ద నుంచి మళ్లీ కోనేరుసెంటర్‌కు చేరుతుందని తెలిపారు. ఈ ఊరేగింపు మేళతాళాలతో నిర్వహించి శివలింగాలను శ్రీ విజయానంద గురు సేవాసమితి నిర్వాహకులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారణాసికి చెందిన సైకిల్ బాబా హాజరవుతారని తెలిపారు.

నేటి నుంచి జాతీయ పోస్టల్ వారోత్సవాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ పోస్టల్ వారోత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి 13వరకు నిర్వహిస్తున్నట్లు విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీవీఎస్ఆర్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నమ్మకంతో కలిసి అనే నినాదంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఏడాది పోస్టల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తపాలా శాఖ సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సేవలను అందిస్తోందన్నారు. పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలు, విదేశాలకు పార్సిల్ సౌకర్యం, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా విద్యుత్, ఫోన్ బిల్స్, మొబైల్ రీచార్జ్, మున్సిపల్ ట్యాక్స్ పేమెంట్, రైల్వే టికెట్లు బుకింగ్ వంటి సౌకర్యాలను కల్పించిందన్నారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం 9వ తేదీ ఆధార్ కేంద్రాల ఏర్పాటు, కామన్ సర్వీస్ సెంటర్లపై అవగాహన, 10న జీవిత బీమా, పొదుపు ఖాతాలపై అవగాహన, సేకరణ, 11న ఢాయి ఆఖర్ లెటర్ రైటింగ్ గురించి అవగాహన, ఫిలాటెలి క్విజ్, 12న ఖాతాదారుల సదస్సు, మెయిల్స్‌పై అవగాహన, 13న ఆధార్ కేంద్రాలు, క్యాంపులు ఏర్పాటు, ఏఈపీఎస్, డీబీటీపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

దుర్గగుడి ఈవోగా కేఎస్ రామారావు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కేఎస్ రామారావును నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న కేఎస్ రామారావును దుర్గగుడి ఈవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. తక్షణమే దుర్గగుడి ఈవోగా బాధ్యతలు చేపట్టాలని రామారావుకు ఆదేశాలు జారీ అయ్యాయి. సోమవారం ఉదయం కేఎస్ రామారావు దుర్గగుడికి విచ్చేసే అవకాశాలున్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతినిధుల సభకు సర్వం సిద్ధం

- నేడు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ
- హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన సజ్జల, తలశిల



ఇందిరాగాంధీ స్టేడియంలో సిద్ధమైన సభా ప్రాంగణం



ఏర్పాట్లపై మాట్లాడుతున్న సీపీ రాణా, ఎమ్మెల్సీ తలశిల, మండలి విప్ అప్పిరెడ్డి తదితరులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి జోగి తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం జరిగే వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు భారీ ఏర్పాట్లు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశానికి హాజరుకానున్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మంత్రి జోగి రమేష్, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మల్లాదివిష్ణు, పార్టీ నేతలు పుత్తా ప్రతాపరెడ్డి, పునూరు గౌతంరెడ్డి పరిశీలించారు. సభకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్సీ తలశిల రఘురాం వివరించారు. సభాస్థలి, గ్యాలరీలు, వీవీఐపీలు, వీఐపీలు, పార్టీప్రతినిధులు ఏ ప్రవేశ ద్వారం గుండా వస్తారు. పార్కింగ్ ప్రదేశాలు, వచ్చే ప్రజా ప్రతినిధులకు ఇబ్బంది లేకుండా చేసిన ఏర్పాట్లను పార్టీ నేతలకు వివరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ప్రజా ప్రతినిధులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం చేసేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరయ్యే పార్టీ ప్రతినిధులకు పాసులు జారీ చేశారు.

కీలక అంశాలపై ప్రసంగం..

ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం విప్లవాత్మక పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెచ్చారన్నారు. నేడు జరిగే పార్టీ ప్రతినిధుల సభలో కీలక అంశాలపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ఐదుకోట్ల ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే పార్టీ ప్రతినిధులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన..

భద్రతా ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి పరిశీలించారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం, పరిసర ప్రాంతాల్లో చేస్తున్న కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు, ప్రజలకు శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని సిబ్బందిని సీపీ ఆదేశించారు. ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. భద్రతా పరంగా ఎటువంటి లోపాలు లేకుండా, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో పాటు, తగు సూచనలు చేశారు. డీసీపీలు విశాల్ గున్ని, మోకా సత్తిబాబు, ఉదయరాణి, బి.రామకృష్ణ, ఏడీసీపీలు పి.వెంకటరత్నం, జి.వి.రమణమూర్తి, డి.ప్రసాద్, కె.వి.వి.ఎన్.వి.ప్రసాద్, ఏసీపీ భాస్కరరావు, వెంకటనారాయణ, సీఐ గుణరాం, వెంకటేశ్వర్లు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

12 నుంచి అండర్–19 వన్డే క్రికెట్ పోటీలు

మంగళగిరి, మూలపాడు స్టేడియంలలో మ్యాచ్‌ల నిర్వహణ

మంగళగిరి: మంగళగిరి, మూలపాడు క్రికెట్ స్టేడియంలలో ఈనెల 12వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ క్రికెట్ స్టేడియం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో గోపినాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వినో మన్కడ్ పేరుతో అండర్–19 పురుషుల వన్డే క్రికెట్ పోటీలు ఈనెల 12 నుంచి 20 తేదీ వరకు మంగళగిరిలోని అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంతోపాటు మూలపాడులోని డీవీఆర్, సీపీ గ్రౌండ్‌లలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగాల్, హైదరాబాద్, ఉత్తరాఖండ్ జట్లు పాల్గొంటాయని తెలిపారు. మ్యాచ్‌లు తిలకించాలనే వారికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి ఈ టోర్నీని రాష్ట్రానికి బీసీసీఐ కేటాయించిందన్నారు. అందులో భాగంగా రూ.15 కోట్లతో మంగళగిరి స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంటర్‌లో అడ్మిషన్ల జోష్

అనూహ్యంగా పెరిగిన ప్రవేశాలు

- ఉమ్మడి జిల్లాలో 342 కళాశాలలు
- ఇప్పటి వరకూ 62,790 అడ్మిషన్లు
- గతేడాది కంటే 6,333 అధికంగా ప్రవేశాలు
- కొత్త సెక్షన్ల కోసం దరఖాస్తులు చేస్తున్న కళాశాలలు
- ప్రభుత్వ చర్యలతో గణనీయమైన మార్పు



ఇంటర్ విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు బాగా పెరిగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గతేడాది కంటే 6,333 మంది ఇప్పటి వరకూ అదనంగా ప్రవేశం పొందారు. ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలతో అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా పరీక్షలు తప్పిన విద్యార్థులకు రీ అడ్మిషన్ తీసుకునే అవకాశం కల్పించటం సైతం ఈ సంఖ్య పెరగటానికి దోహద పడింది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగానే ఇది సాధ్యపడిందని విద్యావేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి సైతం విద్యార్థులు ఉన్నత విద్యవైపు వస్తున్నారనటానికి ఇది నిదర్శనమని వివరిస్తున్నారు.

డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు..

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు గతంలో చాలా మంది కళాశాల వైపు అడుగులు వేసేవారు కాదు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదో తరగతి నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కళాశాలలో చేరాలి. లేదా పాలిటెక్నిక్ లేకుంటే ఐటీఐ ఇలా ఏదోక కోర్సులో తప్పనిసరిగా చేరాలి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. పదో తరగతి పూర్తి చేసుకొని హైస్కూల్ నుంచి బయటకు వచ్చే విద్యార్థి ఆయా విద్యాసంస్థల్లో చేరినట్లుగా ప్రభుత్వ రికార్డులో నమోదు కావాలి. దానికి అనుగుణంగా అన్ని సాంకేతిక రికార్డులను ప్రభుత్వం అనుసంధానం చేసింది. దానికి అనుగుణంగా సచివాలయం స్థాయిలో ఆ విద్యార్థి ఎక్కడ ఉన్నది కనుగొంటారు. పది తర్వాత కళాశాలలో చేరకుంటే ఆ కుటుంబానికి సచివాలయం సిబ్బంది కౌన్సెలింగ్ చేస్తారు. ఒక వేళ పదో తరగతి తప్పితే తిరిగి అదే హైస్కూల్‌లో చేర్పిస్తారు. ఇలా తీసుకున్న చర్యలు అన్ని విధాలుగా ఉన్నత విద్యారంగంలో విద్యార్థుల శాతం పెరగటానికి దోహదపడుతున్నాయి.

ఎన్టీఆర్ జిల్లాలో 3,083..
కృష్ణాజిల్లాలో 3,250..

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో గత ఏడాది కన్నా సుమారు ఆరువేలకుపైగా అడ్మిషన్లు పెరిగాయి.
- ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 185 కళాశాలలు కొనసాగుతున్నాయి. అందులో గత ఏడాది సుమారుగా 37,359 అడ్మిషన్లు జరిగాయి. కానీ ఈ ఏడాది 40,442 అడ్మిషన్లు జరిగాయి. అంటే 3,083 అడ్మిషన్లు పెరిగాయి.
- కృష్ణాజిల్లాలో సుమారు 157 కళాశాలలు కొనసాగుతున్నాయి. అందులో గత ఏడాది 19,098 అడ్మిషన్లు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ 22,348 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అదనంగా 3,250 మంది అడ్మిషన్లు తీసుకున్నారు.

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..



ఇంటర్మీడియెట్ విద్యలో అడ్మిషన్లు పెంపుపై ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా పలు చర్యలు చేపట్టింది. పదో తరగతి పూర్తయిన తరువాత విద్యార్థి ఎక్కడ ఉన్నది తప్పనిసరిగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఇంటర్మీడియెట్ తప్పిన వారికి రీ అడ్మిషన్ ఇస్తున్నాం. హైస్కూల్ ప్లస్ కాలేజ్‌లో సైతం మంచిగా అడ్మిషన్లు జరుగుతున్నాయి. రానున్న కాలంలో మరింత పెంచటానికి కృషి చేస్తాం.

– పెదపూడి రవికుమార్, ఆర్ఐవో, ఉమ్మడి కృష్ణాజిల్లా

అదనపు సెక్షన్లకు వినతులు..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 342 కళాశాలలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగాగా ఆయా జూనియర్ కళాశాలల నుంచి వందకు పైగా అదనపు సెక్షన్లకు వాటి యాజమాన్యాల నుంచి దరఖాస్తులు అందాయి. కృష్ణా జిల్లాలో సుమారుగా 157 కళాశాలలు ఉండగా అందులో సుమారు 99 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. అదేవిధంగా ఎన్టీఆర్ జిల్లాలో 185 కళాశాలలు ఉండగా అందులో సుమారు 136 వరకూ ప్రైవేట్ కళాశాలలు కొనసాగుతున్నాయి.

ముందే గుర్తించు..
మహమ్మారిని జయించు



అవగాహనతో రొమ్ము క్యాన్సర్‌కు చెక్

- తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏటా 2 వేల మంది బాధితులు
- మహిళలకు వరంలా మారిన 'ఫ్యామిలీ డాక్టర్'
- క్యాన్సర్ అవగాహనా మాసంగా అక్టోబర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు 45 ఏళ్లు నిండిన వారిలో కనిపించే బ్రెస్ట్ క్యాన్సర్, ఇప్పుడు యుక్త వయస్సు వారిలో కూడా గుర్తిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. రొమ్ము క్యాన్సర్‌ను వైద్యుడి వద్దకు వెళ్లకుండానే సెల్ఫ్ చెక్ చేసుకోవడం ద్వారా గుర్తించే అవకాశం ఉన్నా, చాలా మంది రెండు, మూడు దశల వరకూ గుర్తించలేక పోతున్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు కొంత వరకూ సత్ఫలితాలు ఇస్తున్నా, ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని వైద్యులు చెబుతున్నారు. పాశ్చాత్య దేశాల్లో 50 ఏళ్లు దాటిన వారిలో బ్రెస్ట్ క్యాన్సర్ సోకుతుండగా, మన దేశంలో 40 ఏళ్లు నిండిన వారికి బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. చాలా అరుదుగా 30 ఏళ్ల వయస్సులోనూ, పురుషుల్లో కూడా బ్రెస్ట్ క్యాన్సర్ సోకుతోంది. ప్రభుత్వం సైతం క్యాన్సర్ వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. రాష్ట్రంలో కాంప్రిహెన్సివ్ క్యాన్సర్ కేర్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, అత్యుత్తమ చికిత్సలు అందించేందుకు రంగం సిద్ధం చేస్తుంది. అక్టోబర్ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా వివిధ సంస్థలు ప్రజల్లో దీనిపై అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నాయి.

'ఫ్యామిలీ డాక్టర్'తో మేలు..

గ్రామీణ ప్రాంత మహిళలకు కుటుంబ డాక్టర్ కార్యక్రమం వరంలా మారింది. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామానికే వైద్యులు వెళ్లడం, ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్టు వైద్యులు సైతం వెళ్లడంతో గ్రామీణ మహిళలు ఆరోగ్య చెకప్ చేయించుకుంటున్నారు. అక్కడ బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే మమోగ్రామ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఇలా ఇప్పటికే అనేక మందికి ప్రాథమిక దశలో గుర్తించారు. అంతేకాదు శస్త్ర చికిత్స తర్వాత కూడా వారిని ఫాలోఅప్ చేస్తూ మందులు అందజేస్తున్నారు.

వీరికి రొమ్ము క్యాన్సర్ రావచ్చు..

లేటు వయస్సులో పిల్లలు పుట్టిన వారికి, బిడ్డకు పాలివ్వని తల్లులకు, వంశపారంపర్యంగా, జీవనశైలి, పన్నెండేళ్లలోపు రజస్వల కావడం, రెడ్‌మీట్ తినేవారిలో, ఎక్కువసేపు కూర్చొని పనిచేసే వారిలో బ్రెస్ట్ క్యాన్సర్ రావచ్చు. ఊబకాయంతో ఉన్న మహిళలు, మోనోపాజ్ చేరే సమయంలో వచ్చే దుష్ఫలితాలకు వాడే మందులు కారణంగా బ్రెస్ట్ క్యాన్సర్ రావొచ్చు. పెళ్లిచేసుకోని మహిళలకు, పిల్లలు లేని మహిళలకు, ధూమపానం, ఆల్కాహాల్ తాగే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ.

సెల్ఫ్ చెక్ ఇలా..

- పీరియడ్ వచ్చి, ఆగిన ఐదు రోజుల తర్వాత రొమ్ము సెల్ఫ్ చెక్ చేసుకోవాలి.
- రొమ్ముపై గింజంత సైజులో కణితులు ఏమైనా వచ్చాయా, రొమ్ముపై చర్మం రంగు మారిందేమో చూడాలి.
- చంకల్లో గడ్డలు లాంటివి వచ్చాయా అనే విషయాలను మహిళలు చెక్ చేసుకోవాలి.
- రొమ్ముపై ఏమైనా కాయలు ఉన్నాయా, రొమ్ము టైట్ అవుతుందా, అల్సర్స్ వచ్చాయా, చనుమొనల నుంచి రక్తకారుతుందా వంటి అంశాలను సెల్ఫ్‌చెక్ చేసుకోవచ్చు.
- నొప్పిలేని కణితులను క్యాన్సర్‌గా భావించి నిర్ధారణ పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలి.

లక్షణాలపై అవగాహన ఉండాలి..



రొమ్ము క్యాన్సర్ లక్షణాలపై ప్రతి మహిళా అవగాహన పెంచుకోవడం ద్వారా తొలిదశలో గుర్తించవచ్చు. మన దేశంలో 40 ఏళ్లు దాటిన వారిలో బ్రెస్ట్ క్యాన్సర్ సోకుతోంది. మహిళలకు సోకే క్యాన్సర్‌లలో 70 శాతం మందిలో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌లు ఉంటున్నాయి. ప్రతి మహిళ సెల్ఫ్ చెక్ చేసుకోవాలి. రొమ్ముపై నొప్పిలేని కణితి వచ్చినా, చంకలో గడ్డలు ఏర్పడినా వైద్యుడిని సంప్రదించాలి. రొమ్ముక్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు.

– డాక్టర్ ఎస్. సుబ్బారావు, క్యాన్సర్ వైద్య నిపుణుడు

ప్రత్యేక దృష్టి..



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో నాన్ కమ్యూనికల్ డిసీజెస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాం. అందులో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి లక్షణాలతో వచ్చిన వారిని గుర్తించి స్క్రీనింగ్ కోసం పంపుతున్నాం. అంతేకాకుండా ఆయా వ్యాధులతో చికిత్స పొందుతున్న వారిని సైతం మానిటరింగ్ చేసి మందులు అందిస్తున్నాం. రొమ్ముపై కణితులు, రొమ్ములో గడ్డలు ఉన్నట్లు మహిళలు వస్తే వారి లక్షణాలను పరిశీలించి నిర్ధారణ పరీక్షల కోసం పంపుతున్నారు. అన్ని పరీక్షలు ప్రభుత్వాస్పత్రిల్లో ఉచితంగా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

త్వరలో తిరుపతమ్మ మాసపత్రిక



మాట్లాడుతున్న ఈఓ రమేష్‌నాయుడు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): తిరుపతమ్మ ఆలయం తరఫున త్వరలో మాసపత్రిక ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు అన్నారు. ఆలయ పాలకవర్గ సమావేశం ఆదివారం చాంబర్‌లో చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన ఆలయాల తరఫున మాసపత్రికలు నడుపుతున్నారని, దానిలో భాగంగా తిరుపతమ్మవారి ఆలయం తరఫున కూడా పత్రిక నిర్వహించేందుకు దేవదాయశాఖ మంత్రి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మవారు గ్రామదేవత కాబట్టి మాసపత్రికలో రాష్ట్రంలోని గ్రామ దేవతల చరిత్ర, గొప్ప తనాన్ని తెలియజేసేలా ముద్రణ ఉంటుందన్నారు. ధర్మ ప్రచారంలో భాగంగా సనాతన ధర్మానికి సంబంధించి పురాణ కథలు, మంచి విషయాలు పిల్లలకు కూడా తెలిసేలా దేవదాయ శాఖ ప్రచారం ప్రారంభించిందని, అమ్మవారి దేవాలయంలో కూడా త్వరలో ప్రారంభమవుతుందన్నారు. తిరుపతమ్మవారి చరిత్ర రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖంగా తెలియజేసేలా హరికథ, బుర్రకథలు చెప్పించించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆలయ ఆదాయ వనరులు, అవకాశం బట్టి ఉద్యోగుల జీతాల పెంపు ఉంటుందన్నారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓలు పాల్గొన్నారు.

రేపు ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌కు హోంమంత్రి వనిత

మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌కు ఈనెల 10న మంగళవారం రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత రానున్నట్లు బెటాలియన్ అధికారులు ఆదివారం తెలిపారు. 10న ఉదయం 7.30 గంటలకు బెటాలియన్ ఆవరణలో జరగనున్న 21 వ బ్యాచ్ కెనెనెస్ హ్యాండ్‌లెర్స్ ట్రైనింగ్ శిబిరానికి మంత్రి హాజరుకానున్నట్లు తెలిపారు. హోంమంత్రితో పాటు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ గుప్తాతో పలువురు పోలీస్ ఉన్నతాధికారులు రానున్నట్టు వివరించారు.

నేటి నుంచి కళాశాలల్లో ఇంటర్ మార్కుల లిస్టులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ -2023 వార్షిక పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు మార్కుల లిస్టులను (ఒరిజినల్ మార్క్స్ మెమో)ను సంబంధిత జూనియర్ కళాశాల నుంచి పొందవచ్చని ఇంటర్మీడియెట్ బోర్డు ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రాంతీయ అధికారి పెదపూడి రవికుమార్ తెలిపారు. ఇప్పటికే ఇంటర్మీడియెట్ బోర్డు ఉమ్మడి జిల్లా కార్యాలయం నుంచి ఆయా ప్రిన్సిపాల్స్ మార్కుల లిస్టులను తీసుకెళ్లారని, సంబంధిత విద్యార్థులు వారివారి కళాశాలలకు వెళ్లి, వాటిని పొందవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ తక్షణమే విద్యార్థులకు వాటిని అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

11 నుంచి పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవాలు

పెదకాకాని: శివాలయంలో పవిత్రోత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకూ జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో భ్రమరాంబ అమ్మవారికి మల్లేశ్వరస్వామి వారికి జరిగే రాహు, కేతువు, నవగ్రహ పూజలు, రుద్ర, చండీ హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, నిత్య కల్యాణం పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వాహన పూజలు, అన్న ప్రాసనలు మాత్రమే చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆలయంలో 14వ తేదీ అమావాస్య రోజున యథావిధిగా భక్తులకు అన్ని రకాల పూజలు, అభిషేకాలు, హోమాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు.

వ్యాపారవేత్తలుగా డ్వాక్రా మహిళలు



పచ్చళ్లు తయారు చేస్తున్న నాగమల్లేశ్వరి



కేతనకొండలో ఇంట్లోనే స్వీట్లు తయారు చేస్తున్న అనిత

- ప్రభుత్వ ప్రోత్సాహంతో రాణిస్తున్న మహిళలు
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన
- తోటి మహిళలకు ఉపాధి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వశక్తితో వ్యాపా రం చేయాలని ఉందా? పెట్టుబడి ఎలా అని ఆలోచిస్తున్నారా? ఏ వ్యాపారమైతే లాభసాటిగా ఉంటుంది.. ఎంత పెట్టుబడి కావాలి... ఉత్పత్తి చేసిన వస్తువులను మార్కెట్ చేసుకోవడం ఎలా... ఇలాంటి ఆలోచనలు ఉన్నాయా? మీరు డ్వాక్రా సభ్యులైతే చాలు. మీ ఆలోచనలకు మంచి మార్గం దొరికనట్లే. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను లక్షాధికారులను చేయాలనే సంకల్పంతో అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తోంది. బ్యాంకర్ల ద్వారా మహిళలకు సబ్సిడీపై రుణ సదుపాయం కల్పిస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళలకు చేదోడు వాదోడుగా నిలుస్తోంది. శిక్షణ, వ్యాపార నిర్వహణకు అవసరమైన సర్టిఫికెట్లు ఇప్పించడం వంటి పనులు డీఆర్‌డీఏ నిర్వహిస్తోంది.

నెరవేరుతున్న ప్రభుత్వ సంకల్పం....

మహిళలను లక్షాధికారులను చేయాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరుతోంది. డ్వాక్రా మహిళలు చిరు వ్యాపారాలు ప్రారంభించి తమ కాళ్లపై తాము నిలబడుతున్నారు. సొంత వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తోటి వాళ్లకు ఉపాధి కల్పిస్తున్నారు. తాము వ్యాపారులుగా ఎదగాలన్న మహిళల ఆలోచనలకు ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు తోడ్పాటునందిస్తున్నాయి. ఇంట్లోనే ఉంటూ పచ్చళ్లు, స్వీట్లు తయారీ, అప్పడాల తయారీ, ఫ్లోర్‌మిల్, చిల్లి పౌడర్, వంటి పలు రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు రుణ సహాయం అందిస్తున్నాయి.

మహిళలు వ్యాపారాల్లో రాణిస్తున్నారు



మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తోంది. మహిళలు యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన శిక్షణ, లైసెన్స్‌లు ఇతర సర్టిఫికెట్లు ఏ విధంగా పొందాలో అవగాహన కల్పిస్తాం. మహిళలు పథకాలు వినియోగించుకుని వ్యాపారాల్లో రాణిస్తున్నారు.

– కె శ్రీనివాసరావు, పీడీ, డీఆర్‌డీఏ, ఎన్టీఆర్ జిల్లా

సంఘంలో రుణంతో వ్యాపారం



నేను 2000 సంవత్సరంలో డ్వాక్రా సభ్యురాలిగా చేరాను. అప్పటి నుంచి సంఘంలో రుణాలు తీసుకుని చెల్లిస్తూ ఉన్నాను. గతంలో ఇంట్లోనే బేకరీ ఐటమ్స్ తయారు చేశాం. నా భర్త సైకిల్‌పై తిరిగి అమ్మేవారు. అప్పట్లో నెలకు రూ.వెయ్యి ఆదాయం వచ్చేది. తర్వాత ప్రభుత్వ పథకం గురించి తెలుసుకున్నాను. ఈ పథకంలో బ్యాంకు నుంచి రూ. 5లక్షలు రుణం తీసుకున్నాను. ఆ మొత్తంతో బేకరీ ఐటమ్స్ తయారీకి కావాల్సిన ముడి సరుకు, మిషనరీ కొనుగోలు చేశాను. తక్కువ సమయంలో ఎక్కువ స్వీట్లు ఉత్పత్తి చేయగలుగుతున్నాను. దీని వలన వ్యాపారం వృద్ధి చెందింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఆర్డర్లు కూడా వస్తున్నాయి. ఇంట్లోనే స్వీట్లు తయారు చేసి అమ్మకాలు చేపట్టాను. నెలకు రూ. 30 వేలు ఆదాయం వస్తోంది. కుటుంబం ఆర్థికంగా స్థిరపడింది. మేం లబ్ధిపొందడమే కాకుండా ఇద్దరు మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నాం. ప్రస్తుతం చాలా సంతోషంగా ఉంది.

– చిల్ల అనిత, కేతనకొండ

కుటుంబానికి ఆసరా దొరికింది



నేను నా భర్త కోళ్ళఫారంలో పని చేసేవాళ్లం. మా సంపాదన కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. పిల్లల చదువులు, చిన్న చిన్న అవసరాలకు ఇబ్బందులు పడేవాళ్లం. ఆదాయం కోసం ఏదైనా చేయాలి అనుకునేదానిని. కానీ మా దగ్గర అంత డబ్బు లేక నిస్సహాయంగా ఉండిపోయాం. పొదుపు సంఘంలో చేరితే అభివృద్ధి చెందవచ్చని తెలిసి సంఘంలో చేరాను. అధికారుల సహకారంతో ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకున్నాను. గ్రామంలోనే పచ్చళ్ల తయారు చేయాలనే ఆలోచన తట్టింది. ఇంట్లోనే పచ్చళ్ల తయారీ ప్రారంభించాను. పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో బ్యాంకు ద్వారా రూ. 4 లక్షలు తీసుకున్నాను. కారం ఆడే మిషన్, గ్రైండర్, ప్యాకింగ్ మిషన్ వంటి సామగ్రి కొనుగోలు చేశాను. దరణి పచ్చళ్ల అని పేరు పెట్టి వ్యాపారం బాగా వృద్ధి చేశాను. వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు ప్రతి రోజు రక రకాల పచ్చళ్లు తయారు చేస్తున్నాను. వీటిని విజయవాడ, కానూరు, పరిసర ప్రాంతాల్లో కిరణా షాపులకు సరఫరా చేస్తున్నా. చెన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాలకు కార్గో సర్వీసు ద్వారా సరఫరా చేస్తున్నాం. పచ్చళ్ల నాణ్యత, శుభ్రత పాటించడం, రుచిగా ఉండడంతో ఆర్డర్లు బాగా వస్తున్నాయి. యంత్రాల సహాయంతో పచ్చళ్ల తయారీ చేయడం వలన సమయం కలిసి వచ్చింది, అరకొరగా ఉన్న నెల ఆదాయం ఒక్కసారిగా పెరిగింది. ఇంటిలోనే పచ్చళ్లు తయారు చేస్తూ మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నాను. ప్రభుత్వం అందించిన తోడ్పాటు మరువలేను.

– ధూళిపాళ నాగమల్లేశ్వరి, నున్న

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు : ఎస్పీ జాషువా



కోనేరుసెంటర్: జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పి.జాషువా హెచ్చరించారు. ఐసీసీ వన్డే క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే బుకీలపై నిఘా ఉంచామని తెలిపారు. అమాయకుల బలహీనతను ఆయుధంగా మార్చుకుని బుకీలు బెట్టింగ్‌లకు ప్రేరేపించినా, బుకీలకు ఎవరైనా షెల్టర్‌లు ఇచ్చినా బుకీలతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అలాగే యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. క్రికెట్ బెట్టింగ్‌లకు సంబంధించి ప్రజల వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా డయల్ -100 లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెంటనే సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

విజయవాడ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడిగా కొలుసు



విజయవాడ కల్చరల్: విజయవాడ ఆర్ట్స్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా చిత్రకారుడు కొలుసు సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి యు.వేణుగోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యారావుపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. విజయవాడ ఆర్ట్స్ సొసైటీ జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకొని చిత్ర కళా రంగానికి కృషి చేస్తునట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పి.చిదంబరేశ్వరరావు, కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాసరెడ్డి, పార్వతి, కోశాధికారిగా ఎ. అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా ఓడి మల్లేశ్వరరావు, పి. రవికుమార్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ రహదారిపై బాపులపాడు మండలం ఆరుగొలను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. నందివాడ మండలంలోని తుమ్మలపల్లిలో చేపల చెరువుల వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న హనుమాన్‌జంక్షన్‌కు చెందిన గాదిరాజు శ్రీనివాసరాజు (51) శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడినపోయిన గాదిరాజు శ్రీనివాసరాజుపై నుంచి గుర్తు తెలియని లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ టి.తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐకి తీవ్రగాయాలు



టిప్పరు వెనుక ఇరుక్కుపోయిన ఏఎస్ఐ బైక్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ట్రాఫిక్ ఏఎస్ఐ తీవ్రంగా గాయపడ్డారు. గన్నవరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వెంకటేశ్వరరావు ఏఎస్ఐగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం విధులకు హాజరయ్యేందుకు విజయవాడ నుంచి గన్నవరం బయలుదేరారు. కేసరపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై మరమ్మతులకు గురై నిలిచిపోయిన టిప్పరు లారీని ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఏఎస్ఐకు తీవ్ర గాయాలు కావడంతో ఎనికేపాడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

నేడు విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిఖామణి సెంటర్ నుంచి చుట్టుగుంట, వాటర్‌ట్యాంక్ రోడ్డులోకి వాహనాల అనుమతి నిషేధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సభకు హాజరయ్యే ప్రతినిధులు వారి కార్లు, బస్సుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన చోటే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే...

రాష్ట్ర వ్యాప్తంగా విచ్చేసే ప్రతినిధులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కోఆర్డినేటర్‌ల కోసం సిటీ ఆర్మ్‌డు రిజర్వ్‌డ్ గ్రౌండ్‌లో ఫ్రంటల్ రాష్ట్ర అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు, జిల్లా పరిషత్ చైర్మన్‌లు, మేయర్‌లు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌ల వాహనాలకు బిషప్ అజరయ్య స్కూల్ మైదానంలో పార్కింగ్ కేటాయించారు. శ్రీకాకుళం, పార్వతిపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్‌జిల్లా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చే ప్రతినిధుల వాహనాలకు స్వగృహ ఫుడ్స్ వెనుక ఖాళీ స్థలం, రైల్వే క్లబ్ గ్రౌండ్, సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించారు. అదే విధంగా కడప, నంద్యాల, కర్నూలు, నెల్లూరు, తిరుపతి, శ్రీసత్యసాయి, అనంతపురం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వచ్చే ప్రతినిధుల వాహనాలకు సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్, సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు....

- బందరురోడ్డు పీసీఆర్‌జంక్షన్ నుంచి బెంజిసర్కిల్ మార్గంలో ఉదయం 7గంటల నుంచి మ ధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్టీసీ సిటీ బస్సులను నిషేధించారు. రూట్ నెంబర్-5లో ఆటోనగ ర్, పామర్రు వైపునుంచి వచ్చే ఆర్టీసీ బస్సులనుకూడా పీఎన్‌బీఎస్, రైల్వే స్టేషన్‌కు నిషేధించారు.
- ఆర్టీసీ బస్సులు బెంజిసర్కిల్ నుంచి ఫకీరుగూడెం, స్క్రూబ్రిడ్జి, వారధి జంక్షన్, పీఎన్‌బిఎస్ ఇన్ గేటు నుంచి సిటీ బస్సు టెర్మినల్‌కు చేరుకుంటాయి.
- పీఎన్‌బీఎస్ నుంచి రూట్ నెంబర్-5, బందరురోడ్డు నుంచి బెంజిసర్కిల్ మీదుగా వెళ్లే సిటీ బస్సులు పాత పీసీఆర్ జంక్షన్, పాత ఆర్టీసీ వై జంక్షన్, హోటల్ స్వర్ణప్యాలెస్, అప్సరా, విజయటాకీస్, దీప్తీ జంక్షన్, చుట్టుగుంట, మాచవరం, పడవలరేవు, గుణదల, రామవరప్పాడు రింగ్, మహానాడు, రమేష్ ఆసుపత్రి, నిర్మల కాన్వెంట్, బెంజిసర్కిల్ మీదుగా ఆటోనగర్, పెనమలూరు వైపు దారి మళ్లించారు.

వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు



మారథాన్‌లో సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదా రులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజియన్ హెడ్ ఎస్ఎస్ మూర్తి తెలిపారు. సెంట్రల్ బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం 5కె మారథాన్ నిర్వహించారు. మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశ వ్యాప్తంగా 90 రీజియన్‌లలో 4500 బ్రాంచిల ద్వారా ఖాతాదారులకు సేవలు అందిస్తుందని చెప్పారు. వంద మంది సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి 5కె మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్యాంక్ డెప్యూటీ రీజనల్ హెడ్ సురేష్ గొలాని చీఫ్ మేనేజర్ జీవీ రవీంద్ర, మురళి, ఉమేంద్ర, విక్రాంత్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాలను పుష్పలత, ముఖేష్‌కుమార్‌జా పర్యవేక్షించారు.

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు



గంగూరు వద్ద మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పెనమలూరు: గంగూరు వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గంగూరు నుంచి విజయవాడ వైపునకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌తో ఢీ కొట్టిన గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పై పడి తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురు బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో విజయవాడకు తరలించారు. మృతి చెందిన వ్యక్తి బైక్ నెంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శాంతి స్థాపన

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు విరివిగా నిర్వహించి శాంతి స్థాపనకు కృషి చేయాలని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన 31 అడుగుల మట్టి గణపతి నిమజ్జనోత్సవంలో కైలే పాల్గొన్నారు. స్వామికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ఎక్కడా లేని విధంగా భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని చెప్పారు. 21 రోజుల పాటు స్వామికి విశేషంగా పూజలు చేయటం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల వైపు పయనించాలని అప్పుడే సమాజంలో శాంతి స్థాపన జరుగుతుందన్నారు. భక్తిశ్రద్ధలతో ఎన్నో యజ్ఞాలు, హోమాలు నిర్వహించి సమాజంలో మంచి జరగాలని కోరుతున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కూసం పెద వెంకటరెడ్డి, పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. తాళ్ళాయపాలెం శ్రీశైవ క్షేత్రం పీఠాధిపతులు శివస్వామిచే ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం శివస్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఆలయంలో యజ్ఞములను శతాధిక ప్రతిష్టాచార్య చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ శిఖరాల వద్ద మహా కుంభాభిషేకం చేశారు. మట్టి వినాయకస్వామికి 108 రకాల పుష్పాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరంస్వామి వారికి నిమజ్జనోత్సవం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మిశెట్టి శ్రీధర్, తాళ్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి అప్పల రామారావు, సభ్యులు బొగ్గరపు జాలయ్య, బి.సాయిబాబు, బి.శ్రీనివాసరావు, ఘంటసాల సాయిరాం, జి.భరతుడు, తాళ్లూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కళా రంగంలో ఆధునిక మార్పులు



విజేతలతో జయశ్రీ ప్రభాకర్, భార్గవ్ తదితరులు

విజయవాడ కల్చరల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని నేటి తరం ఆర్టిస్టులు అందిపుచ్చుకోవాలని సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి తెలిపారు. ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రెండు రోజులగా బందరు రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహిస్తున్న డిజిటల్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ చిత్ర కళారంగంలో అనేక ఆధునిక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. సంప్రదాయ చిత్ర కళకు భంగం రాకుండా ఆధునికతను అధ్యయనం చేయాలని సూచించారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్నర్‌వీల్ మిడ్ టౌన్ అధ్యక్షురాలు హరితా చౌదరి మాట్లాడుతూ బాల బాలికలు డిజిటల్ పెయింటింగ్‌లో ప్రతిభ చూపించాలని తెలిపారు. చిత్రకారిణి జయశ్రీ ప్రభాకర్ డిజిటల్ పెయింటింగ్‌లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. ఆమె చిత్రాలను చాలా మంది అభిమానులు కొనుగోలు చేయడం శుభపరిణామమని తెలిపారు. ముగింపు సభలో జిజ్ఞాస ఇంటర్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ డాక్టర్ భార్గవ్, ఎలిమెంట్ స్కూల్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ డైరెక్టర్ పాలడుగు మహేష్ చిన్నారుల డిజిటల్ పెయింటింగ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్ కన్వీనర్ సునీల్‌కుమార్, స్ఫూర్తి శ్రీనివాస్, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు జి.నారాయణరావు, ఆర్.తులసీరావు చిత్రకళా విశేషాలను వివరించారు. డిజిటల్ పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. జయశ్రీ ప్రభాకర్‌ను, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వేణుగోపాల్, గిరిధర్‌ను నిర్వాహకులు సత్కరించారు.

బీఎంఏ చైర్మన్‌గా డాక్టర్ మెహబూబ్‌షేక్

ఐఎంఏ నగర శాఖకు నూతన కార్యవర్గం ఎంపిక



బీఎంఏ, ఐఎంఏ నూతన కార్యవర్గ సభ్యులు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెజవాడ మెడికల్ అసోసియేషన్ చైర్మన్‌గా డాక్టర్ మెహబూబ్ షేక్ నియమితులయ్యారు. ఆయనతో పాటు, మరో 30 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమించారు. గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఐఎంఏ, బీఎంఏలకు 2023-24 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ ప్రమోద్ చలసాని, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ పీవీ దుర్గారాణి, డాక్టర్ మహమ్మద్ ఒస్మాన్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ శివరామ్ అక్కినేని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు ఫైనాన్స్ సెక్రటరీగా డాక్టర్ వి. సురేష్, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ ఆర్. లోకమోహన్‌రావు, డాక్టర్ వాసు కర్లపూడిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్రకమిటీ సభ్యులు డాక్టర్ ఎం. రవీంద్రనాథ్, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ పి.అనిల్‌కుమార్, డాక్టర్ కోలా విజయశేఖర్, ప్రస్తుత ఐఎంఏ నగర శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎంఏ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల కేసులో ఎవరినీ ఉపేక్షించేది లేదు


ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల




మాట్లాడుతున్న ఏపీ ఐడీసీ చైర్ పర్సన్ బండి పుణ్యశీల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ అధినేత చంద్రబాబు ఘరానా స్కాంలు చేస్తే ఆ పార్టీ గల్లీ నేతలు తమ స్థాయిలో స్కాంలు చేశారని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014-19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు నగరంలో 6 వేల ఇళ్లకు అనుమతిస్తే 12 వేల మంది చేత డబ్బులు కట్టించుకుని దారుణ మోసానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఆదివారం భవానీపురంలోని ఎన్టీఆర్‌జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బండి పుణ్యశీల మాట్లాడారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా టీడీపీ నాయకుల మోసాలు ఆగలేదన్నారు. నగరంలో పేదలకు టిడ్కో గృహాలు ఇప్పిస్తామని చెప్పి టీడీపీ నేతలు రూ. 4 కోట్లు వసూలు చేశారని తెలిపారు. టిడ్కో ఇళ్లలో ఒక్కో ఫ్లోర్‌కు ఒక్కో రేటు నిర్ణయించి నగరానికి చెందిన 150 మంది పేదల నుంచి డబ్బులు వసూలు చేశారని చెప్పారు. పేదల నుంచి డబ్బులు వసూలు చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్లు ఇప్పించకపోగా, డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో 30 మంది పోలీసులను ఆశ్రయించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఘరానా మోసం వెలుగులోకి వచ్చిందన్నారు. పేదల నుంచి డబ్బులు వసూలు చేసిన కేసులో టీడీపీ మాజీ కార్పొరేటర్ కొట్టేటి హనుమంతరావు ప్రధాన సూత్రధారి అని ఆరోపించారు. ఇళ్ల పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేసిన కేసులో ఎంతటి వారు ఉన్నా వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చాలని రాష్ట్ర వ్యాప్తంగా 33 లక్షల మందికి ఉచితంగా ఇంటి స్థలం, ఇళ్లు ఇచ్చారన్నారు. కానీ టీడీపీ నాయకులు ఈ రకంగా పేదల ప్రజల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేయడాన్ని నగర ప్రజలు గమనించాలన్నారు. మోసపోయిన 150 మందికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామన్నారు. బాధితులు అధైర్యపడొద్దని సూచించారు. స్కాంలో హనుమంతరావుకు సహాయం చేసిన వారిని ఇరికించి ఆయన తప్పించుకుని తిరుగుతున్నాడన్నారు. కేసులో ప్రధాన సూత్రధారిపై చర్యలు తప్పవని, అరెస్ట్ తథ్యమన్నారు. టీడీపీ వారికి డబ్బు ఇచ్చి మోసపోయిన పేదలకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.

నాగాయలంకలో వివాహిత హత్య



దుర్గ (ఫైల్)



దుర్గ మృతదేహం

నాగాయలంక: వివాహితను కత్తితో పొడిచి దారుణంగా హతమార్చిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కథనం మేరకు.... మెయిన్ రోడ్డులోని ఓ హోటల్లో కూలీ పని చేస్తున్న యతిరాజుల దుర్గ (30) అనే వివాహితను ఓ యువకుడు కత్తితో డొక్కలో పొడిచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను దుర్గ భర్త ప్రకాష్, కుటుంబ సభ్యులు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించింది. మృతురాలి భర్త ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం గ్రామానికి చెందిన రేపల్లె హేమంత్ అనే వ్యక్తి ఆమె వెంట పడి వేధిస్తున్నట్లు నాగాయలంక పోలీస్‌స్టేషన్‌లో గత పది రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి దుర్గ హోటల్లో పనిచేస్తున్న సమయంలో హేమంత్ హఠాత్తుగా వెనుక వైపు గోడ దూకి వచ్చి కత్తితో పొడిచి పారిపోయాడని తెలిపారు. ఈ ఘటనపై రంగంలోకి దిగిన నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలపై విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వేదికపై కార్పొరేటర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్నే మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్ జగన్‌తోనే పేదలకు మేలు చేకూరుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలి అనే అంశంపై పార్టీ శ్రేణులు, గృహసారథులకు ప్రశాంతినగర్‌లోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం వచ్చే నెల 11వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నేరుగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించాలని సూచించారు. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తేడాల్ని ప్రజలకు తెలియజేసి అభిప్రాయాలు తెలుసుకోవాలని చెప్పారు. 2014లో 600కి పైగా హామీలను గుప్పించి మేనిఫెస్టోను మాయం చేసిన చంద్రబాబు 2024 ఎన్నికల్లో మళ్లీ బూటకపు హామీలతో వస్తున్నారని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా ఆపు బాబు నీ బూటకం–జగనన్నే మా నమ్మకం అనే అంశం పై విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య, గృహ నిర్మాణ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ప్రజావసరాలు తీర్చడమే లక్ష్యంగా ఎన్నో పథకాలు అమలుచేశారని చెప్పారు.

పార్టీలకు అతీతంగా పథకాలు..

ఎన్నికల సమయంలో ప్రకటించిన పథకాలను పార్టీలు, వర్గాలు, మతాలకు అతీతంగా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి తప్పక అవసరమన్నారు. పేదరికాన్ని పారదోలడం కోసం అక్షరాలా రెండున్నర లక్షల కోట్ల రూపాయల నిధులను వివిధ పథకాల ద్వారా రాష్ట్రంలోని నిరుపేదల ఖాతాలలో నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 33,940 మంది అక్కచెల్లెమ్మలకు రూ.88 కోట్ల 64 లక్షలు, సున్నా వడ్డీ పథకం ద్వారా 42,760 మందికి రూ.17 కోట్ల 26 లక్షలు, వైఎస్సార్ చేయూత ద్వారా 10,875 మందికి రూ.43 కోట్ల 38లక్షలు, అమ్మ ఒడి పథకం ద్వారా 28,334 మంది తల్లులకు రూ.118కోట్ల 98 లక్షలు, వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 2,583 మందికి రూ. 12 కోట్లు, ఈబీసీ నేస్తం ద్వారా 2,593 మందికి రూ. 6 కోట్ల81 లక్షలు నేరుగా ఆడపడుచుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. మొత్తంగా నాలుగేళ్లలో 1,37,244 మంది లబ్ధిదారులకు రూ.339.32 కోట్ల సంక్షేమాన్ని అందచేసినట్లు చెప్పారు. ఇటువంటి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ సారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మొదటి విజయం సెంట్రల్ నియోజకవర్గం నుంచే మొదలు కాబోతుందని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్నాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పుస్తక ప్రదర్శన, నృత్యం, సంగీతం, భగవద్గీత శ్లోకాలపై విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. గ్రంథాలయాధికారి రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌర గ్రంథాలయ శాఖ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రదర్శనలో విజ్ఞానం, ఆధ్యాత్మికం, జాతీయ నాయకుల చరిత్రలు, శాస్త్రజ్ఞుల జీవిత చరిత్రలు, కథలు, కవితలు, ఎన్‌సైక్లోపిడియా నిఘంటువులు మొదలైన అన్ని రకాల పుస్తకాలు ప్రదర్శించామన్నారు. విద్యార్థుల చేత కథల పుస్తకాల చదివించారు. సిబ్బంది జె.శంకర్, కుమార్, ఫణి బాబు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన నాటక ప్రదర్శన



విజయవాడకల్చరల్: ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన భూగోళం నాటకం సందేశాత్మకంగా సాగింది. నేటి ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు మాయం అవుతున్నాయని ఆర్థిక సంబంధాలు కుటుంబ వ్యవస్థను పట్టించుకోవడం లేని మానవ సంబంధాలు కాపాడుకోవాలనే సందేశంతో నాటిక సాగుతుంది. రచన మెదలి సంజీవి, దర్శకత్వం వేంపాటి రమేష్, బాయన శ్రీనివాసరావు, వేంపాటి రమేష్, బొర్రా నారాయణ, రాధ, రాజేశ్వరి నటించారు. కార్యక్రమాలను ప్రారంభించిన గ్రంథాలయం అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ.. గ్రంథాలను రూ.25 లక్షలతో ఆధునీకరించినట్లు తెలిపారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీర బ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 270 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య చంద్రబొట్ల, ట్రస్టీ తట్టి అర్జునరావు పాల్గొన్నారు.

19 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంలోడు లారీని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

పెనమలూరు: కానూరులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కొత్త ఆటోనగర్‌లో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు చేసి లారీని పట్టుకున్నారు. లారీలో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ వెంకటశివయ్య హెచ్చరించారు.

పాలిక్లినిక్ రోడ్డులో సైకిల్ ట్రాక్ ఏర్పాటు



రోడ్డుపై అమర్చిన ప్లేవర్ బ్లాక్స్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నగరంలోని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. మదర్ థెరిస్సా జంక్షన్ నుంచి బెంజ్ సర్కిల్ వరకు రోడ్డునకు ఒక వైపున ఈ ట్రాక్ నిర్మాణ పనులను ఇప్పటికే ప్రారంభించారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు మార్జిన్స్‌ను అందంగా ముస్తాబు చేయడానికి నగరపాలకసంస్థ కోటి రూపాయలను కేటాయించింది. పనుల్లో భాగంగా రోడ్డుకు ఒక వైపున ప్లేవర్ బ్లాక్స్ ఏర్పాటు చేసి రోడ్డును అందంగా ముస్తాబు చేశారు. ఇప్పుడు రోడ్డునకు మరో వైపున సైకిల్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు మార్జిన్స్‌ను తవ్వి చదును చేయడంతో పాటుగా ఆ ప్రాంతాన్ని ట్రాక్ నిర్మాణానికి అనుకూలంగా చేసే పనులు జరుగుతున్నాయి. రోడ్డును కొన్ని ప్రాంతాల్లో చదును చేయడంతో చిప్స్ వేసి ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. సైకిల్ ట్రాక్ నిర్మాణం పూర్తి అయిన తర్వాత ద్విచక్ర వాహనాలు, మరే ఇతర వాహనాలు సైకిల్ ట్రాక్ పైకి రాకుండా చిన్న పాటి బారికేడ్లు కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే ఈ సైకిల్ ట్రాక్ నిర్మాణ పనులు పూర్తి అయ్యి పర్యావరణ మిత్రులకు అందుబాటులోకి రానుంది.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసా నంద సరస్వతి తెలిపారు. అయోధ్యనగర్ క్షత్రియ భవనంలో ఆదివారం హిందూ ధార్మిక పరిషత్ వ్యవస్థాపకులు బుద్దరాజు శివాజీ రాజా ఆధ్వర్యాన నిర్వహించిన విలేకర్ల విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు హిందూ దేవాలయాలు, ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాగుండాలన్నదే హిందూ మతం సారాంశం అన్నారు. శివస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పనిచేసే వారికే దేవాలయాల ట్రస్ట్ బోర్డులలో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా హిందువులు సంఘటితంగా ఉండి హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని తీర్మానం చేశారు. విశ్రాంత సీబీఐ మాజీ డైరెక్టర్ నాగశ్వర రావు, హిందూ సంఘాలు ఐక్య వేదిక అధ్యక్షుడులలిత్ కుమార్, రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షుడు హమార ప్రసాద్, హిందూ సంఘాల నాయకులు రమణ కాసారపు, కళ్యాణ్ కుమార్ చెట్లపల్లి, వీవీఆర్ కృష్ణంరాజు, శ్రీనివాస్ యాదవ్, ఫణీంద్ర, పీవీ సతీష్, వరప్రసాద్ పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు, విశ్రాంత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ఉండాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



బహుమతి అందజేస్తున్న జస్టిస్ మన్మథరావు, డాక్టర్ ఎంజే నాయుడు, మాధవి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు అన్నారు. నగరంలో ఆదివారం జరిగిన ఎంజే నాయుడు హాస్పిటల్ 37వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జస్టిస్ మాట్లాడుతూ మనిషిలో సానుకూలతత్వం అనేది ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల బాలల్లో ఊబకాయం అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. డాక్టర్ ఎంజే నాయుడు పలువురికి వైద్య పరీక్షలు చేసి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మాధవీనాయుడు, వైద్యులు వంశీకృష్ణ, రవితేజ, ఆస్పత్రి ఫౌండేషన్ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అందిన ఫిర్యాదుల మేరకు ఆదివారం పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేనర్‌పేట గండమాల అచ్చమ్మ వీధికి చెందిన పోతిన నందినిని ఏడాది కిందట అప్పారావుపేటకు చెందిన పోతిన దుర్గాప్రసాద్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయితే పెళ్లయినప్పటి నుంచి నందినికి అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. మద్యానికి బానిసైన దుర్గాప్రసాద్ కోడిపందేలు ఆడుతున్నాడు. నందిని ఆడపడుచు నాగలక్ష్మి, దుర్గాప్రసాద్ మేనత్త లక్ష్మిలు శారీరకంగా వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం కోసం..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అదనపు కట్నం తీసుకురావాలని వివాహితను వేధింపులకు గురి చేయడంపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతరాజరాజేశ్వరిపేటకు చెందిన నూకతోటి మల్లేశ్వరికి గతేడాది నవంబర్‌లో పెజ్జోనిపేటకు చెందిన రామారావుకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ కట్నం కానుకలను అందించగా, కొంత కాలంగా రామారావు భార్యను పుట్టింటికి వెళ్లి డబ్బులు తీసుకురావాలని వేధించ సాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



రైల్వేస్టేషన్ వద్ద అవగాహన కల్పిస్తున్న రూట్స్ ఫౌండేషన్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరమని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయభాస్కర్ అన్నారు. రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మహిళా సిబ్బందికి బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ పింక్ రిబ్బన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. రొమ్ములో గడ్డ, వాపు, కణితి, ఎర్రబడటం వంటి లక్షణాలు ఉంటే మమ్మోగ్రామ్ చేయించుకోవాలని సూచించారు. రొమ్మును సెల్ఫ్ చెక్ చేసుకోవడం ద్వారా లక్షణాలను గుర్తించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రూట్స్ సభ్యులు సికినం శ్రీనివాస్, వెంకట రమణ, సంజయ్, విజయలక్ష్మి, కామేశ్వరి, సావిత్రి, డాక్టర్ మనోజ్, పున్నారావు, శ్రావ్య పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం వస్తుందని పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ తెలిపారు. సింగ్‌నగర్‌లోని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యాలయం వద్ద షేక్ చిన్నభాష అనే దివ్యాంగుడికి ఆదివారం ట్రై సైకిల్ పంపిణీ చేశారు. రవికుమార్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముస్లిం మైనార్టీ ప్రజల హక్కుల సాధన కోసం ఆజాద్ ముస్లిం కమిటీ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శనీయమని చెప్పారు. ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో కేవలం ముస్లిం మైనార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడడమే కాకుండా నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

ఓర్పు బలహీనత కాదు.. బలమైన లక్షణం



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఓర్పుతో ఉండడం బలహీనత కాదు... అది బలమైన లక్షణమని, దానిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని యెహోవా సాక్షుల రీజినల్ ప్రతినిధి కె.వినోద్‌కుమార్ అన్నారు. విజయవాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యెహోవా సాక్షుల ఆధ్వర్యంలో ఓర్పు చూపించండి అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు విజయవాడ, గుంటూరు, ఏలూరు, ఒంగోలు, తెలంగాణ కోదాడ నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేవలం ఓర్పుద్వారానే విజయం సాధిస్తామన్నారు. ఇది విజయానికి తొలిమెట్టు అని అన్నారు. ప్రస్తుతం ఓర్పు లేకపోవడం వల్లనే సమస్యలు వస్తున్నాయన్నారు. కుటుంబాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఓర్పు గురించి ప్రతి చోట అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్య పరుస్తున్నామన్నారు. కొన్ని అంశాలను వీడియో రూపంలో ప్రదర్శించి, వివరించారు.

కరాటేలో 19 మంది విద్యార్థులకు బెల్ట్ ప్రమోషన్లు



విద్యార్థులతో శ్రీనివాసులు, హర్ష తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జేకే గోజురియో కరాటే అకాడమీ సత్యనారాయణపురం, రామకృష్ణాపురం బ్రాంచిలకు చెందిన విద్యార్థులకు విద్యాధరపురంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం బెల్ట్ ప్రమోషన్ల పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొత్తం 19 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్ వరకు ప్రమోట్ అయ్యారు. ఈ సందర్భంగా అకాడమీ వ్యవస్థాపకుడు జే శ్రీనివాసులు వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆయన ప్రమోట్ అయిన విద్యార్థులను అభినందిస్తూ కరాటే విద్య అనేది విద్యార్థులకు శారీరక దారుఢ్యంతోపాటు ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. సాధారణ చదువుకు ఎటువంటి ఆటంకం లేకుండా ఖాళీ సమయాల్లోనే కరాటే విద్యను నేర్చుకోవచ్చని చెప్పారు. వివిధ రకాల బెల్ట్‌లు పొందిన విద్యార్థులు మరింత శిక్షణ తీసుకుని వారి లక్ష్యానికి చేరుకోవాలన్నారు. అదే విధంగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అకాడమీ సెక్రటరీ జే హరనాథ్, సత్యనారాయణపురం బ్రాంచి కోచ్ పీవీకేఎస్ హర్ష, మహేష్, సాయికుమార్, నరసింహ, మధు, నవీన్ ఉన్నారు.

సేవలతో సమాజంలో కీర్తి ప్రతిష్టలు

పాయకాపురం(విజయవాడరూరల్): నాయకులు, సభ్యులతో పెంపొందించుకునే ఆత్మీయ బంధమే కలకాలం నిలిచిపోతుందని, మనం చేసే మంచి పనులు, సేవలు, మన్ననలు హృదయాల్లో స్థానం పొందుతాయని వాసవి క్లబ్‌ల మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హాజరత్తయ్య గుప్తా అన్నారు. రాజీవ్‌నగర్‌లోని వాసవీభవన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీన జరిగే జిల్లా కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు.

పరిశుభ్రతపై అవగాహన

ఉయ్యూరు: స్వచ్ఛ సేవతో పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తున్నామని లయన్స్ డిస్ట్రిక్ట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సేవ కార్యక్రమం ఆదివారం ఉయ్యూరు పట్టణంలో నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధులను ఊడ్చి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్, డాక్టర్ రావుల పల్లి సుధాకర్, సీహెచ్ కుటుంబ రాజు, ఎంకే బాబు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పటమట(విజయవాడతూర్పు): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా.. ఘర్షణలు, గంజాయి వంటి సంఘ వ్యతిరేక పనుల్లో చేపట్టినా ఉపేక్షించేది లేదని రౌడీషీటర్లను పటమట సీఐ కాశీవిశ్వనాథ్ హెచ్చరించారు. ఆదివారం పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లందరూ తప్పనిసరిగా ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. వివిధ కారణాలతో గైర్హాజరై, దందాలు చేస్తే సహించేంది లేదని చర్యలు తప్పవన్నారు. నగర బహిష్కరణ గురవుతారని, నేర ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే అర్బన్ కమిటీ, ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీయూడబ్ల్యూజే అర్బన్ కమిటీ, ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఏపీయూడబ్ల్యూజే అర్బన్ అధ్యక్షులు చావా రవి అధ్యక్షతన ప్రెస్ క్లబ్ లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూనియన్ అర్బన్ యూనిట్, ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కమిటీ అధ్యక్షులుగా చావా రవి, కార్యదర్శిగా ఆర్‌ఎస్ కిరణ్(వసంత్), కోశాధికారిగా పీవీ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కంచర్ల జయరాజ్, కార్యదర్శిగా డి.నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర నాయకులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావును సత్కరించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

గన్నవరంరూరల్: విజ్ఞాన సాధనకు పుస్తక పఠనం ఒక్కటే మార్గమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. ఆదివారం మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయానికి నీతి కథలు, స్టోరీ పుస్తకాలను అందజేశారు. లైబ్రేరియన్ కె.కృపానందం అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఎంతో కృషి చేశారన్నారు. వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులలోని సృజనను వెలికితీయడంతో పాటు, పుస్తక పఠనం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారన్నారు. పార్థసారథి, వెంకట్రామయ్య, సుబ్బారావు, సీతారామయ్య, నాగభూషణం ఉన్నారు.



తొలిసారి ఇద్దరికి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' పురస్కారం

ప్రతి ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల్లో నుంచి ఒకరికి మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (ఎంవీపీ) పురస్కారం అందజేస్తారు. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో తొలిసారి ఈ 'ఎంవీపీ' అవార్డును ప్రవేశపెట్టారు. గత ఆరు ఆసియా క్రీడల్లో ఒక్కరిని మాత్రమే ఈ పురస్కారం కోసం ఎంపిక చేస్తుండగా... ఈ క్రీడల్లో తొలిసారి ఇద్దరికి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డు దక్కడం విశేషం. ఆదివారం హాంగ్జౌలో ముగిసిన 19వ ఆసియా క్రీడలకు సంబంధించి 'ఎంవీపీ' అవార్డు చైనా స్విమ్మర్లు జాంగ్ యుఫె, కిన్ హైయాంగ్‌లకు సంయుక్తంగా లభించింది. 25 ఏళ్ల మహిళా స్విమ్మర్ జాంగ్ యుఫె హాంగ్జౌ ఆసియా క్రీడల్లో ఏకంగా ఆరు స్వర్ణ పతకాలు సాధించింది. పురుషుల స్విమ్మింగ్‌లో 24 ఏళ్ల కిన్ హైయాంగ్ ఐదు పసిడి పతకాలు గెలిచాడు. బ్యాడ్మింటన్ దిగ్గజం లిన్ డాన్ (2010 గ్వాంగ్‌జౌ) తర్వాత ఆసియా క్రీడల్లో 'ఎంవీపీ' అవార్డు గెల్చుకున్న చైనా ప్లేయర్లుగా జాంగ్ యుఫె, కిన్ హైయాంగ్ గుర్తింపు పొందారు.



నగోయాలో కలుద్దాం!


- ముగిసిన హాంగ్జౌ ఆసియా క్రీడలు
- వరుసగా 11వసారి పతకాల పట్టికలో చైనాయే 'టాప్'
- మొదటిసారి స్వర్ణాల్లో 'డబుల్ సెంచరీ' దాటిన చైనా
- 2026 ఆసియా క్రీడలకు జపాన్‌లోని నగోయా నగరం ఆతిథ్యం



హాంగ్జౌ: గత 16 రోజులుగా క్రీడాభిమానులను ఆద్యంతం అలరించిన ఆసియా క్రీడా సంరంభానికి ఆదివారం తెర పడింది. సెప్టెంబర్ 23న చైనాలోని హాంగ్జౌ నగరంలో అట్టహాసంగా ప్రారంభమైన 19వ ఆసియా క్రీడలు అక్టోబర్ 8న అంతే ఘనంగా ముగిశాయి. 80 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం కలిగిన 'బిగ్ లోటస్' స్టేడియంలో 75 నిమిషాల పాటు ముగింపు వేడుకలు జరిగాయి. 45 దేశాలకు చెందిన క్రీడాకారులు మైదానంలోకి రాగా... చైనా సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. చైనా ప్రీమియర్ లీ కియాంగ్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఓసీఏ) తాత్కాలిక అధ్యక్షుడు, భారత మాజీ దిగ్గజ షూటర్ రణ్‌ధీర్ సింగ్ 19వ ఆసియా క్రీడలు ముగిశాయని అధికారికంగా ప్రకటించారు. 'గత 16 రోజుల్లో మనమంతా ఎన్నో చిరస్మరణీయ ఘట్టాలను తిలకించాం. హాంగ్జౌకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. అద్భుతంగా ఆతిథ్యం ఇచ్చిన హాంగ్జౌను ఆసియానే కాకుండా మొత్తం ప్రపంచం గుర్తు పెట్టుకుంటుంది. ఈ సందర్భంగా చైనా ప్రభుత్వానికి, చైనా ఒలింపిక్ కమిటీకి, నగర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని రణ్‌ధీర్ సింగ్ వ్యాఖ్యానించారు. తదుపరి 20వ ఆసియా క్రీడలు 2026లో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచి రాష్ట్ర రాజధాని నగోయా నగరంలో జరుగుతాయి. ముగింపు వేడుకల్లో ఐచి రాష్ట్ర గవర్నర్ ఒమురా హిడెకి, నగోయా నగర డిప్యూటీ మేయర్ నకాటా హిడియో ఆసియా క్రీడల జ్యోతితోపాటు ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ పతాకాన్ని అందుకున్నారు.

- ముగింపు వేడుకల్లో భారత బృందానికి స్వర్ణ పతకం నెగ్గిన పురుషుల హాకీ జట్టు గోల్‌కీపర్ శ్రీజేశ్ పతాకధారిగా వ్యవహరించాడు. చాలా మంది భారత క్రీడాకారులు ఇప్పటికే స్వదేశానికి చేరుకోగా, ముగింపు వేడుకల్లో వంద మంది వరకు క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.
- మొత్తం 45 దేశాల నుంచి 40 క్రీడాంశాల్లో 12,407 మంది క్రీడాకారులు హాంగ్జౌలో పోటీపడ్డారని నిర్వాహకులు తెలిపారు.
- మూడోసారి ఆసియా క్రీడలకు ఆతిథ్యమిచ్చిన చైనా మరోసారి తమ ఆధిపత్యం చాటుకొని హాంగ్జౌలోనూ 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది. చైనా 201 స్వర్ణాలు, 111 రజతాలు, 71 కాంస్యాలతో మొత్తం 383 పతకాలు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. 188 పతకాలతో జపాన్ రెండో స్థానంలో, 190 పతకాలతో దక్షిణ కొరియా మూడో స్థానంలో, 107 పతకాలతో భారత్ నాలుగో స్థానంలో నిలిచాయి.









ఓవరాల్‌గా దక్షిణ కొరియా కంటే జపాన్ రెండు తక్కువ పతకాలు గెలిచినా... కొరియాకంటే ఎక్కువ స్వర్ణ పతకాలు గెలిచినందుకు జపాన్ రెండో ర్యాంక్‌లో నిలిచింది.

- హాంగ్జౌ ఆసియా క్రీడల్లో 13 కొత్త ప్రపంచ రికార్డులు, 26 ఆసియా రికార్డులు, 97 ఆసియా క్రీడల రికార్డులు నమోదయ్యాయి.





పతకాల పట్టిక

ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	201	111	71	383
2	జపాన్	52	67	69	188
3	ద. కొరియా	42	59	89	190
4	భారత్	28	38	41	107
5	ఉజ్బెకిస్తాన్	22	18	31	71
6	చైనీస్ తైపీ	19	20	28	67
7	ఇరాన్	13	21	20	54
8	థాయ్‌లాండ్	12	14	32	58
9	బహ్రెయిన్	12	3	5	20
10	ఉ. కొరియా	11	18	10	39
11	కజకిస్తాన్	10	22	38	80
12	హాంకాంగ్	8	16	29	53
13	ఇండోనేసియా	7	11	18	36
14	మలేసియా	6	8	18	32
15	ఖతర్	5	6	3	14
16	యూఏఈ	5	5	10	20
17	ఫిలిప్పీన్స్	4	2	12	18
18	కిర్గిస్తాన్	4	2	9	17
19	సౌదీ అరేబియా	4	2	4	10
20	సింగపూర్	3	6	7	16
21	వియత్నాం	3	5	19	27
22	మంగోలియా	3	5	13	21
23	కువైట్	3	4	4	11
24	తజికిస్తాన్	2	1	4	7
25	మకావు	1	3	2	6
26	శ్రీలంక	1	2	2	5
27	మయన్మార్	1	0	2	3
28	జోర్డాన్	0	5	4	9
29	తుర్క్‌మెనిస్తాన్	0	1	6	7
30	అఫ్గానిస్తాన్	0	1	4	5
31	పాకిస్తాన్	0	1	2	3
32	బ్రూనై	0	1	1	2
32	నేపాల్	0	1	1	2
32	ఒమన్	0	1	1	2
35	ఇరాక్	0	0	3	3
35	లావోస్	0	0	3	3
37	బంగ్లాదేశ్	0	0	2	2
38	కంబోడియా	0	0	1	1
38	లెబనాన్	0	0	1	1
38	పాలస్తీనా	0	0	1	1
38	సిరియా	0	0	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. ర్యాంక్‌ను గెలిచిన స్వర్ణ, రజత, కాంస్య పతకాల ఆధారంగా వర్గీకరించారు.

41 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో మొత్తం 45 దేశాలు పాల్గొన్నాయి. ఇందులో 41 దేశాలు కనీసం ఒక్క పతకమైనా సాధించాయి.

4 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో ఒక్క పతకం కూడా నెగ్గని దేశాలు (భూటాన్, ఈస్ట్ తిమోర్, మాల్దీవులు, యెమెన్).

2 తొలిసారి బ్రూనై, ఒమన్ దేశాలు ఆసియా క్రీడల చరిత్రలో రజత పతకాలు గెలిచాయి.



4 ఒకే ఆసియా క్రీడల్లో 100 పతకాల మైలురాయిని దాటిన నాలుగో దేశంగా భారత్ గుర్తింపు పొందింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా ముందే ఈ జాబితాలో ఉన్నాయి.

201 తాజా ఆసియా క్రీడల్లో చైనా గెలిచిన స్వర్ణ పతకాలు. ఈ క్రీడల చరిత్రలో తొలిసారి పసిడి పతకాల్లో 200 మైలురాయిని దాటిన తొలి దేశంగా చైనా నిలిచింది. 2010 గ్వాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా అత్యధికంగా 199 స్వర్ణ పతకాలు గెలిచింది.

11 వరుసగా పదకొండోసారి ఆసియా క్రీడల పతకాల పట్టికలో చైనా 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది. తొలిసారి చైనా 1982 న్యూఢిల్లీ ఆసియా క్రీడల్లో తొలి స్థానం దక్కించుకుంది. అప్పటి నుంచి చైనా పతకాల పట్టికలో తన నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటోంది.

9 వరుసగా తొమ్మిదోసారి ఆసియా క్రీడల్లో చైనా 100 అంతకంటే ఎక్కువ స్వర్ణ పతకాలు సాధించింది. 1990 బీజింగ్ ఆసియా క్రీడల్లో చైనా స్వర్ణాల్లో తొలిసారి 'సెంచరీ' నమోదు చేసింది.

2036 ఒలింపిక్స్‌కు భారత్ బిడ్ వేయాలి: పీటీ ఉష

హాంగ్జౌ: ఆసియా క్రీడల చరిత్రలోనే భారత క్రీడా బృందం ఈసారి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, అత్యధికంగా 107 పతకాలు సాధించడంపట్ల భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష ఆనందం వ్యక్తం చేసింది. 'ఆసియా క్రీడల్లో రికార్డుస్థాయి ప్రదర్శన తర్వాత భారత క్రీడాకారులు వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌పై దృష్టి సారించాలి. మన క్రీడాకారులు, కోచ్‌లు, జాతీయ క్రీడా సమాఖ్యలు శ్రమిస్తే పారిస్ ఒలింపిక్స్‌లో మన పతకాల సంఖ్య కచ్చితంగా రెండంకెలు దాటుతుంది. ఇక మనం కూడా ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం బిడ్ వేయాల్సిన సమయం ఆసన్నమైంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ పోటీపడాలి' అని 59 ఏళ్ల పీటీ ఉష వ్యాఖ్యానించింది. కేవలం ఒకట్రెండు క్రీడాంశాల్లో కాకుండా వేర్వేరు క్రీడాంశాల్లో భారత్‌కు పతకాలు రావడంపట్ల రాజ్యసభ సభ్యురాలైన ఉష ఆనందాన్ని వ్యక్తం చేసింది.



1/2, 2/2, 3/2... 2 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్లు... ఆస్ట్రేలియాపై 200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌కు లభించిన ఆరంభమిది... చేపాక్ మైదానంలో అంతా నిశ్శబ్దం... ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ప్రమాద ఘంటిక వినిపించింది. అయితే ఎప్పటిలాగే కోహ్లి బాధ్యతను తనపై వేసుకోగా కేఎల్ రాహుల్ కూడా తగిన విధంగా సహకరించాడు. ఆసీస్ బౌలర్లకు ఆపై అవకాశం ఇవ్వకుండా సాగిపోయిన ఈ జోడీ చివరకు భారత్‌ను విజయతీరం చేర్చింది. అంతకుముందు పటిష్ట ఆసీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసి భారత బౌలర్లు పైచేయి సాధించారు. నెమ్మదైన చెన్నై పిచ్‌పై మన స్పిన్నర్లను ఆడలేక ప్రత్యర్థి చేతులెత్తేయడంతో టీమిండియా గెలిచేందుకు పునాది పడింది.

తడబడినా... గెలుపు దక్కింది

- ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం
- ఆస్ట్రేలియాపై 6 వికెట్లతో విజయం
- రాణించిన రాహుల్, కోహ్లి
- కట్టడి చేసిన జడేజా, కుల్దీప్
- తర్వాతి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌తో భారత్ 'ఢీ'



చెన్నై: సొంతగడ్డపై వన్డే ప్రపంచ కప్ వేటలో భారత్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 199 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (71 బంతుల్లో 46; 5 ఫోర్లు), డేవిడ్ వార్నర్ (52 బంతుల్లో 41; 6 ఫోర్లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. అనంతరం భారత్ 41.2 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేఎల్ రాహుల్ (115 బంతుల్లో 97 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (116 బంతుల్లో 85; 6 ఫోర్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 35.4 ఓవర్లలో 165 పరుగులు జోడించారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను బుధవారం ఢిల్లీలో అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది.

సమష్టి వైఫల్యం...

ఓపెనర్ మిచెల్ మార్ష్ (0)ను తన రెండో ఓవర్లోనే వెనక్కి పంపి బుమ్రా భారత్‌కు శుభారంభం అందించగా... వార్నర్, స్మిత్ కలిసి ఆసీస్‌ను ఆదుకున్నారు. 10 ఓవర్లలో స్కోరు 43 పరుగులకు చేరింది. రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం తర్వాత భారత స్పిన్నర్ల జోరు మొదలైంది. వికెట్లు తీయడంతో పాటు పరుగులు కూడా ఇవ్వకుండా ఆసీస్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. కుల్దీప్ చక్కటి బంతితో వార్నర్‌ను అవుట్ చేసి ఈ జోడీని విడదీయగా, తర్వాతి 3 వికెట్లు జడేజా ఖాతాలో చేరాయి. స్మిత్‌ను బౌల్డ్ చేసిన జడేజా... ఒకే ఓవర్లో లబుషేన్ (27), క్యారీ (0)లను వెనక్కి పంపాడు. ఒకదశలో 73 బంతుల పాటు ఆసీస్ బౌండరీ కొట్టలేకపోయింది! కీలక బ్యాటర్ మ్యాక్స్‌వెల్ (15)ను కుల్దీప్ బౌల్డ్ చేయగా, అదే స్కోరు వద్ద గ్రీన్ (8) వికెట్ అశ్విన్ ఖాతాలో చేరింది. అయితే మిచెల్ స్టార్క్ (35 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్ ఆసీస్‌ను 200 పరుగులకు చేరువగా తీసుకొచ్చింది. కమిన్స్ (15), జంపా (6), హాజల్‌వుడ్ (1 నాటౌట్)లతో చివరి మూడు వికెట్లకు కలిపి స్టార్క్ 59 పరుగులు జోడించడం విశేషం.

భారీ భాగస్వామ్యం...

ఛేదనలో భారత జట్టు అనూహ్య రీతిలో తడబడింది. 'డెంగీ'తో శుబ్‌మన్ గిల్ మ్యాచ్‌కు దూరం కావడంతో ఓపెనర్‌గా అవకాశం దక్కించుకున్న ఇషాన్ కిషన్ (0) దూరంగా వెళుతున్న బంతిని వెంటాడి అవుట్ కాగా, హాజల్‌వుడ్ వేసిన చక్కటి బంతికి రోహిత్ శర్మ (0) వికెట్ల ముందు దొరికిపోయాడు. రోహిత్ రివ్యూ చేసినా లాభం లేకపోయింది. ఆ వెంటనే శ్రేయస్ అయ్యర్ (0) నిర్లక్ష్యపు షాట్‌తో పెవిలియన్ చేరాడు. 19 ఏళ్ల తర్వాత వన్డేల్లో భారత ఓపెనర్లిద్దరు డకౌట్ కాగా, టాప్-4లో ముగ్గురు డకౌట్ కావడం వన్డేల్లో భారత్‌కు ఇదే మొదటిసారి. వీరిద్దరి భాగస్వామ్యంలో జట్టు కోలుకుంది. 10 ఓవర్లలో భారత్ స్కోరు 27/3. లక్ష్యం మరీ పెద్దది కాకపోవడంతో కోహ్లి, రాహుల్ ఎలాంటి సాహసాలకు పోకుండా చక్కటి సమన్వయంతో నెమ్మదిగా పరుగులు రాబడుతూ ఇన్నింగ్స్‌ను నడిపించారు. 75 బంతుల్లో కోహ్లి అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, భారత్ స్కోరు కూడా 25.3 ఓవర్లలో సరిగ్గా వంద పరుగులకు చేరింది. ఆ తర్వాత 72 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఈ జోడీని విడదీయడంలో ఆసీస్ బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. సెంచరీ దిశగా వెళుతున్న కోహ్లి చివరకు విజయానికి 33 పరుగుల దూరంలో వెనుదిరిగాడు. అయితే హార్దిక్ పాండ్యా (11 నాటౌట్)తో కలిసి రాహుల్ ఆట ముగించాడు. గెలిచేందుకు ఐదు పరుగులు అవసరం కాగా, సిక్సర్ కొట్టిన రాహుల్‌కు కూడా సెంచరీ చేసే అవకాశం చేజారింది.



ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X నెదర్లాండ్స్
వేదిక: హైదరాబాద్
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆ క్యాచ్ పట్టి ఉంటే...

భారత్ స్కోరు 20/3... ఆసీస్ బౌలర్లు చెలరేగిపోతున్నారు. హాజల్‌వుడ్ వేసిన బంతిని కోహ్లి పుల్ చేయబోగా బంతి లెగ్ సైడ్ గాల్లోకి లేచింది. కీపర్ క్యారీ, మిడ్ వికెట్ నుంచి మార్ష్ ముందుకు దూసుకొచ్చారు. క్యారీ వెనక్కి తగ్గగా, క్యాచ్‌ను అందుకోగలిగే స్థితిలో ఉండి కూడా మార్ష్ చేతుల్లో పడిన బంతిని వదిలేశాడు. ఆ సమయంలో కోహ్లి స్కోరు 12. ఆ క్యాచ్ మార్ష్ పట్టి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో!



స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి అండ్ బి) కుల్దీప్ 41; మార్ష్ (సి) కోహ్లి (బి) బుమ్రా 0; స్మిత్ (బి) జడేజా 46; లబుషేన్ (సి) రాహుల్ (బి) జడేజా 27; మ్యాక్స్‌వెల్ (బి) కుల్దీప్ 15; క్యారీ (ఎల్బీ) (బి) జడేజా 0; గ్రీన్ (సి) పాండ్యా (బి) అశ్విన్ 8; కమిన్స్ (సి) అయ్యర్ (బి) బుమ్రా 15; స్టార్క్ (సి) అయ్యర్ (బి) సిరాజ్ 28; జంపా (సి) కోహ్లి (బి) పాండ్యా 6; హాజల్‌వుడ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 199. వికెట్ల పతనం:** 1-5, 2-74, 3-110, 4-119, 5-119, 6-140, 7-140, 8-165, 9-189, 10-199. **బౌలింగ్:** బుమ్రా 10-0-35-2, సిరాజ్ 6.3-1-26-1, పాండ్యా 3-0-28-1, అశ్విన్ 10-1-34-1, కుల్దీప్ 10-0-42-2, జడేజా 10-2-28-3.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) హాజల్‌వుడ్ 0; ఇషాన్ కిషన్ (సి) గ్రీన్ (బి) స్టార్క్ 0; కోహ్లి (సి) లబుషేన్ (బి) హాజల్‌వుడ్ 85; అయ్యర్ (సి) వార్నర్ (బి) హాజల్‌వుడ్ 0; రాహుల్ (నాటౌట్) 97; పాండ్యా (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (41.2 ఓవర్లలో 4 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-2, 4-167. **బౌలింగ్:** స్టార్క్ 8-0-31-1, హాజల్‌వుడ్ 9-1-38-3, కమిన్స్ 6.2-0-33-0, మ్యాక్స్‌వెల్ 8-0-33-0, గ్రీన్ 2-0-11-0, జంపా 8-0-53-0.



29 బంతుల్లోనే సెంచరీ

'లిస్ట్-ఎ' క్రికెట్‌లో ప్రపంచ రికార్డు

అడిలైడ్: సౌత్ ఆస్ట్రేలియా క్రికెటర్ జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ సంచలన బ్యాటింగ్ ప్రదర్శనతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా దేశవాళీ వన్డే టోర్నీ 'మార్ష్ కప్'లో టాస్మేనియాతో జరిగిన మ్యాచ్‌లో ఫ్రేజర్ 29 బంతుల్లోనే సెంచరీ నమోదు చేశాడు. 'లిస్ట్-ఎ' క్రికెట్ (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు కలిపి)లో ఇది ఫాస్టెస్ట్ సెంచరీగా నమోదైంది. 2015లో వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాటర్ ఏబీ డివిలియర్స్ 31 బంతుల్లో శతకం బాదాడు. ఇప్పుడు ఆ రికార్డును 21 ఏళ్ల ఫ్రేజర్ బద్దలు కొట్టాడు. కరేన్ రోల్టన్ ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి 18 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 53 పరుగులు చేసిన ఫ్రేజర్... మరో 11 బంతుల్లోనే సెంచరీని అందుకున్నాడు. ఇన్నింగ్స్ 9వ ఓవర్లోనే వచ్చిన అతని శతకంలో 6 ఫోర్లు, 12 సిక్సర్లు ఉన్నాయి. చివరకు 38 బంతుల్లో 10 ఫోర్లు, 13 సిక్సర్లతో 125 పరుగులు చేసి అతను అవుటయ్యాడు. ఫ్రేజర్ రికార్డు కొట్టినా చివరకు టాస్మేనియానే గెలిచింది. 436 లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌత్ ఆస్ట్రేలియా 398 పరుగులకు ఆలౌటైంది.

'కివీస్ తమ స్థాయిని చూపించింది'

కృష్ణమాచారి శ్రీకాంత్

తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై సాధించిన ఘనవిజయం కారణంగా న్యూజిలాండ్ గురించి ఇప్పుడు ఇతర టీమ్‌ల దృష్టి కోణం మారి ఉంటుంది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్‌ను కివీస్ దెబ్బకొట్టింది. వేగంగా లక్ష్యం చేరిన ఆ జట్టు గెలుపుతో పాటు మెరుగైన రన్‌రేట్‌ను కూడా సాధించింది. ఇలాంటి పెద్ద టోర్నీల్లో సెమీస్ చేరేందుకు రన్‌రేట్ కూడా కీలకంగా మారుతుంది. తర్వాతి మ్యాచ్‌లో కివీస్‌కు నెదర్లాండ్స్ పోటీనిచ్చే అవకాశం కనిపించడం లేదు. పాకిస్తాన్‌తో మ్యాచ్‌నూ మెరుగ్గానే ఆరంభించినా 'డచ్' దానిని నిలబెట్టుకోలేకపోయింది. డి లీడ్ అద్భుతంగా ఆడినా ఇలాంటి మ్యాచ్‌లో ఒకరి కంటే ఎక్కువ మంది మంచి ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో కాన్వే, రచిన్ అదే చూపించారు. కాన్వే ఐపీఎల్‌లో ఇప్పటికే సత్తా చాటగా, రచిన్ కొత్తగా వచ్చాడు. రాహుల్, సచిన్ పేర్లను కలిపి పెట్టుకున్న అతను వారిద్దరు గర్వపడేలా ఆడాడు. అతని బ్యాటింగ్‌లో రవీంద్ర జడేజా పోలికలు కనిపిస్తున్నాయి. అతనిలాగే ఇతనూ లెఫ్టార్మ్ స్పిన్నరే. ముగ్గురు టాప్ ఆటగాళ్లు కలగలిసిన వ్యక్తి అంటే అతని ఆట కూడా అంతే స్థాయిలో ఉండాలి కదా. భారతీయ మూలాలు ఉన్న రచిన్ ఆట శైలి కూడా సగటు న్యూజిలాండర్‌లా లేదు. చక్కటి టైమింగ్, పదునైన స్ట్రోక్‌లతో ఇంగ్లండ్ బౌలింగ్‌ను దెబ్బ కొట్టిన అతని ఆట నాకు బాగా నచ్చింది. విలియమ్సన్‌లాంటి పలువురు కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగి కూడా న్యూజిలాండ్ 9 వికెట్ల ఘనవిజయంతో టోర్నీ తొలి మ్యాచ్‌లోనే తమ స్థాయిని ప్రదర్శించింది. నేటి మ్యాచ్‌లో నెదర్లాండ్స్ కూడా చివరి వరకు పోరాడవచ్చేమో కానీ కివీస్‌కు మరో రెండు పాయింట్లు రాకపోతే ఆశ్చర్యపోవాల్సిందే.

ఆయుష్ శెట్టికి కాంస్యం

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత పోరాటం ముగిసింది. అమెరికాలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో భారత ప్లేయర్ ఆయుష్ శెట్టి సెమీఫైనల్లో 18-21, 15-21తో నాలుగో సీడ్ అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ టోర్నీ చరిత్రలో భారత్ ఇప్పటి వరకు 11 పతకాలు లభించాయి.

ఆమె బలోపేతం

▶ మొదటి పేజీ తరువాయి

పొదుపు సంఘాల మహిళల ఆదాయాలు పెరిగిన తీరును సేకరించింది. పొదుపు కార్యక్రమాలలో క్షేత్ర స్థాయిలో కీలకంగా వ్యవహరించే మండల కో ఆర్డినేటర్ల పర్యవేక్షణలో అన్ని చోట్ల గ్రామ సమాఖ్య సహాయకులు – వీవోఏల ద్వారా గత 2022 అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ ఆఖరు మధ్య గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల మహిళల ఆదాయ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేశారు. గ్రామీణ ప్రాంతంలో మొత్తం 89.29 లక్షల పొదుపు సంఘాల మహిళలకు గాను 84.90 లక్షల మంది వివరాలు సేకరించగా, అందులో 54 శాతం మంది ఆదాయం ఏటా రూ.60 వేలకు పైగా పెరిగింది. మరో 39 శాతం మంది ఆదాయం కూడా రూ.రెండు వేల నుంచి ఐదు వేల మధ్య పెరిగినట్టు తేలింది.

ఆచరణలో మహిళా సాధికారత

- ▲ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత అన్నది కేవలం ఒక నినాదంగా కాకుండా, ఒక లక్ష్యంగా అమలుకు పూనుకుంది. దీంతో పేదల ఇళ్లలో సిరులు కనిపిస్తున్నాయి. మహిళా సాధికారిత సాధన కోసం ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలోనే కాదు, దేశ చరిత్రలోనూ ఇదివరకెన్నడూ లేని విధంగా ప్రతి ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటిస్తూ క్రమ తప్పకుండా వాటిని అమలు చేస్తూ వస్తోంది.
- ▲ ప్రత్యేకించి రాష్ట్రంలో దాదాపు 80 లక్షల మంది మహిళలకు సంబంధించి 7.96 లక్షల పొదుపు సంఘాల పేరిట గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగిన 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకుల్లో ఉన్న రూ.25,571 కోట్ల అప్పు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో నేరుగా ఆయా మహిళలకు చెల్లించే కార్యక్రమాన్ని చేపట్టింది.
- ▲ దాదాపు 7.96 లక్షల పొదుపు సంఘాలు సరాసరి రూ.3.21 లక్షల చొప్పున ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయి. దీనికితోడు, బ్యాంకుల నుంచి మహిళలు తీసుకున్న 'పొదుపు' రుణాలపై వడ్డీ భారాన్ని వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ప్రభుత్వమే భరిస్తోంది.
- ▲ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకు నగదు రూపంలో (డీబీటీ) 2019 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.2.31 లక్షల కోట్లను అందజేసింది. పొదుపు సంఘాల మహిళల్లో అత్యధికులకు తద్వారా లబ్ధి చేకూరింది. ఇందులో కేవలం మహిళా లబ్ధిదారులకే రూ.1.64 లక్షల కోట్లు చేరాయి.
- ▲ వైఎస్సార్ చేయూత, ఆసరా కార్యక్రమాల ద్వారా మహిళలకు చేరిన డబ్బులను ఆసక్తి ఉన్న వారు నెల వారీ స్థిర ఆదాయం వచ్చే జీవనోపాధి మార్గాల్లో పెట్టుబడులు పెట్టుకుంటే వారికి తగిన 'చేయూత' అందజేసేలా ప్రముఖ వ్యాపార దిగ్గజ కంపెనీలు ఐటీసీ, హిందూస్తాన్ యూనిలీవర్, ప్రాక్టర్ అండ్ గ్యాంబల్, రిలయెన్స్, అమూల్ వంటి సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. కొత్తగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకునే వారికి అవసరమైతే అదనంగా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడంలోనూ ప్రభుత్వం తోడ్పడింది.



బాపులపాడు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఎరికపాటి హేమలత.. వెన్నెల స్వయం సహాయక పొదుపు సంఘ సభ్యురాలు. వీళ్ల ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే వీరవల్లిలో గత ఏడాది డిసెంబర్‌లో జనరల్ స్టోర్ ఏర్పాటు చేసింది. అంతకు ముందు ఆమెకు అలాంటి వ్యాపారం నడపాలన్న ఆలోచనే లేదు. కేవలం ఇంటి పనులకు మాత్రమే పరిమితమై గృహిణిగా కొనసాగుతుండేది. భర్త అక్కడికి దగ్గరలో ఉండే స్పిన్నింగ్ మిల్లులో పనిచేసేవారు. పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న తోడ్పాటుతో కొత్తగా వ్యాపారంలోకి అడుగు పెట్టింది.

నెల వారీ స్థిర ఆదాయం



బాపులపాడు మండలంలోని వీరవల్లికి పక్కనే ఉండే కొడూరుపాడు గ్రామం శివారు ఉమామహేశ్వరపురానికి చెందిన రెడ్డి నాగరాణికి సొంతంగా వ్యవసాయ భూములు లేకపోయినా, కౌలు భూములు సాగు చేసుకుంటోంది. కౌలుదారు కార్డుతో ప్రభుత్వం నుంచి రైతు భరోసా పథకంలో లబ్ధి పొందింది. గ్రామంలో పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్న ఈమె తన రెక్కల కష్టంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నెలా వారీ ఆదాయం మూడు రెట్లకు పైగా పెంచుకుంది. మొదటి నుంచి పాడి గేదెల వృత్తిగా కొనసాగుతున్న ఆ కుటుంబం మూడేళ్ల క్రితం వరకు ప్రతి 15 రోజులకు రూ.6 వేల నుంచి రూ.7 వేల ఆదాయం పొందుతుండేది. అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందిన ఈమె కుటుంబం ఇప్పుడు 11 ఆవులను పోషిస్తోంది. రోజూ 40 లీటర్ల పాలు కేంద్రానికి పోస్తూ ప్రతి 15 రోజులకు రూ.20 వేల ఆదాయం పొందుతోంది. జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాలకు లీటరుకు అదనంగా నాలుగు రూపాయలు ప్రయోజనం చేకూరిందని ఈమె కుటుంబం సంబరపడుతోంది.

సొంత కాళ్లపై నిలదొక్కుకున్న సభ్యులు



బాపులపాడు మండల కేంద్రంలో ఓం గణపతి స్వయం సహాయక పొదుపు సంఘం పది మంది సభ్యులతో 2007లో ఏర్పాటైంది. వీరు ప్రతి నెలా కొద్ది మొత్తం చొప్పున ఇప్పటి వరకు రూ.2.53 లక్షలు పొదుపు చేసుకున్నారు. ఈ సంఘానికి వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.2.12 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. వారు తీసుకున్న బ్యాంకు రుణాలకు సంబంధించి ఆ మహిళలు ఈ నాలుగేళ్ల కాలంలో చెల్లించాల్సిన వడ్డీకి సంబంధించి మరో రూ.41 వేలు మూడు విడతల్లో అందించింది. ఆ సంఘంలో సభ్యులు అమ్మఒడి, వైఎస్సార్ దీవెన, కాపు నేస్తం, రైతు భరోసా.. ఇలా వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. ఈ సంఘంలో సభ్యురాలిగా ఉండే చోడిశెట్టి లక్ష్మీ కుటుంబం వ్యాపారం నిర్వహించే అద్దె షాపును పది నెలల క్రితం కొనుగోలు చేసింది. ఇదే సంఘంలో సభ్యురాలిగా ఉండే కుర్ర అనూష కుటుంబం మూడేళ్ల కిత్రం వరకు అద్దె ఇంటిలో ఉండి, ఇప్పుడు సొంతంగా ఇల్లు కొనుగోలు చేసింది. ఇంకో సభ్యురాలి కుటుంబం కొత్తగా వ్యాను కొనుగోలు చేసింది. గతంలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేసే ఆమె భర్త ఇప్పుడు వ్యాను యజమాని అయ్యారు.

సంక్షేమ కార్యక్రమాలతో పేదల ఇంట సిరులు

జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ తదితర మొత్తం 28 రకాల సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న లబ్ధిని మెజారిటీ శాతం పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. 2022 అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ ఆఖరు మధ్య గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల మహిళల ఆదాయ వివరాల సేకరణ సమయంలో ఈ విషయం నిర్ధారణ అయిందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అందజేసిన లబ్ధిని ఉపయోగించుకొని కొందరు తమ తమ ఊళ్లలో చిరు వ్యాపారాలు మొదలు పెద్ద దుకాణాల వరకు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో కేవలం కూలి పనుల మీద ఆధారపడి బతికే వారిలో చాలా మంది కొత్తగా పాడిగేదెలు, ఆవులు, మేకలు వంటివి కొనుగోలు చేసుకొని స్థిరమైన జీవనోపాధి ఏర్పాటు చేసుకున్నారు. అన్నింటికీ మించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు ద్వారా పిల్లల చదువులు, వ్యవసాయ పెట్టుబడులు ఇలా ప్రతి అవసరానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చుకోవడం తగ్గిపోయింది. పాత అప్పులు కూడా తీర్చేశారు. తద్వారా ఏటా రూ.25 వేల నుంచి రూ.40 వేల దాక కట్టే వడ్డీల బెడద తగ్గిపోయిందని సర్వే సమయంలో మహిళలు అభిప్రాయపడ్డారు.

ఎన్‌ఐఆర్‌డీ ద్వారా అధ్యయనం

పొదుపు సంఘాల మహిళల ఆదాయాలపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది ద్వారా సర్వే చేసిన ప్రభుత్వం.. ఇందుకు సంబంధించి సమగ్ర విశ్లేషణకు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై అధ్యయనంలో విశేష అనుభవం ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్‌ఐఆర్‌డీ) ద్వారా అధ్యయనం చేయించేందుకు పూనుకుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), ఎన్‌ఐఆర్‌డీ మధ్య ప్రాథమికంగా ఒక అవగాహన ఒప్పందం పూర్తయింది. ఈ అధ్యయనం కార్యక్రమం మొదలు కావాల్సి ఉందని సెర్ప్ అధికారులు వెల్లడించారు.

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం



విజయనగరం టౌన్: ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు మహాకవి గురజాడ విశిష్ట పురస్కారం అందజేయనున్నట్లు విజయనగరం గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రకటించింది. తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న వారిని గురజాడ పురస్కారంతో గౌరవిస్తున్నామని పేర్కొంది. నవంబర్ 30న నిర్వహించే గురజాడ సాహితీ చైతన్యోత్సవ కార్యక్రమంలో చంద్రబోస్‌కు ఈ పురస్కారం ప్రదానం చేస్తామని సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ ఎ.గోపాలరావు, కాపుగంటి ప్రకాష్ ఆదివారం తెలిపారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం..

బీసీ కుల సంఘాల సమావేశంలో ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కుల గణన ప్రక్రియను చేపట్టి వేగంగా పూర్తి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ విజ్ఞప్తి చేశారు. విజయవాడ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం బీసీ కుల సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మారేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా అగ్రపీటం వేసిన సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇన్నాళ్లూ తెరవెనుక సహజీవనం చేసిన చంద్రబాబు, పవన్‌లు ఇప్పుడు ముసుగులు తొలగించి జనంలోకి వచ్చారని, వారి నిజస్వరూపాలను గమనించి ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని మారేష్ పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా ఓబీసీ కుల గణనకు చట్టబద్ధత కల్పించాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా కల్పించాలని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ సమావేశం తీర్మానాలు చేసింది.

'ఉండి' టీడీపీలో నువ్వా? నేనా?

రోడ్డెక్కిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసుకుని దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరామరాజు

ఉండి: పశ్చిమగోదావరి జిల్లాలో తెలుగుదేశానికి కంచుకోటగా చెప్పుకొనే ఉండి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల విభేదాలు రోడ్డెక్కాయి. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉండిలో ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వి.వి.శివరామరాజు మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఉండి రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద ఉన్న టీడీపీ మండల కార్యాలయం ముందు ఆదివారం టీడీపీ నాయకులు నిరసనదీక్ష చేపట్టారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే శివరామరాజు పాల్గొని శ్రేణులను ఉత్సాహపరుస్తూ వారితో నిరసనకు దిగారు. అనంతరం శిబిరంలోకి ఎమ్మెల్యే రామరాజు వచ్చారు. కొద్దిసేపటి తరువాత మాజీ ఎమ్మెల్యే శివరామరాజు ఆ శిబిరానికి పక్కనే మరో శిబిరం ఏర్పాటు చేయించి అందులో కూర్చుని నిరసన చేపట్టారు. దీంతో ఆయన అనుచరులు కూడా ఆ శిబిరంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల విభేదాలు మరోసారి రోడ్డెక్కడంతో నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. చాలామంది మాజీ ఎమ్మెల్యే శివరామరాజు శిబిరంలోకి చేరి ఆయనకు మద్దతు తెలపడంతో విభేదాలు మరింత పెరిగాయి. ఈ మధ్య కాలంలో ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పెట్టుకునేందుకే టీడీపీ నాయకులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారుగానీ వారికి చిత్తశుద్ధి లేదంటూ మాజీ ఎమ్మెల్యే శివరామరాజు ప్రస్తుత ఎమ్మెల్యేను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దీంతో తెలుగు తమ్ముళ్లు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పర దూషణలకు దిగారు.

అనితను ప్రకటించడానికి ఆయనెవరు?


- యనమల కృష్ణుడుపై జనసేన నేత గెద్దం బుజ్జి ఫైర్
- పాయకరావుపేట టికెట్‌ను ఎవరికి ఇవ్వాలనేది బాబు, పవన్ నిర్ణయిస్తారు



నక్కపల్లి/పాయకరావుపేట : అనకాపల్లి జిల్లా పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ టీడీపీ మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకేనని నియోజకవర్గ పరిశీలకుడు యనమల కృష్ణుడు చేసిన ప్రకటనపై జనసేన శ్రేణులు మండిపడుతున్నారు. ఇక్కడ అభ్యర్థిని ప్రకటించడానికి కృష్ణుడెవరు అంటూ ప్రశ్నిస్తున్నారు. అభ్యర్థిని ప్రకటించే అధికారం పరిశీలకులకులేదని తేల్చిచెప్పారు. ఈ విషయంపై ఆదివారం జనసేన రాష్ట్ర కార్యదర్శి, కాపు నేత గెద్దం బుజ్జి మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనితకు టికెట్ ఇస్తే జనసేన కార్యకర్తలు మద్దతిచ్చే ప్రసక్తిలేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఆమె వ్యవహారశైలి.. కాపులను, జనసేనతోపాటు, టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన విషయాలు తెలియక యనమల కృష్ణుడు అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. 2014లో అనితకు ఎమ్మెల్యే పదవి భిక్ష పెట్టింది జనసేన పార్టీయేనని, తమ మద్దతువల్లే ఆమె గెలిచారని బుజ్జి చెప్పారు. పదవి చేపట్టిన వెంటనే ఆమె తనపై రేప్ కేసు పెట్టించిందని, జనసేన కార్యకర్తలను ఇబ్బంది పెట్టిందని, కాపుల వ్యతిరేకి అయిన ఆమె ఆ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని చెప్పుతో కొట్టిందని ఆయన గుర్తుచేశారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా పాయకరావుపేట టికెట్ జనసేనకే కేటాయించాలని నియోజకవర్గ జనసేన కార్యకర్తలు కోరుతున్నారని ఆయన తెలిపారు. పాయకరావుపేట టికెట్ ఎవరికి ఇవ్వాలనేది చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు నిర్ణయిస్తారన్నారు.

నేడు అందరి దృష్టి కోర్టుల వైపే

సుప్రీంకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ విచారణ



సాక్షి, న్యూఢిల్లీ /సాక్షి అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరుగనుంది. జస్టిస్ అనిరుద్ధాబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించనుంది. ఆరవ నంబర్ కోర్టులో ఐటమ్ 59గా ఈ పిటిషన్‌ను జాబితాలో చేర్చారు. గత విచారణ సందర్భంగా హైకోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, ఇదే కేసులో చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించనుంది. ఈ కేసులో ఇప్పటికే చంద్రబాబుకు రెండ్రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కానీ చంద్రబాబు ఉద్దేశ పూర్వకంగా కాలయాపన చేయడంతో పాటు కస్టడీలో విచారణకు ఏమాత్రం సహకరించలేదని సీఐడీ న్యాయస్థానానికి తెలిపింది. దాంతో పాటు ఈ కేసు దర్యాప్తులో తాజాగా కనుగొన్న కీలక ఆధారాలపై ఆయన్ను సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానానికి నివేదించింది. ప్రధానంగా షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాలో చేరిన అక్రమ నిధుల వ్యవహారంపై ప్రశ్నించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. అందుకే చంద్రబాబును మరో మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని కోరింది. మరో వైపు చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఆయన్ను కస్టడీకి ఇవ్వొద్దని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సీఐడీ తరఫు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయంగా బలవంతుడైన చంద్రబాబు ఇప్పటికే ఈ కేసులో సాక్షులను బెదిరిస్తున్నారని ఉదాహరణలతో సహా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను మరింతగా బెదిరించడంతో పాటు కేసు దర్యాప్తును ప్రభావం చేస్తారని వాదనలు వినిపించారు. కాబట్టి చంద్రబాబు బెయిల్ పిటిషన్ తిరస్కరించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్లపై వరుసగా మూడు రోజుల పాటు వాదనలు విన్న న్యాయస్థానం రిజర్వు చేసిన తీర్పును నేడు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

హైకోర్టులో బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పులు

మరోవైపు హైకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన మూడు బెయిల్ పిటిషన్లపై సోమవారం తీర్పులు వెలువడనున్నాయి. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లో బెయిల్ కోసం చంద్రబాబు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.సురేష్‌రెడ్డి తీర్పులను రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. ఈ మూడు పిటిషన్లపై న్యాయమూర్తి సోమవారం తీర్పులను వెలువరించనున్నారు.

లక్ష్యం.. క్లీన్ స్వీప్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టడంపై ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు – పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా పరుగులెత్తిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లుగా వివరించి.. ప్రగతిపథంలో రాష్ట్రం దూసుకెళ్లాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాలని సూచించనున్నారు. ఇందుకు 'రాష్ట్రానికి జగనే కావాలి' (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని చేపట్టాల్సిన తీరుపై ప్రతినిధులకు మార్గనిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులు సీఎం సందేశాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తారు.

దేశ చరిత్రలోనే కొత్త రికార్డు

సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ స్థానాలు, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తొలి ఏడాదే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసి మేనిఫెస్టోకు సిసలైన నిర్వచనం ఇచ్చారు. ఇప్పటికే 99.5 శాతం హామీలు అమలు చేశారు. గత 53 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.4.69 లక్షల కోట్ల ప్రయోజనం పేదలకు చేకూర్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ ఈ స్థాయిలో పేదలకు లబ్ధి చేకూర్చిన దాఖలాలు లేవు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. వార్డు, గ్రామ సచివాలయాలు, జిల్లాల పునర్విభజన ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి.. ప్రజల ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లారు. పోర్టులు, షిప్పింగ్ యార్డులు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేశారు. దాంతో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తోంది. తద్వారా సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ నానాటికీ పెరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాలు సాధించడంతో పాటు తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు శాసన సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో విజయభేరి మోగించడం అందుకు నిదర్శనం.

నిత్యం ప్రజలతో మమేకం

అధికారంలోకి వచ్చాక అనునిత్యం ప్రజలతో సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, ప్రజాప్రతినిధులు మమేకమవుతున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని ప్రతి ఇంటికీ వివరించడానికి 2022 మే 11న చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మేలును వివరించి.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి 29 వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో 1.45 కోట్ల కుటుంబాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మమేకమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'మెగా పీపుల్స్ సర్వే'లో 1.16 కోట్ల కుటుంబాల ప్రజలు అంటే 80 శాతం మంది ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి.. 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినదించారు. ఇటీవల ప్రముఖ జాతీయ ఛానల్ టైమ్స్ నౌ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25కు 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని తేలడమే అందుకు నిదర్శనం. ప్రజల్లో అత్యంత సానుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో సమన్వయంతో పనిచేస్తే 175కు 175 స్థానాల్లో విజయం సాధించడం సాధ్యమేనని పార్టీ ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు.

పాసులు ఉన్న వారికి మాత్రమే అనుమతి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల సభకు హాజరయ్యే ఆహ్వానితులు సకాలంలో సభ ప్రాంగణానికి చేరుకోవాలని ఆ పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో ఆదివారం ఆయన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం టిఫిన్‌తో పాటు మధ్యాహ్నం మటన్ బిర్యానీ, చికెన్ బిర్యానీ, రొయ్యల కూర, పీతల వేపుడు, రసం, కుండ పెరుగు.. తదితర 30 రకాల వంటకాలతో పసందైన భోజనం అందిస్తామన్నారు. ఆహ్వానితులు ఉదయం 8.30 గంటలకు సభ ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. పాసులు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తారని, పోలీసులు స్టేడియం లోపల, బయట కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారని చెప్పారు.

ఎన్నికలకు సమాయత్తం

సజ్జల రామకృష్ణారెడ్డి

వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే క్రమంలో సోమవారం పార్టీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. నాలుగున్నరేళ్లలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.. ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని ఎక్కడికక్కడ సమర్థవంతంగా తిప్పికొట్టి.. ప్రజల ఆశీర్వాదం కోరే దిశగా శ్రేణులకు పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారని వివరించారు. విజయవాడలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న పార్టీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశ ఏర్పాట్లను ఆదివారం ఆయన గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు చల్లా మధుసూధనరెడ్డి, పుత్తా ప్రతాపరెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రత ఏర్పాట్ల గురించి విజయవాడ పోలీస్ కమీషనర్ కాంతిరాణా టాటా వివరించారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగడం ఐదుకోట్ల మంది ప్రజలకు చారిత్రక అవసరం అన్నారు. అవినీతి పరుడైన చంద్రబాబు ప్రజల కోసం పోరాటం చేసి జైలుకు వెళ్లినట్లుగా టీడీపీ, ఎల్లో మీడియా ప్రచారం చేసుకుంటుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

భారీగా చేరికలు

తిరుపతి సిటీ: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి నాయకులు, కార్యకర్తల చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 350 మందికి పైగా టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. తిరుపతిలోని 33వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎన్వీ రమణారెడ్డి సహా 300 మందికి పైగా టీడీపీ నాయకులకు ఆదివారం పద్మావతిపురంలో టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమమే తాము వైఎస్సార్‌సీపీలో చేరడానికి కారణమన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ మేలు చేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్లలో గెర్లపల్లికి చెందిన టీడీపీ నాయకులు జి.రామచంద్రారెడ్డి, రమేశ్‌రెడ్డి, రాజారెడ్డి సహా 50 మంది ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని సూచించారు.



తిరుపతిలో టీడీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



చిత్తూరు జిల్లా రొంపిచెర్లలో మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	364	65,996
నిఫ్టీ ▲	108	19,654

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	13,431	▲ 212
డోజోన్స్	33,408	▲ 288
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,495	▲ 43
డాక్స్	15,300	▲ 160
షాంఘై (సెప్టెంబర్ 28 ముగింపు)	3,110	▲ 3
నికాయ్	31,031	▽ 22

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	98.86	103.18
€	యూరో	ఒక్కటి	86.29	89.38
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	55.20	56.92
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	52.07	54.37
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	59.97	61.91
SAR	సౌదీ రియాల్	ఒక్కటి	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హమ్	ఒక్కటి	21.77	23.56
¥	చైనా యువాన్	ఒక్కటి	10.28	12.35

క్రెడిట్ కార్డ్.. లిమిట్ పెంచుకుంటున్నారా?



- ▲ బ్యాంక్‌ల నుంచి అదే పనిగా ఆఫర్లు
- ▲ కార్డ్ అప్‌గ్రేడ్ చేసుకోవాలంటూ సూచనలు
- ▲ వినియోగం పెరిగినప్పుడే అదనపు లిమిట్
- ▲ సీయూఆర్ 30 శాతం మించొద్దు
- ▲ లేదంటే క్రెడిట్ స్కోరుపై ప్రభావం

క్రెడిట్ కార్డ్ వినియోగం మన దేశంలో శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2023 ఏప్రిల్ నాటికి దేశవ్యాప్తంగా 8.6 కోట్ల క్రెడిట్ కార్డ్‌లు ఉన్నాయి. 2022 ఏప్రిల్ నాటికి ఉన్న 7.5 కోట్లతో పోలిస్తే ఏడాదిలో 15 శాతం పెరిగాయి. 2024 ఆరంభం నాటికి వీటి సంఖ్య 10 కోట్లకు చేరుకుంటుందని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. క్రెడిట్ కార్డ్‌లతో షాపింగ్ చేస్తే తగ్గింపులతో పాటు, రివార్డులు, ఉచిత మూవీ టికెట్లు ఇలా ఎన్నో ఆఫర్లు వినియోగాన్ని పెంచుతున్నాయి. క్రెడిట్ కార్డ్‌లు తీసుకున్న తర్వాత దాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని, క్రెడిట్ లిమిట్ పెంచుకోవాలంటూ బ్యాంక్‌లు కోరుతుండడం చాలా మందికి అనుభవమే. చాలా మంది తమ కార్డ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడం లేదంటే క్రెడిట్ లిమిట్ (అప్పు పరిమితి) పెంచుకోవడానికి ఆసక్తి చూపిస్తుంటారు. కార్డ్ అప్‌గ్రేడ్ లేదా క్రెడిట్ లిమిట్ పెంపుతో ప్రయోజనాలున్నట్టే.. కొన్ని రిస్క్‌లు లేకపోలేదు. కంపెనీలు ఇచ్చే ఆఫర్లకు ఓకే చెప్పడానికి ముందు ఇందులో ఉండే చిక్కుల గురించి కూడా తెలుసుకోవాలి. ఆ తర్వాత దీనిపై నిర్ణయానికి రావాలి..

''క్రెడిట్ పరిమితి (లిమిట్) పెంపు లేదా క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడ్ ఆఫర్‌ను, కార్డుదారుడి ఇటీవలి రుణ చరిత్ర ఆధారంగానే బ్యాంక్‌లు ఇస్తుంటాయి. ముఖ్యంగా ప్రస్తుత కార్డుపై ఉన్న పనితీరును చూసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకుంటుంటాయి. కార్డుదారుడి ఆదాయ స్థాయి పెరిగినట్టు బ్యాంక్ భావించిన సందర్భాల్లోనూ ఈ ఆఫర్లు ఇస్తుంటాయి''అని విష్‌ఫిన్ సీఈవో రిషి మెహ్రా తెలిపారు. బ్యాంక్ నుంచి క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడ్ లేదా లిమిట్ పెంపు ఆఫర్ వచ్చిందంటే అది కచ్చితంగా రుణ పరపతి పెరిగిన దానికి సంకేతంగా చూడొచ్చు. అయితే, సంబంధిత ఆఫర్ లేదా అభ్యర్థనను ఆమోదించే ముందు తప్పకుండా సానుకూలతలు, ప్రతికూలతల గురించి విశ్లేషించుకోవాలని రిషి మెహ్రా సూచించారు.

అప్‌గ్రేడ్ మంచికేనా..?

ఉన్నత శ్రేణి క్రెడిట్ కార్డ్ తీసుకుంటే, దానిపై రుణం రేటు, రివార్డులు, క్యాష్ బ్యాక్, డిస్కౌంట్లు, డీల్స్ కూడా మెరుగ్గానే ఉంటుంటాయి. దీంతో కార్డ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడం వల్ల అధిక రివార్డులు, క్యాష్‌బ్యాక్, ఇతర ప్రయోజనాలు లభిస్తుంటాయి. కాకపోతే కార్డ్‌పై నిర్దేశిత వ్యయాలు చేయాలనే నిబంధనలు ఉంటాయని మర్చిపోవద్దు. అప్‌గ్రేడెడ్ కార్డుకు వెళ్లకుండా, ఎన్నేళ్లు గడిచిన అదే పాత కార్డ్‌లోనే కొనసాగే వారు మంచి డీల్స్‌ను కోల్పోవాల్సి రావచ్చు. ''పాతబడిన



క్రెడిట్ కార్డ్ ఆధునిక ఫీచర్లు, ప్రయోజనాలు ఇవ్వకపోవచ్చు. నేడు దాదాపు చాలా క్రెడిట్ కార్డ్ సంస్థలు అర్హులైన కస్టమర్లకు ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ సదుపాయాన్ని ఆఫర్ చేస్తున్నాయి. ప్రతీ లావాదేవీపై డిస్కౌంట్, క్యాష్ బ్యాక్, క్రెడిట్ లిమిట్‌ను పెంచుతున్నాయి. పాత కార్డ్‌లోనే కొనసాగడం వల్ల.. బిల్లులను సకాలంలో చెల్లించడం వల్ల లభించే నూతన, అదనపు ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది''అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి వివరించారు.

అధిక లిమిట్ లాభమేనా?

క్రెడిట్ లిమిట్ కంటే తక్కువ ఖర్చు చేసే వారి పట్ల క్రెడిట్ బ్యూరోలు సానుకూలంగా వ్యవహరిస్తాయి. ''క్రెడిట్ బ్యూరోలు క్రెడిట్ స్కోరును ఎన్నో అంశాల ఆధారంగా లెక్కిస్తుంటాయి. అందులో క్రెడిట్ వినియోగం ఒకటి. తక్కువ క్రెడిట్ వినియోగ రేషియో (సీయూఆర్) అన్నది.. లిమిట్‌ను వినియోగించుకునే విషయంలో ఎంత బాధ్యతగా ఉన్నదీ తెలియజేస్తుంది. క్రెడిట్‌పై ఎక్కువగా ఆధారపడడం లేదని సంకేతం ఇస్తుంది. ఇది ఒకరి క్రెడిట్ స్కోర్‌పై సానుకూల ప్రభావం చూపిస్తుంది''అని ఆదిల్ శెట్టి వివరించారు. కార్డుపై ఉన్న మొత్తం లిమిట్‌లో ఎంత శాతం ప్రతి నెలా వినియోగిస్తున్నారన్నది క్రెడిట్ వినియోగ రేషియో రూపంలో తెలుస్తుంది. ఇది తక్కువగా ఉంటే సానుకూలం అవుతుంది. ''ఉదాహరణకు క్రెడిట్ కార్డుపై క్రెడిట్ లిమిట్ రూ.లక్షగా ఉంటే, ప్రతి నెలా వినియోగిస్తున్నది రూ.50,000గా ఉంటే అప్పుడు సీయూఆర్ 50 శాతం అవుతుంది. అదే క్రెడిట్ లిమిట్ రూ.1,50,000 అయి ఉండి, వినియోగించే మొత్తం ప్రతి నెలా రూ.50,000 స్థాయిలోనే ఉంటే, అప్పుడు వినియోగ రేషియో 33 శాతం అవుతుంది''అని శెట్టి తెలియజేశారు. క్రెడిట్ స్కోర్ సగటున 700–750 మధ్య ఉంటే, దీన్ని పెంచుకునేందుకు అధిక క్రెడిట్ లిమిట్ సాయపడుతుంది. ''సగటు స్కోరులో ఉన్న వ్యక్తి (750లోపు) క్రెడిట్ లిమిట్ పెంచుకోవడం వల్ల అప్పుడు వారి క్రెడిట్ స్కోరు సైతం 750 ఎగువకు చేరుతుంది. అప్పటికే ఎక్కువ స్కోర్‌లో ఉన్న వారు క్రెడిట్ లిమిట్ పెంచుకోవడం వల్ల అదనంగా పొందేదేమీ ఉండదు''అని మెహ్రా సూచించారు. తక్కువ సీయూఆర్ వ్యక్తి ఆర్థిక ఆరోగ్యంపైనా సానుకూల ప్రభావం చూపిస్తుందని ఆదిల్‌శెట్టి సూచించారు. ''సీయూఆర్ తక్కువగా ఉంటే మీరు మీ ఆర్థిక వ్యవహారాలను ఎంతో క్రమశిక్షణగా నిర్వహిస్తున్నట్టు తెలియజేస్తుంది. డిఫాల్ట్ అవకాశాలు దాదాపు తక్కువగా ఉంటాయని సంకేతమిస్తుంది. రుణాల విషయంలో సరైన నడవడిక, సకాలంలో చెల్లింపులు, రుణాల్లో సరైన సమతుల్యం (వివిధ రుణాలు) అనేవి మంచి క్రెడిట్ స్కోరుకు దారితీస్తాయి''అని శెట్టి తెలిపారు.

రిస్క్‌లు ఇవీ..

అధిక క్రెడిట్ లిమిట్‌తో ఉండే అతిపెద్ద రిస్క్ పరిమితికి మించి ఖర్చు చేయడం. ''ఎక్కువ లిమిట్ ఉంటే, అవసరాలు ఏర్పడినప్పుడు ఆలోచించకుండా ఖర్చు చేస్తుంటారు. సకాలంలో చెల్లింపులు చేయలేకపోతే అది భారంగా మారుతుంది. క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తుంది. మీ కార్డ్ నిర్వహణ భద్రంగా లేకపోతే అది దుర్వినియోగం అయ్యే ప్రమాదం లేకపోలేదు. మోసపూరిత లావాదేవీలకు ఆస్కారం ఉంటుంది''అని మెహ్రా పేర్కొన్నారు. కార్డు వినియోగం విషయంలో జాగ్రత్తగా, నియంత్రణతో వ్యవహరించకపోతే అది ప్రతికూలంగా మారే అవకాశం లేకపోలేదు. అధికంగా వినియోగించడం వల్ల అప్పుడు క్రెడిట్ వినియోగ రేషియో (సీయూఆర్) పెరిగేందుకు దారితీస్తుంది. సీయూఆర్ ఎక్కువ అయితే అది క్రెడిట్ స్కోర్‌ను వెనక్కి లాగేస్తుంది. ఒకవేళ ఖర్చులు ఎక్కువగా ఉంటే, అప్పటికే ఉన్న క్రెడిట్ లిమిట్‌లో అధిక శాతం వినియోగించాల్సి వస్తుంటే.. అప్పుడు క్రెడిట్ లిమిట్‌ను పెంచుకోవాలి. సీయూఆర్ 30 శాతం మించకుండా చూసుకోవాలి. దీనితోపాటు క్రమశిక్షణతో కార్డును వినియోగించడం, సకాలంలో చెల్లింపులు చేయడం చాలా కీలకమవుతుంది.

బ్యాంక్‌లు, లేదా క్రెడిట్ కార్డ్ కంపెనీలు తరచుగా కార్డ్ అప్‌గ్రేడ్ లేదా లిమిట్ పెంచుకోవాలంటూ ఆఫర్లు ఇస్తుంటాయి. అప్పుడు తమ వైపు నుంచి సమీక్షించుకోవాలి. ఖర్చు చేసేందుకు అదనపు వెసులుబాటు ఉందా? రివార్డుల పరంగా ఆ కార్డ్ మెరుగైనదా? లేదంటే తమ అవసరాలకు ఉపయోగపడే ప్రత్యేక కార్డా? సెక్యూరిటీ ఫీచర్లు ఏ మేరకు? ఇవన్నీ చూడాలి. ముఖ్యంగా ఒక క్రెడిట్ కార్డ్‌తోనే ఒక వ్యక్తి క్రెడిట్ హిస్టరీ పరిమితం కాదు. ఇతర బ్యాంక్‌ల నుంచి రుణాలు, కార్డ్‌లు తీసుకోవాల్సి వస్తే, మీ పరిస్థితి ఏంటన్నది కూడా

ఆఫర్‌కు ఓకే చెప్పాలా..?

చూడాలి. మంచి క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఉంటే ఇతర కార్డ్ కంపెనీలు సైతం ఆకర్షణీయమైన ఆఫర్లు ఇస్తుంటాయి. ''బ్యాంక్ ఇచ్చిన ఆఫర్ తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగానే ఉందా? ఖర్చు చేసే ధోరణికి అనుకూలంగా ఉందా?మరిన్ని ప్రయోజనాలు లభిస్తున్నాయా? వీటికి అవుననే సమాధానం వస్తే, అప్పుడు ఆ కార్డ్ ఆఫర్‌ను ఆమోదించొచ్చు. తాజా ఆఫర్‌కు సంబంధించి షరతులు మీకు అనుకూలంగా లేకపోతే, మీ లక్ష్యాలకు అనుకూలమైన ఇతర కార్డ్‌ను పరిశీలించొచ్చు''అని ఆదిల్ శెట్టి సూచించారు. క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంపు లేదా కార్డ్ అప్‌గ్రేడేషన్ అదనపు సదుపాయాలతో రావడమే కాదు, వార్షిక ఫీజు కూడా అధికంగా ఉంటుంది. అందుకని అప్‌గ్రేడ్‌ను ఎంపిక చేసుకునే ముందు పడే భారం ఎంత, ప్రయోజనాలు ఏ మేరకో చూడాలి. చాలా వరకు బ్యాంక్‌లు కార్డ్‌పై వార్షికంగా ఇంత వ్యయం చేస్తే, వార్షిక నిర్వహణ చార్జీని మాఫీ చేస్తున్నాయి. దీంతో సులభంగానే ఈ భారం పడకుండా చూసుకోవచ్చు.

క్రెడిట్ కార్డ్ సంస్థ నుంచి ఎలాంటి ఆఫర్లు రానప్పుడు.. ఇంతకంటే మెరుగైన కార్డ్‌కు తాను అర్హుడినని భావిస్తే, అప్పుడు కార్డుదారుడే స్వయంగా లిమిట్ పెంచాలని లేదా కార్డ్‌ను అప్‌గ్రేడ్ చేయాలని కోరొచ్చు. ''క్రెడిట్ కార్డ్ తీసుకున్న తర్వాత తమ ఆదాయం పెరిగితే అప్పుడు క్రెడిట్ లిమిట్ పెంపునకు అర్హత లభించినట్టుగా భావించొచ్చు. క్రెడిట్ కార్డ్ కంపెనీతో దీర్ఘకాల బంధం ఉన్నవారు తమ లిమిట్ పెంచుకునే అనుకూలతతో ఉంటారు. కొన్ని ప్రయోజనాలు ప్రీ అప్రూవ్ (ముందే ఆమోదించినది)గా ఉంటాయి''అని శెట్టి వివరించారు.

ఇలా అయితే సమ్మతి..

అప్‌గ్రేడ్ చేసుకోవడం, క్రెడిట్ లిమిట్ పెంచుకోవడం పూర్తిగా అవసరాల ప్రాతిపదికనే ఉండాలన్నది మర్చిపోవద్దు. ఆదాయం పెరిగినప్పుడు, మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినప్పుడే క్రెడిట్ లిమిట్, క్రెడిట్ కార్డ్ అప్‌గ్రేడేషన్‌కు వెళ్లాలని మెహ్రా సూచిస్తున్నారు. ''ఒక వ్యక్తి ఖర్చులు ఎప్పుడూ ఒకే మాదిరిగా ఉండవు. కొంత కాలానికి ఇందులో మార్పు వస్తుంటుంది. అలాంటప్పుడు కార్డ్‌ను మార్చుకోవచ్చు. ప్రస్తుత కార్డ్ ప్రయోజనాల్లో మార్పులు చోటు చేసుకున్నప్పుడు, అవి తమకు అనుకూలంగా లేకపోతే కార్డ్ అప్‌గ్రేడేషన్‌ను కోరొచ్చు. ఉదాహరణకు ఒక బ్యాంక్ ఒక కార్డ్‌ను ఉపసంహరించి, దాని స్థానంలో వేరేది ఇస్తున్నట్టు అయితే, అందులో ప్రయోజనాలు అంత ఆకర్షణీయంగా లేవని పిస్తే అప్పుడు అప్‌గ్రేడ్ చేయాలని కోరొచ్చు''అని మెహ్రా సూచించారు. అప్‌గ్రేడ్ ద్వారా తీసుకునే కార్డులో ప్రయోజనాలు తమకు అనుకూలంగా, ఆకర్షణీయంగా ఉన్నాయేమో చూసుకోవాలి. అంతేకానీ ఆఫర్లు ఆకర్షణీయంగా ఉన్నాయని ఓకే చెప్పాల్సిన అవసరం లేదు.

2024 ఆఖరు నాటికి పూర్తి స్థాయిలో పసిడి ఉత్పత్తి

- జొన్నగిరి ప్రాజెక్టుపై డీజీఎంఎల్ ఎండీ ప్రసాద్ వెల్లడి



న్యూఢిల్లీ: జొన్నగిరి బంగారు గనుల్లో వచ్చే ఏడాది అక్టోబర్–డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభం కాగలదని డెక్కన్ గోల్డ్ మైన్స్ (డీజీఎంఎల్) ఎండీ హనుమ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఏటా 750 కిలోల బంగారం వెలికి తీయొచ్చని ప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు దీనిపై రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేయగా పైలట్ ప్రాతిపదికన ప్రస్తుతం నెలకు ఒక కేజీ మేర బంగారాన్ని మైనింగ్ చేస్తున్నారు. 2013లో తమకు గనిని కేటాయించగా, ప్రాజెక్టు మదింపును పూర్తి చేసేందుకు 8–10 ఏళ్లు పట్టినట్లు ప్రసాద్ చెప్పారు. అటు కిర్గిజ్‌స్తాన్‌లో తమకు 60 శాతం వాటాలున్న మరో బంగారు గనిలో కూడా 2024 అక్టోబర్–నవంబర్‌లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని ఆయన పేర్కొన్నారు. ఆల్టిన్ టోర్ గోల్డ్ ప్రాజెక్టు నుంచి ఏటా 400 కేజీల బంగారం వెలికితీయొచ్చని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో జొన్నగిరి బంగారు గని ఉంది. బీఎస్‌ఈలో లిస్టయిన ఏకైక గోల్డ్ మైనింగ్ కంపెనీ డీజీఎంఎల్. జొన్నగిరి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్న జియోమైసూర్ సర్వీసెస్ ఇండియాలో డీజీఎంఎల్‌కు మెజారిటీ (40 శాతం) వాటాలు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
09-10-2023	
విశాఖ	540–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	538–00
విజయవాడ	538–00
రిటైల్ ధర (డజను)	72.00
08-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

స్టాక్స్ వ్యూ

ఇమామీ లిమిటెడ్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 527
టార్గెట్: రూ. 625

ఎందుకంటే: బిజినెస్ ప్రాస్పెక్ట్స్‌ను మెరుగుపరిచేందుకు కంపెనీ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు సానుకూల అంచనాలకు కారణమయ్యాయి. యాజమాన్యంలో వృత్తినిపుణులను నియమించుకుంటోంది. కీలక విభాగాలను పటిష్టతకు తగిన ప్రణాళికలతో పాటు.. నూతన కార్యకలాపాలకూ తెరతీస్తోంది. చిన్నతరహా డీటూసీ, ప్రాంతీయ బ్రాండ్లతో పోర్ట్‌ఫోలియోను నిర్మించుకుంటోంది. వ్యూహాత్మకంగా దృష్టిని సారించడం ద్వారా పెట్టుబడులను వెచ్చిస్తోంది. ఉత్తరాదికి చెందిన భారీ జనరల్ ట్రేడ్ కంపెనీ యాగ్జియామ్ ఆయుర్వేదలో 26 శాతం వాటాను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆరోగ్య సంబంధ జ్యూస్‌ల ద్వారా అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్న కంపెనీలో వ్యూహాత్మకంగా ఇన్వెస్ట్ చేస్తోంది. కంపెనీ కార్యకలాపాలు వృద్ధి చెందాక వాటాను మరింత పెంచుకునే యోచనలో ఉంది. ఫైనాన్షియల్ పెట్టుబడి



వ్యూహాలలో భాగంగా ప్రస్తుతం కంపెనీ చేతిలో ఐదు సంస్థలలో వాటాలున్నాయి. ఉమ్మడిగా రూ. 260 కోట్ల అమ్మకాలు నమోదవుతున్నాయి. యాగ్జియామ్‌కంటే ముందు నాలుగు ప్రాంతీయ బ్రాండ్లలో ఇన్వెస్ట్ చేసింది. ఇవి.. హీలియోస్ లైఫ్ స్టైల్(ద మ్యాన్ కంపెనీ), బ్రిల్లారీ, ట్రూనేటివ్, ఫర్ బాల్ స్టోరీ. వీటిలో మిగిలిన వాటా ఆయా మాతృ సంస్థల చేతిలోనే ఉంది. ఏ ఇతర ఇన్వెస్టర్లకూ వాటాలు లేకపోవడం గమనార్హం! అమ్మకాలు పుంజుకున్నాక వీటిలో వాటాలు పెంచుకునేందుకు ఇమామీకి వీలుంది. ప్రత్యర్థి కంపెనీలతో పోలిస్తే ఇమామీ ఫైనాన్షియల్ పెట్టుబడి వ్యూహాలు లబ్ధి చేకూర్చనున్నట్లు భావించవచ్చు.

ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ | హెచ్‌ఎస్‌బీసీ గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 631
టార్గెట్: రూ. 790

ఎందుకంటే: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ.. ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికాని(ఏప్రిల్–జూన్)కల్లా 8.3 బిలియన్ డాలర్ల నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం)ను కలిగి ఉంది. పలు రాష్ట్రాలలో బహుళ బ్రాంచీల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల కొన్నేళ్లలో పారిశ్రామిక, జాతీయ సంక్షోభాలు ఎదురైన నేపథ్యంలో బిజినెస్‌ను నాలుగు విభాగాలుగా ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు తీసుకుంది. 2016లో లిక్విడిటీకి చెక్ పెట్టిన పెద్ద నోట్ల రద్దు, 2018లో ఫైనాన్షియల్ సిస్టమ్‌ను దెబ్బకొట్టిన ఐఎల్అండ్ఎఫ్ఎస్ దివాలా, 2020–21లో కోవిడ్–19 మహమ్మారి పలు వ్యవస్థలను దెబ్బతీశాయి. అయితే పటిష్ట రిస్క్ మేనేజ్‌మెంట్, పంపిణీ, టెక్నాలజీపై భారీ పెట్టుబడులు, వృద్ధికి వీలుగా భాగస్వామ్యాలు, కొన్ని రుణాలను బ్యాంకులకు విక్రయించే సహ రుణ పద్ధతులు వంటివి కంపెనీ చేపట్టింది. ప్రధానంగా రిటైల్ ఏయూఎంలో పటిష్ట వృద్ధి, అతి




తక్కువ ఆటుపోట్లను చవిచూసే వీలున్న రుణాల నాణ్యత కంపెనీ రీరేటింగ్‌సహా.. ఆర్‌వోఏ మరింత మెరుగుపడేందుకు తోడ్పాటునివ్వగలవని భావిస్తున్నాం. డివిడెండ్ డిస్కౌంట్(గార్డాన్ గ్రోత్) ప్రాతిపదికన వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2024–25) కన్సాలిడేటెడ్ షేరు పుస్తక విలువ (బీవీపీఎస్) అంచనాలను పెంచుతున్నాం. అయితే బిజినెస్‌లలో హెచ్చుతగ్గులు, రుణాల నాణ్యత, సహరుణ నిబంధనలలో సవరణలు, డిజిటల్ రుణాలువంటి కొత్త విభాగాలలోకి ప్రవేశించడం, కఠిన లిక్విడిటీ పరిస్థితులు, ఆర్‌బీఐ రెపో రేటు పెంపు తదితర అంశాలను ప్రధాన రిస్కులుగా పేర్కొనవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఎఫ్‌అండ్‌వో ట్రేడ్ అనుకూల సాధనమేనా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈక్విటీ పథకంలో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఇందుకు వారం వారీ సిప్ లేదా నెలవారీ సిప్ ఏది ఎంపిక చేసుకోవాలి? - అమర్ సహాని

నేను ఈ రెండింటిని పోల్చి ఎటువంటి వివరణాత్మక అధ్యయనం చేయలేదు. కానీ ఫలితాలు యాదృచ్ఛికంగా ఉంటాయని తెలుసు. వారం వారీ సిప్‌ను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్‌మెంట్‌ను మరింత క్లిష్టం చేసుకోవడం ఎందుకు? అన్నది నా అభిప్రాయం. వారం వారీ అంటే నెలలో నాలుగు సార్లు పెట్టుబడుల లావాదేవీలు నమోదవుతాయి. దీంతో లావాదేవీల నివేదిక కూడా చాంతాడంత ఉంటుంది. దీన్ని పరిశీలించుకోవడం కూడా ఇబ్బందే. మూలధన లాభాల విషయాన్ని పరిశీలించినా లావాదేవీలు భిన్న ఎన్ఏవీలతో ఉంటాయి. తిరిగి వీటిని వెనక్కి తీసుకునే సమయంలో మూలధన లాభాల పన్ను లెక్కించడం కూడా క్లిష్టంగా మారుతుంది.

డిజిటల్‌గా ఇన్వెస్ట్ చేస్తున్నాం కదా అని అనుకోవచ్చు. కానీ, తక్కువ మొత్తంతో ఎందుకు అంత తరచుగా సిప్ చేసుకోవడం? దీనికి బదులు మేము అయితే నెలవారీ సిప్‌నే సూచిస్తుంటాం. ఇన్వెస్టర్ల నగదు ప్రవాహ కాలాలకు (నెలవారీ ఆదాయం) అనుగుణంగా ఉంటుంది. మన ఆదాయం నెలవారీగా వస్తుంటుంది. అందుకనే నెలవారీగా ఇన్వెస్ట్ చేసుకోవడం సముచితం. కనుక గతం నుంచి అమల్లో ఉన్న నెలవారీ సిప్‌కు వెళ్లమనే నా సూచన.

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అంటే ఏమిటి? వాటిల్లో ట్రేడ్ చేయవచ్చా? - యోగేష్

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అన్నవి రెండు ప్రముఖ డెరివేటివ్ సాధనాలు. స్టాక్స్‌లో ముందస్తుగా అంగీకరించిన ధరకు, భవిష్యత్తు తేదీపై ట్రేడ్ చేయడం. షేర్లు కొనుగోలు చేయాలంటే విలువ మేర మొత్తం ముందే చెల్లించాలి. కానీ, ఫ్యూచర్స్‌లో అయితే మొత్తం కాంట్రాక్టు విలువలో నిర్దేశిత శాతం ముందు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు ఫ్యూచర్స్‌లోని స్టాక్ కాంట్రాక్టు విలువలో 20 శాతం అనుకుంటే, అచ్చమైన ఈక్విటీలో కొనుగోలు చేసే విలువతో (క్యాష్ మార్కెట్) ఫ్యూచర్స్‌లో అదే మొత్తంతో ఐదు రెట్లు అధికంగా ట్రేడ్ చేసుకోవచ్చు. ఈక్విటీలో రూ.లక్ష కొనుగోలు చేసుకునేట్టు అయితే, అంతే మొత్తంలో ఫ్యూచర్స్‌లో రూ.5 లక్షల విలువ మేర ట్రేడ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ప్రధాన ఉద్దేశ్యం మీ పోర్ట్‌ఫోలియో విలువకు హెడ్జ్ చేసుకోవడమే. కానీ, చాలా మంది వేగంగా డబ్బు సంపాదించేందుకు స్పెక్యులేటివ్‌గా దీన్ని చూస్తుంటారు. ట్రేడింగ్ విజయవంతం అయితే గణనీయమైన లాభాలు వస్తాయి. కానీ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ అన్నది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. ఒక్క ట్రేడ్ బెడిసికొట్టినా అప్పటి వరకు ఎన్నో రోజులుగా సంపాదించిన మొత్తాన్ని కోల్పోవాల్సి వస్తుంది. కొన్ని మ్యూచువల్ ఫండ్స్ పథకాలు.. ఆర్బిట్రేజ్ ఫండ్స్, ఈక్విటీ సేవింగ్ ఫండ్స్, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ హెడ్జింగ్‌ను ఒక విధానంగా ఉపయోగిస్తాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఆకర్షణీయంగా, సులభంగా డబ్బులు సంపాదించే మార్గంగా అనిపించొచ్చు. కానీ ఇది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. గ్యాంబ్లింగ్ కంటే తక్కువేమీ కాదు. ఓ ప్రముఖ ఆన్‌లైన్ బ్రోకర్ సీఈవో సైతం తమ క్లయింట్లలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మందే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో బ్యాంక్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు సంపాదిస్తున్నట్టు ప్రకటించడాన్ని అర్థం చేసుకోవాలి. రిటైల్ ఇన్వెస్టర్లు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కు దూరంగా ఉండడమే సరైనది.

జోయాలుక్కాస్ చైర్మన్‌కు ప్రత్యేక పురస్కారం





జాయ్ అలుక్కాస్

హైదరాబాద్: జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ అలుక్కాస్ ప్రపంచ జ్యువెలరీ సమాఖ్య నుంచి ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. వరల్డ్ జ్యువెలరీ కాన్ఫెడరేషన్(సీఐబీజేఓ) జైపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ 2023 కార్యక్రమంలో సంస్థ ఎండీ జాన్ పాల్ అలుక్కాస్.. చైర్మన్, ఎండీ జాయ్ అలుక్కాస్ తరఫున ఈ గౌరవాన్ని స్వీకరించారు. సప్లై చైన్‌లో నైతిక పద్ధతులు, సుస్థిరతలకు సాటిలేని కృషిని వరల్డ్ జ్యువెలరీ కాన్ఫెడరేషన్ గుర్తించింది. ''ఈ గుర్తింపును మా సంస్థలో ప్రతి ఒక్క సభ్యునితో భాగస్వామ్యం చేస్తున్నాను'' అని జాయ్‌అలుక్కాస్ తెలిపారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కి ప్రతిష్టాత్మక అవార్డు

'బ్రైడల్ స్టేట్‌మెంట్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్' గా గుర్తింపు

హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రతిష్టాత్మక అవార్డు దక్కించుకుంది. ఎఫ్‌యూఆర్ఏ(ఫురా) రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ 2023 కార్యక్రమంలో ''బ్రైడల్ స్టేట్‌మెంట్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్'' అవార్డు సొంతం చేసుకుంది. ఇటీవల వరల్డ్ గోల్డ్ కౌన్సిల్, సాలిటైర్ జెమోలాజికల్ లేబరేటరీస్ సహకారంతో 18 ఎడిషన్ అవార్డుల వేడుకలు ఘనంగా జరిగాయి. అద్భుతమైన డిజైన్లు మాత్రమే కాకుండా భావోద్వేగాలు ప్రతిఫలించేలా ఆభరణాలను రూపొందించడంలో నిబద్ధతను ఈ అవార్డు ప్రస్ఫుటిస్తోందని సంస్థ ఎండీ శ్రీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. భారతీయ సంస్కృతిలో వివాహాల వైభవం, ప్రాముఖ్యతను తెలియజేసే కళాఖండాలను తీర్చిదిద్దడంలో జీఆర్‌టీ పూర్తి అంకితభావాన్ని ప్రదర్శిస్తుందని మరో ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

తెలంగాణ

15 లేదా 16న బీజేపీ తొలి జాబితా

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15 లేదా 16న 38 మంది అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితాను ప్రకటించనున్నట్టు సమాచారం. ఈ నెల 14న అమావాస్య కావడంతో పాటు పితృపక్షం ఉండడంతో, అవి ముగిశాక శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఫస్ట్ లిస్ట్‌ను విడుదల చేయాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. శనివారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యనేతల భేటీలో 38 స్థానాలు, అభ్యర్థులపై చర్చ జరిగినట్టు తెలిసింది. ఈ భేటీలో 21 స్థానాల్లో అభ్యర్థుల పేర్లపై స్పష్టత రాగా, త్వరలోనే మిగతా 17 సీట్లు, అభ్యర్థులపైనా కసరత్తు పూర్తవుతుందని చెబుతున్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర ముఖ్యనేతలు పాల్గొన్నారు. మొత్తం మూడు విడతల్లో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని సమాచారం.

70 నియోజకవర్గాలకు కాంగ్రెస్ టికెట్లు ఖరారు!

- ఈ నెల 16న లేదా 18న తొలి జాబితా విడుదల చేసే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ఓ కొలిక్కి తెచ్చింది. రాజకీయ అనుభవం, కుల సమీకరణాలు, ఆర్థిక పరిస్థితులు, సర్వేలను బేరీజు వేసుకుంటూ దాదాపు 70 స్థానాల్లో అభ్యర్థులను కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఖరారు చేసింది. కమిటీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరని మిగతా సీట్లకు అభ్యర్థుల ఎంపికపై మరోసారి చర్చించాలని నిర్ణయించింది. ఏకాభిప్రాయం రాని స్థానాలకు ఇద్దరు చొప్పున పేర్లతో జాబితా సిద్ధం చేసి పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి పంపాలని.. వారు ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పేర్లను ఖరారు చేయాలని తీర్మానించింది. ఇప్పటికే ఒక్కో పేరును ఖరారు చేసిన నియోజకవర్గాల జాబితాకు సీఈసీ అనుమతి తీసుకుని విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నెల 14 తర్వాత సీఈసీ అభ్యర్థుల జాబితాలను పరిశీలించనుందని.. ఈ నేపథ్యంలో ఈ నెల 16న లేక 18న తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ నెల 15 నుంచి ముఖ్య నేతలతో బస్సు యాత్ర చేపట్టాలని టీపీసీసీ నిర్ణయించడంతో.. ఆ యాత్ర పూర్తయ్యాక అభ్యర్థుల జాబితాను ప్రకటించే ఆలోచన కూడా ఉందని అంటున్నాయి. అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఆదివారం ఢిల్లీలో కమిటీ చైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన భేటీ అయింది.

తిరుపతి పద్మావతిలో మరో గుండె మార్పిడి

- 39 ఏళ్ల యువకుడికి 49 ఏళ్ల వ్యక్తి గుండె
- ఆరు గంటల పాటు చికిత్స
- ప్రాణాలు కాపాడిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ



గుండెను ఆసుపత్రిలోకి తరలిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా(తిరుపతి జిల్లా)/పెనమలూరు: తిరుపతిలోని శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ వైద్యులు మరోసారి గుండె మార్పిడి చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ఆదివారం రాత్రి 39 ఏళ్ల యువకుడికి గుండె మార్పిడి చేశారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలో వైద్యులు అతడి ప్రాణాలను కాపాడారు.

39 ఏళ్ల యువకుడికి 49 ఏళ్ల వ్యక్తి గుండె

ఏలూరు జిల్లా, దొండపూడికి చెందిన మత్తి సురేష్‌బాబు (49) ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని విజయవాడలోని క్యాపిటల్ ఆసుపత్రిలో చేర్చారు. బ్రెయిన్ డెడ్ కావడంతో, కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. ఈక్రమంలో ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన 39 ఏళ్ల యువకుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇందుకోసం అవయవదాన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సీఎంఓకు సమాచారం అందించారు. అన్ని అనుమతులు రావడంతో యువకుడికి 49 ఏళ్ల వ్యక్తి గుండెను అమర్చారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డితోపాటు డాక్టర్ గణపతిలతో కూడిన ఏడుగురు వైద్యులు, టెక్నీషియన్ల బృందం ఆదివారం దాదాపు 6 గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స విజయవంతం చేశారు.

మరోసారి మానవత్వం చాటుకున్న సీఎం వైఎస్ జగన్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. గుండె తరలింపునకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయించారు. చికిత్సకు అవసరమైన రూ.12 లక్షల నిధులను సీఎం రిలీఫ్ ఫండ్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా వెంటనే మంజూరు చేశారు. గుండె తరలింపునకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎంఓను ఆదేశించారు. విజయవాడ నుంచి తిరుపతి చేరుకున్న అనంతరం విమానాశ్రయం నుంచి గుండె తరలింపునకు అధికారులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కేవలం 23 నిమిషాల్లో పద్మావతి కార్డియాక్ ఆసుపత్రికి గుండెను తరలించారు. దారిపొడవునా పోలీసులు ప్రొటోకాల్ పాటించి, కట్టుదిట్టమైన భద్రత ఇచ్చారు.

నలుగురికి పునర్జన్మ

ఏలూరు జిల్లా దొండపూడికి చెందిన మాతి సురేష్‌బాబు (49) ఈనెల ఆరో తేదీన భవనం పైనుంచి పడిపోవడంతో బలమైన గాయాలు అయ్యాయి. బ్రెయిన్ డెడ్ అవడంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. దీంతో కృష్ణాజిల్లా, పెనమూరులోని క్యాపిటల్ ఆస్పత్రి, జీవన్‌దాన్ స్వచ్ఛంద సేవాసంస్థ సహకారంతో కావాల్సిన ఏర్పాట్లు చేశారు. గుండెను శ్రీ పద్మావతి కార్డియాక్ ఆస్పత్రిలోని 39 ఏళ్ల వ్యక్తికి అమర్చారు. కాలేయం, మూత్రపిండం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి, మరో మూత్రపిండం విజయవాడలోని క్యాపిటల్ ఆస్పత్రికి తరలించడంతో సురేష్‌బాబు నలుగురికి పునర్జన్మ ఇచ్చినట్లయింది. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను, బంధువులను ఏపీ జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ కె.రాఘవేంద్రరావు, జీవన్‌దాన్ సంస్థ ప్రధాన వైద్యుడు డాక్టర్ కె.రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.

'ప్రొఫెషనల్'గా బోధన!

కంప్యూటర్ కోర్సుల నిర్వహణపై ఏఐసీటీఈ ప్రత్యేక ఫోకస్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా చాలా కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సుల బోధన పక్కాగా సాగేలా చూడటంపై అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) దృష్టి పెట్టింది. కొత్త కోర్సులకు అనుగుణమైన నైపుణ్యాలు ఉన్న, సమర్థవంతంగా బోధించగల ఫ్యాకల్టీని కాలేజీలు నియమించుకోవడాన్ని తప్పనిసరి చేయనుంది. నాణ్యత ప్రమాణాల్లేని ఫ్యాకల్టీ ఉన్నట్టు గుర్తిస్తే.. సంబంధిత కాలేజీపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని భావిస్తోంది. ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన నిబంధనలతో కూడిన సమగ్ర నివేదికను రూపొందించింది. కేంద్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు దాన్ని పరిశీలించి, సూత్రప్రాయం అంగీకారం కూడా తెలిపారు. ఆ నివేదిక ప్రకారం.. కొత్తగా అందుబాటులోకి వస్తున్న కీలక కంప్యూటర్ కోర్సులను బోధిస్తున్న వారి అర్హతలను గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీలే కాకుండా ఏఐసీటీఈ కూడా ప్రత్యేకంగా పరిశీలించనుంది. ఇందుకోసం కొన్ని బృందాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ సంస్కరణలను ఈ ఏడాది నుంచే అమల్లోకి తేవాలని భావించినా.. కొన్ని అనుమతుల దృష్ట్యా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. త్వరలోనే విధివిధానాలు ఖరారు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి.



- దేశవ్యాప్తంగా కాలేజీల్లో బోధన విధానాలపై ప్రత్యేక నిబంధనలు
- అధ్యాపకుల అర్హతలేమిటో ముందే వెల్లడించాలి
- కోర్సులకు తగిన నైపుణ్యం ఉందో లేదో పరిశీలించాలి
- నాణ్యతా ప్రమాణాల్లేని ఫ్యాకల్టీ ఉంటే కాలేజీల అనుమతులు రద్దు
- ఏఐసీటీఈ నివేదికకు కేంద్ర విద్యాశాఖ సూత్రప్రాయ ఆమోదం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి.. విధివిధానాలపై త్వరలో స్పష్టత

కీలక కోర్సుల బోధనలో..

దేశవ్యాప్తంగా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేవారి సంఖ్య తగ్గుతోంది. తెలంగాణలో 1.05 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉంటే.. ఇందులో 58శాతం కంప్యూటర్ కోర్సులవే. సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు 50 శాతం దాటడం లేదు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి సరికొత్త కోర్సులకు విద్యార్థులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఈ కొత్త కోర్సులు మొదలై రెండేళ్లు గడుస్తున్నా చాలా కాలేజీల్లో బోధన సాధారణ కంప్యూటర్ సైన్స్ కోర్సుల మాదిరిగానే ఉంటోందని ఏఐసీటీఈ గుర్తించింది. ఇప్పటికే కంప్యూటర్ కోర్సులు చేసిన విద్యార్థుల్లో కేవలం 8 శాతం మందిలో మాత్రమే సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి అర్హత గల నైపుణ్యం ఉంటోందని తేల్చింది. ఈ నేపథ్యంలో బోధన విధానంలో గణనీయమైన మార్పుల దిశగా అడుగులు వేస్తోంది.

ప్రొఫెషనల్స్‌తోనే పాఠాలు

ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులను ప్రత్యేక నైపుణ్యంతో బోధించాల్సి ఉంటుందని ఏఐసీటీఈ స్పష్టం చేస్తోంది. చాలా కాలేజీల్లో గత రెండేళ్లు జరిపిన అధ్యయనంలో ఆ తరహా బోధన కనిపించలేదని పేర్కొంటోంది. కాలేజీలు ఎంటెక్ పూర్తి చేసిన సాధారణ ఫ్యాకల్టీతో కోర్సుల బోధన కొనసాగిస్తున్నాయి. వారు కృత్రిమ మేధ (ఏఐ), ఏఐఎంఎల్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులను ఆన్‌లైన్‌లో సెర్చ్‌చేసో, అప్పటికప్పుడు నేర్చుకునో బోధిస్తున్నారు. వారికి ప్రాక్టికల్ అనుభవం ఉండటం లేదు. అలాంటి వారు సమర్థవంతంగా బోధించలేరని ఏఐసీటీఈ అభిప్రాయానికి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులంతా వృత్తిలో ప్రాక్టికల్ నాలెడ్జ్ ద్వారా నైపుణ్యం సంపాదించిన వాళ్లే. ఈ క్రమంలోనే వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న నిపుణులను బోధనకు అనుమతిస్తూ ఏఐసీటీఈ నిర్ణయం తీసుకుంది. ఇక ముందు ప్రతీ కాలేజీలోనూ అలాంటి వారు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన తెచ్చే ఆలోచన చేస్తోంది. ముఖ్యంగా వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థుల చేత పాఠాలు చెప్పించాలని భావిస్తోంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో దీనిని అమలు చేయాలని నిర్ణయించింది. కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ముందే కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ కోర్సులు బోధించే అధ్యాపకుల వివరాలు తెప్పించుకుని.. వారికి అర్హత ఉంటేనే గుర్తింపు ఇవ్వాలనే నిబంధనను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

• తెలంగాణ

దీపావళి బోనస్ రూ.85 వేలు

- ప్రకటించిన కోల్ ఇండియా యాజమాన్యం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గని కార్మికులకు ప్రొడక్షన్ లింక్ రివార్డ్ (పీఎల్ఆర్) దీపావళి బోనస్‌ను కోల్ ఇండియా యాజమాన్యం ప్రకటించింది. కోల్ ఇండియా పరిధిలోని సుమారు 3.50 లక్షల మంది కార్మికులకు ఈ బోనస్ అందనుంది. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఒక్కో కార్మికుడికి రూ.85 వేల చొప్పున చెల్లించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. గతేడాది దీపావళి బోనస్ రూ.76,500 చెల్లించగా, ఈ సంవత్సరం రూ.1.20 లక్షలు ఇవ్వాలని కార్మిక సంఘాలు పట్టుబట్టాయి. చివరకు గతేడాది కంటే రూ.8,500 పెంచి రూ.85 వేల చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. అయితే ఈ పీఎల్ఆర్ బోనస్‌ను సింగరేణి కార్మికులకు మాత్రం దీపావళికి వారం, పది రోజుల ముందు చెల్లిస్తుండగా, ఇతర ప్రాంతాలవారికి దసరా ముందు చెల్లిస్తున్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.